www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 4-3-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 318 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి మ.3.17 తదుపరి షష్ఠి, నక్షత్రం: భరణి రా.2.38 తదుపరి కృత్తిక, వర్జ్యం: మ.1.20-2.49, అమృతఘడియలు: రా.10.12-11.40, దుర్ముహూర్తం: ఉ.8.55-9.42, రా.10.20-11.07, రాహుకాలం: మ. 3.00-4.30, సూర్యోదయం: 6.34, సూర్యాస్తమయం: 6.18 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

6 లేన్లుగా హైదరాబాద్-విజయవాడ హైవే

ఖరారైన డీపీఆర్ కన్సల్టెంట్ సంస్థ

అధ్యయనానికి రూ. 9.86 కోట్ల ఖర్చు

త్వరలో సంస్థతో కేంద్రం ఒప్పందం

ఆరు నెలల్లో కేంద్రానికి నివేదిక

దండు మల్కాపూర్ నుంచి గొల్లపూడి వరకు విస్తరణ 12



కూటమికే జేజేలు!

పట్టభద్ర ఎమ్మెల్సీల్లో తిరుగులేని టీడీపీ

నాడు వైసీపీ హయాంలో 3చోట్ల జయకేతనం

నేడు రెండు స్థానాల్లో గెలుపు దిశగా పయనం

'కృష్ణా-గుంటూరు'లో అనూహ్య ఆధిక్యం

ఒకటో ప్రాధాన్యంలోనే బంపర్ మెజారిటీ

ఉమ్మడి గోదావరిలోనూ భారీ ఆధిక్యంలో..

రెండుచోట్లా అభ్యర్థులనూ నిలపలేని వైసీపీ

వైసీపీ మద్దతు పలికిన అభ్యర్థులకు ఓటర్ల షాక్

లక్ష్మణరావు కొంప ముంచిన ఆ పార్టీ మద్దతు

ముమ్మార్లు ఎమ్మెల్సీగా.. బలమైన నేపథ్యం!

అయినా.. వైసీపీ 'ముద్ర'తో విద్యావంతులు దూరం

ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీపై వైసీపీ వింత ప్రచారం

పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ అభ్యర్థులిద్దరికీ టీడీపీ మద్దతు

పీఆర్టీయూ విజయాన్ని కూటమి ఓటమిగా చెప్పుకొంటూ వైసీపీ 'సంతృప్తి'

ఆ పార్టీ మద్దతు పలికిన అభ్యర్థికి మూడో స్థానం



ఫలితాల సరళికి ముందు కృష్ణా-గుంటూరు పట్టభద్ర అభ్యర్థులు ఆలపాటి రాజా(కూటమి), లక్ష్మణరావు(పీడీఎఫ్) మాటామంతీ



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచిన పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు



ఉభయ గోదావరి పట్టభద్రుల స్థానంలో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం

(అమరావతి/గుంటూరు/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మూడుకు మూడు పట్టభద్ర స్థానాల్లో జయ కేతనం! అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో జరిగిన తొలి ప్రత్యక్ష ఎన్నికల్లోనూ అదే విజయ ప్రస్థానం! కృష్ణా-గుంటూరు, ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో 'కూటమి' గెలుపు జెండా ఎగుర వేయడం ఖాయమైంది. కృష్ణా-గుంటూరు స్థానం నుంచి పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజా అనూహ్య మెజారిటీతో దూసుకెళుతున్నారు. రౌండు రౌండుకూ ఆయన మెజారిటీ పెరుగుతూ... మొదటి ప్రాధాన్య ఓట్లతోనే 'రికార్డు గెలుపు' దిశగా

మిగతా 12వ పేజీలో...

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ..

ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో పీఆర్టీయూ అభ్యర్థి గాదె విజయం

కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ సీటులో

కూటమి అభ్యర్థి ఆలపాటికి ఐదో రౌండ్ తర్వాత 47,872 ఓట్ల మెజారిటీ

గోదావరి పట్టభద్రుల స్థానంలో..

కూటమి అభ్యర్థి పేరాబత్తుల ముందంజ తొలి రౌండ్‌లో 10,705 ఓట్ల ఆధిక్యం

చంద్రబాబుతో పవన్ భేటీ

ఎమ్మెల్సీ అభ్యర్థులు, తల్లికి వందనం,

అన్నదాత సహా పలు అంశాలపై చర్చ

సీఎం చాంబర్లో గంటపాటు సమావేశం

బడ్జెట్ కేటాయింపులు బాగున్నాయ్ 11

అభివృద్ధి, సంక్షేమం బ్యాలెన్స్: జనసేనాని



గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ఉండవల్లి నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

గ్రీన్ హైడ్రో గ్లోబల్ హబ్‌గా ఏపీ

తిరుపతి జిల్లా ఏర్పేడులో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం.. వెయ్యి కోట్లతో ప్లాంట్ ఏర్పాటు

స్థానికంగా 2 వేల మందికి ఉపాధి

తిరుపతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్.. ప్రపంచ కేంద్రంగా మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం ఆయన తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాగాలి గ్రామ సమీపంలోని రాక్‌మెన్ ఇండస్ట్రీస్‌లో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ ఏర్పాటు చేసిన గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్‌ను ఉండవల్లి నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీని ప్రపంచ కేంద్రంగా మార్చే లక్ష్యానికి ఇది తొలి అడుగవుతుందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఏడాదికి 25 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి

మిగతా 3వ పేజీలో...

ఇక డిజిటల్ ఏపీ!

ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంచాలి.. కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి

వాట్సాప్ గవర్నెన్స్‌పైనా అవగాహన కల్పించాలి.. ఫిర్యాదులు, అర్జీలు

కూడా వాట్సాప్‌లో స్వీకరణ.. ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

అన్న క్యాంటీన్లపై 90% సంతృప్తి.. సీఎంకు వివరించిన అధికారులు 3

పోసానిపై వరుసగా పీటీ వారెంట్లు

రాజంపేట నుంచి తొలుత నరసరావుపేటకు

తమకూ అనుమతివ్వాలంటూ

అనంతపురం, అల్లూరి పోలీసుల పిటిషన్లు

మరికొన్ని జిల్లాల పోలీసులూ క్యూలో

నరసరావుపేట కోర్టులో హాజరు

ఈనెల 13 వరకు రిమాండ్

గుంటూరు జిల్లా జైలుకు తరలింపు

గుండెనొప్పి అంటూ రాజంపేటలో మళ్లీ హడావిడి



పోసాని కృష్ణమురళిని రాజంపేట సబ్‌జైలు నుంచి నరసరావుపేటకు తీసుకెళుతున్న పోలీసులు

నరసరావుపేట లీగల్/రాజంపేట/అనంతపురం క్రైం/అమరావతి, మార్చి 3, (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లపై జుగుప్సాకర విమర్శలు చేసిన సినీనటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిపై విచారణ పరంపర కొనసాగుతోంది. పల్నాడు జిల్లా నరసరావుపేట కోర్టులో ఆయన్ని హాజరుపరిచేందుకు అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్‌జైలు నుంచి పీటీ వారెంట్‌పై సోమవారం

మిగతా 12వ పేజీలో...



12

రిమాండ్‌లో మరో రిమాండ్

టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులోనూ వంశీకి

17వరకు రిమాండ్ విధించిన సీఐడీ కోర్టు

కిడ్నాప్ కేసులో ఇప్పటికే జైలులో మాజీ ఎమ్మెల్యే

'వైపీఎస్' జల్సాలకు ఫైర్ సొమ్ము



పెట్రోలు బంకుల కమీషన్ నిధులతోనే విదేశాలకు టికెట్ల కొనుగోలు!

ఖరీదైన సెంటు సీసాలు, లక్షల విలువైన సూట్‌కేసు కూడా..

15 నెలల్లో రూ. 10 లక్షలకు పైగా టీఏ బిల్లులు డ్రా చేసిన వైనం

సునీల్ లీలలు తవ్వేకొద్దీ కుప్పలుతెప్పలుగా బయటకు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నోరు తెరిస్తే అట్టడుగు వర్గాల పేదరికం గురించి మాట్లాడతారు.. మైకు పట్టుకుంటే అణగారిన వర్గాలపై వివక్షపైనే ప్రసంగిస్తారు.. ఇవన్నీ మాటల్లో తప్ప చేతల్లో ఎక్కడా కనిపించవు. పేదరికం గురించి మాట్లాడే ఆయన వాడే సెంటు విదేశాల నుంచి వస్తుంది. చేతికి పెట్టుకునే వాచ్, చేతిలో పట్టుకునే సూట్‌కేసు లక్షల ఖరీదు చేస్తాయి. సూటు, బూటులో ఆయన బ్రాండే వేరు. ఎక్కిదిగే

మిగతా 12వ పేజీలో...

ఇద్దరు ఐపీఎస్‌లపై ఏసీబీ కేసులు

అగ్రిగోల్డ్ డిపాజిటర్ల పేరిట అక్రమాల వ్యవహారంలో సునీల్‌కుమార్‌పై నమోదు

రఘురామ ఫిర్యాదుతో ప్రభుత్వం చర్యలు

స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించిన ఐపీఎస్ పల్లె జాషువాపైనా నమోదుకు ఆదేశం

గవర్నర్ అనుమతి లభించగానే ఇదే కేసులో వైసీపీ మాజీ మంత్రి విడదల రజినిపైనా!

సుంకాల ఆందోళన.. స్టాక్ మార్కెట్ అల్లకల్లోలం

అమెరికాకు గోయల్


కార్యక్రమాలన్నీ రద్దు చేసుకొని హుటాహుటిన

వెళ్లిన కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్

ఐదు రోజుల పాటు అమెరికాలోనే..

సుంకాల తగ్గింపు, వాణిజ్య ఒప్పందంపై చర్చలు

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపర్చడంపై అమెరికా అధికారులతో మంత్రి సమాలోచనలు!



న్యూఢిల్లీ, మార్చి 3: ఓవైపు అమెరికా సుంకాల ఆందోళన.. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ల అల్లకల్లోలం వెరసి.. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ హుటాహుటిన అమెరికాకు బయలుదేరారు. ట్రంప్ సుంకాల ప్రకటనల కారణంగా గత రెండు వారాలుగా దేశీయ స్టాక్ మార్కెట్‌లో తీవ్ర నష్టాలే ఎదురవుతున్నాయి. గత శుక్రవారం ఒక్క రోజులోనే రూ.10 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. తాజాగా సోమవారం సెన్సెక్స్ 112.46 పాయింట్లు నష్టపోవడంతో పాటు నిఫ్టీకి 5 పాయింట్ల మేర నష్టం వాటిల్లింది. ఈ క్రమంలోనే నష్ట నివారణ చర్యల నిమిత్తం గోయల్ తన అధికారిక కార్యక్రమాల్ని రద్దు చేసుకొని మరీ అధికారుల

మిగతా 2వ పేజీలో...

'నాటో' నుంచి వైదొలగాలి

ఐరాస నుంచీ అమెరికా బయటపడాలి

యూఎస్ ఎయిడ్.. క్రిమినల్ సంస్థ: మస్క్

ఖనిజాల ఒప్పందంపై సంతకానికి సిద్ధం

అమెరికా ప్రాధాన్యం అర్థం చేసుకున్నాం!

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యలు

పుతిన్ గురించి ఆందోళన అక్కర్లేదు!

అక్రమ వలసలపై దృష్టి పెట్టాలి: ట్రంప్



11

ఆ రోజుకు 3 రాజధానులు

ఇప్పుడేంటో పార్టీలో చర్చించి చెప్తాం: బొత్స

గంజాయి నిందితులకు 'సంక్షేమం' కట్! 3

ప్రజాభిప్రాయం తీసుకున్నాక తుది నిర్ణయం



లయన్ సఫారీలో సింహాలను తన కెమెరాలో బంధిస్తున్న మోదీ

ఆసియా సింహాలు పెరిగాయ్

సింహాల సంరక్షణలో స్థానిక గిరిజనులు, మహిళల పాత్ర భేష్: మోదీ

ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా గుజరాత్‌లోని

గిర్ అడవుల్లో ప్రధాని లయన్ సఫారీ

సాసన్ (గుజరాత్), మార్చి 3: గిర్ అభయారణ్యంలో ఆసియా సింహాల ఆవాసాలను కాపాడేందుకు స్థానిక గిరిజనులు, మహిళలు చేస్తున్న కృషిని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. వారందరి కృషి వల్ల ఆసియా సింహాల సంఖ్య క్రమంగా పెరుగుతోందని అన్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఉన్న ప్రధాని మోదీ.. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా లయన్ సఫారీ చేశారు. అక్కడ కనిపించిన సింహాలను కెమెరాలో బంధించారు. అనంతరం వాటిని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఈ రోజు ప్రపంచ వన్యప్రాణి

మిగతా 2వ పేజీలో...

తలసరి ఆదాయం 2,68,653

జాతీయ సగటు కంటే మన దగ్గర రూ.68 వేలు అధికం

కూటమి ప్రభుత్వంలో పెరిగిన జీవన ప్రమాణాలు 11

అదుపులోకి నిత్యావసరాల ధరలు.. తేల్చిన సామాజిక ఆర్థిక సర్వే

2024-25లో వృద్ధిరేటు 12.49%.. జీఎస్‌డీపీ 16 లక్షల కోట్లు

అతి పేద జిల్లా కర్నూలు.. ధనిక జిల్లా పశ్చిమ గోదావరి

ఈ నెలలోనే డీఎస్సీ నోటిఫికేషన్

పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు.. దేశంలో ఏపీ నంబర్1 కావాలి

త్వరలో జీవో 117కు ప్రత్యామ్నాయం.. ఎమ్మెల్యేల వర్క్‌షాప్‌లో లోకేశ్ 6

బ్రేక్ దర్శనాలపై మల్లగుల్లాలు! 3

ఇప్పటికే రోజుకు 7500.. ఇప్పుడు టీ-ప్రజాప్రతినిధుల లేఖల ఒత్తిడి

ఎక్కడ తగ్గించాలి.. ఎలా సర్దుబాటు చేయాలి?.. టీటీడీ ఉక్కిరిబిక్కిరి

18 మీటర్ల లోపు ఎత్తు భవన నిర్మాణాలకు

స్వీయ ధ్రువీకరణ ఇస్తే సరి

టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేదు! 6

అందుబాటులోకి సాఫ్ట్‌వేర్.. భవన నిర్మాణదారులకు సర్కారు శుభవార్త



ఆస్కార్ పురస్కారాలతో అనోరా చిత్ర బృందం

అనోరాకు ఆస్కార్ పంట

హాలీవుడ్ చిత్రానికి ఐదు అవార్డులు

ఉత్తమ దర్శకుడిగా సీన్ బేకర్

ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ

ఉత్తమ నటిగా మైకీ మ్యాడిసన్

భారతీయ లఘుచిత్రం 'అనూజ'కు నిరాశ

ఆస్కార్ బృందంలో తెలంగాణ వాసి సుమంత్‌రెడ్డి 6



మైకీ మ్యాడిసన్



నూతన జంటను ఆశీర్వదిస్తున్న సీఎం స్టాలిన్

పెళ్లి చేసుకున్న వెంటనే పిల్లల్ని కనండి

గతంలో కు.ని.పై గట్టిగా దృష్టి పెట్టాం

జనాభా తగ్గితే లోక్‌సభ సీట్లు కోల్పోతాం

పునర్విభజనలో మన రాష్ట్రానికి నష్టం

ఆలోపు ఎక్కువ మంది పిల్లల్ని కనండి

వారికి మంచి తమిళ పేర్లు పెట్టండి

నూతన వధూవరులకు తమిళనాడు సీఎం స్టాలిన్ పిలుపు 2

పోస్టులను తొలగించే ముందు నోటీసు ఇవ్వాల్సిందే!

» సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయం

» ఆరు వారాల్లో స్పందన తెలపాలని కేంద్రానికి నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 3: సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులను తొలగించడానికి ముందు.. సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఐటీ నిబంధనలు-2009ని సవాలు చేస్తూ దాఖలైన ఓ ప్రజాహిత వ్యాజ్యం(పిల్)పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌ల ధర్మాసనం.. ఎవరైనా సోషల్ మీడియాలో ఏదైనా సమాచారాన్ని పోస్టు చేస్తే.. దాన్ని తొలగించే ముందు వారి వాదనలను వినాలని భావిస్తున్నట్లు వెల్లడించింది. 'సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్' అనే సంస్థ ఈ పిల్‌ను దాఖలు చేయగా.. సీనియర్ న్యాయవాది ఇందిరాజైసింగ్ వాదనలను వినిపించారు. "ఐటీ చట్టంలోని సెక్షన్ 69(ఏ) ప్రకారం.. సామాజిక మాధ్యమాల నుంచి సమాచారాన్ని తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే.. ఆ సమాచారాన్ని పోస్టు చేసిన వ్యక్తికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఐటీ నిబంధనలు-2009లోని రూల్-8లో 'వ్యక్తి' అనే పదాన్ని సరిగ్గా నిర్వచించలేదు. రూల్-16 ప్రకారం ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతూ.. చర్యలు తీసుకోవాలి. కానీ, ప్రభుత్వం వ్యక్తులకు కాకుండా.. 'ఎక్స్' వంటి సామాజిక మాధ్యమ సంస్థలకు మాత్రమే నోటీసులు ఇస్తూ.. కంటెంట్‌ను తొలగిస్తోంది" అని వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పోస్టు చేసిన వ్యక్తులను గుర్తిస్తే.. వారి కంటెంట్‌ను తొలగించే ముందు నోటీసులు జారీ చేసి, వారి వాదనలను వినాలని భావిస్తున్నట్లు తెలిపింది. రాజ్యాంగం ప్రకారం వాక్‌స్వాతంత్ర్య హక్కు, జీవించే హక్కుకు భంగం వాటిల్లకూడదని అభిప్రాయపడింది. ఈ పిల్‌పై ఆరు వారాల్లో స్పందన తెలపాలంటూ కేంద్రానికి నోటీసులు జారీ చేస్తూ.. విచారణను వాయిదా వేసింది.




జడ్జి పదవులకు అంధులు అర్హులే

» ఎలాంటి వివక్ష ఉండకూడదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 3: జడ్జి పదవులకు అంధులు అర్హులేనని సోమవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వారి పట్ల ఎలాంటి వివక్ష ఉండకూడదని పేర్కొంది. అంధులు జడ్జి ఉద్యోగాలకు అర్హులు కారన్న నిబంధనను కొట్టివేస్తూ జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. మధ్యప్రదేశ్ జ్యుడీషియల్ సర్వీసెస్ నిబంధనల్లోని రూల్- 6ఏ ప్రకారం అంధత్వం ఉన్నవారు న్యాయాధికార పరీక్షలు రాయడానికి వీల్లేదు. ఈ కారణంగా అంధుడైన తన కుమారుడు పరీక్ష రాయలేకపోయాడని పేర్కొంటూ ఆయన తల్లి అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌కు లేఖ రాశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ రూల్ వివక్షాపూరితంగా ఉందని పేర్కొంటూ కొట్టివేసింది. దివ్యాంగుల హక్కుల చట్టం-2016లోని నిబంధనల ప్రకారం అలాంటి వ్యక్తులకు తగిన సదుపాయాలు కల్పించాలని ఆదేశించింది. జడ్జీల పదవులకు అంధులు అర్హులేనని గతంలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఆ మేరకు రాజస్థాన్, తమిళనాడుల్లో నియామకాలు జరిగాయి.

లోకం తీరు



అమెరికా ప్రాధాన్యాన్ని అర్థం చేసుకున్నాం

» ఖనిజాల ఒప్పందంపై సంతకానికి సిద్ధం: జెలెన్‌స్కీ



కీవ్, మార్చి 3: అమెరికా ప్రాధాన్యాన్ని అర్థం చేసుకున్నానని, ఆ దేశం అందించిన అన్ని రకాల సాయానికి కృతజ్ఞతతో ఉన్నానని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. అమెరికాతో ఖనిజాల ఒప్పందంపై సంతకం చేసేందుకూ సిద్ధమని చెప్పారు. శుక్రవారం శ్వేతసౌధంలో జరిగిన విలేకరుల సమావేశంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, జెలెన్‌స్కీ మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగిన సంగతి తెలిసిందే. అమెరికాకు కనీసం ధన్యవాదాలు కూడా చెప్పలేదని ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. జెలెన్‌స్కీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఖనిజాల ఒప్పందంపై సంతకం చేయకుండానే జెలెన్‌స్కీ వెనుదిరిగారు. ఈ క్రమంలో సోమవారం అమెరికా పట్ల ఆయన స్వరం మారడం గమనార్హం. "మేం అమెరికా పట్ల గౌరవభావంతో లేని రోజంటూ లేదు. మా స్వాతంత్ర్య పరిరక్షణకు, ఉక్రెయిన్‌లో మా ప్రస్తుత స్థితికి మా భాగస్వామి ఏం చేశారు, అదే సమయంలో వారి సొంత భద్రత కోసం ఏం చేశారనేదానిపై ఈ కృతజ్ఞత ఆధారపడి ఉంటుంది" అని జెలెన్‌స్కీ ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. రష్యాతో యుద్ధంపై లండన్‌లో ఈయూ దేశాధినేతలతో జరిగిన కీలక సమావేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ఆదివారం లండన్‌లో జరిగిన సమావేశం అనంతరం జెలెన్‌స్కీ స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. అమెరికాతో ఖనిజాల ఒప్పందంపై సంతకం చేస్తామన్నారు.

యూపీ మహిళకు యూఏఈలో ఉరి

» గత నెల 15న శిక్ష అమలు.. రేపు అంత్యక్రియలు

న్యూఢిల్లీ, మార్చి 3: ఉత్తరప్రదేశ్‌కు చెందిన షహజాదీ ఖాన్ అనే 33ఏళ్ల మహిళను 4 నెలల చిన్నారి మృతి కేసులో హత్య అభియోగాలపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ఉరితీసిందని భారత విదేశాంగ శాఖ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. గత నెల 15న ఆమెను ఉరితీశారని, ఈ నెల 5న అంత్యక్రియలు నిర్వహించనున్నారని అడిషనల్ సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ తెలిపారు. షహజాదీ ఖాన్ తండ్రి షబ్బీర్ ఖాన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో భారత విదేశాంగ శాఖ ఈ వివరాలు వెల్లడించింది. యూపీ బాందా జిల్లాకు చెందిన షహజాదీని ఉజైర్ అనే వ్యక్తి అబుధాబీ వెళ్తే జీవితం బాగుంటుందని మాయమాటలు చెప్పి తన బంధువులైన ఫైజ్-నాడియా దంపతులకు విక్రయించాడు. ఈ క్రమంలో ఆమె 2021 డిసెంబరులో అబుధాబీ చేరుకుంది. ఫైజ్-నాడియా దంపతుల 4 నెలల చిన్నారికి సంరక్షురాలిగా వ్యవహరించేది. 2022 డిసెంబరు 7న వ్యాక్సినేషన్లు ఇవ్వగా చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. దంపతులు ఆమెపై హత్య ఆరోపణలు మోపారు. యూఏఈ న్యాయస్థానం ఆమెకు మరణ శిక్ష విధించింది. మరోవైపు ఫైజ్-నాడియా దంపతులపై మానవ అక్రమ రవాణా కేసు నమోదైంది.

మాదిగ వర్గ ఎమ్మెల్యేలతో మందకృష్ణ భేటీ



విజయవాడ(విద్యాధరపురం), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై మాదిగ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో మంద కృష్ణమాదిగ అత్యవసర సమావేశం నిర్వహించారు. విజయవాడ విద్యాధరపురంలోని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఇంట్లో సోమవారం భేటీ అయ్యారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న విధానంపై ఎమ్మెల్యేలు, నాయకులకు మంద కృష్ణమాదిగ వివరించారు.

'ఐఐటీ బాబా'పై గంజాయి కేసు

» రాజస్థాన్‌లో అరెస్టు చేసిన పోలీసులు

జైపూర్, మార్చి 3: మహాకుంభమేళా సమయంలో 'ఐఐటీ బాబా'గా ప్రాచుర్యం పొందిన అభయ్ సింగ్‌ను గంజాయి కేసులో రాజస్థాన్‌లోని జైపూర్‌లో పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై మాదకద్రవ్యాలు, మానసిక వ్యసన పదార్థాల చట్టం (ఎన్‌డీపీఎస్) కింద కేసు నమోదు చేశారు. జైపూర్‌లోని ఓ హోటల్‌లో దిగిన అభయ్ సింగ్.. అక్కడ గొడవ చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు.. ఆయన వద్ద నుంచి స్వల్ప మొత్తంలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆయన వద్ద దొరికిన గంజాయి అనుమతించదగిన పరిమితిలోనే ఉండడంతో కొంతసేపు నిర్బంధం తర్వాత పోలీసులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. పోలీసుల నిర్బంధం నుంచి బయటకొచ్చిన తర్వాత ఐఐటీ బాబా మీడియాతో మాట్లాడుతూ తన వద్ద దొరికింది 'ప్రసాదం' అని, కుంభ్‌లోని దాదాపు ప్రతి బాబా గంజాయిని ప్రసాదంగా స్వీకరిస్తారని పేర్కొన్నారు.

కేరళ వ్యక్తిని కాల్చి చంపిన జోర్డాన్ సైన్యం

న్యూఢిల్లీ, మార్చి 3: జోర్డాన్ సైన్యం ఓ భారతీయుడిని కాల్చి చంపింది. జోర్డాన్ సరిహద్దు నుంచి అక్రమంగా ఇజ్రాయెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో అతడిపై కాల్పులు జరిపింది. ఈ దాడిలో మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన ఫిబ్రవరి 10న జరిగింది. ఈ మేరకు జోర్డాన్‌లోని భారత రాయబార కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది. మరణించిన వ్యక్తిని కేరళకు చెందిన 47 ఏళ్ల థామస్ గ్రేబియేల్ పెరెరాగా గుర్తించారు. థామస్ పర్యాటక వీసాపై ఫిబ్రవరి మొదటివారంలో జోర్డాన్ వెళ్లాడు. అక్కడి నుంచి అతని బంధువు ఎడిసన్‌తో కలిసి ఇజ్రాయెల్‌లోకి అక్రమంగా ప్రవేశించాలని ప్రయత్నించాడు. ఈ క్రమంలో థామస్‌ను ఆపేందుకు జోర్డాన్ జవాన్లు యత్నించినా అతడు వినకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాల్పులు జరిపారని థామస్ కుటుంబసభ్యులకు భారత రాయబార కార్యాలయం ఈమెయిల్‌లో సందేశం పంపింది.

ఆసియా సింహాలు పెరిగాయ్

(మొదటి పేజీ తరువాయి)

దినోత్సవం. ఈ సందర్భంగా ఆసియా సింహాల ఆవాసానికి నిలయమైన గిర్ అటవీ ప్రాంతానికి వెళ్లడం చాలా ఆనందంగా ఉంది. నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న చర్యలకు సంబంధించి అనేక జ్ఞాపకాలు గుర్తుకువచ్చాయి. కొన్నేళ్లుగా ఇక్కడ చేస్తున్న సమష్టి కృషి వల్ల ఆసియా సింహాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. సింహాల ఆవాసాలను కాపాడడంలో గిరిజన సంఘాలు, స్థానిక మహిళల పాత్ర ప్రశంసనీయం' అని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. గత పదేళ్లలో పులులు, చిరుతలు, ఖడ్గమృగాల సంఖ్య కూడా పెరిగిందని అన్నారు. వన్యప్రాణులను మనం ఎంతగానో ప్రేమిస్తున్నామని, జంతువులకు సుస్థిర ఆవాసాలను నిర్మించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వెంట కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, ఇతర మంత్రులు, అటవీశాఖ ఉన్నతాధికారులు ఉన్నారు. అనంతరం గిర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ప్రధాన కార్యాలయమైన సాసన్ గిర్‌లో జరిగిన జాతీయ వన్యప్రాణి బోర్డు సమావేశానికి ప్రధాని హాజరయ్యారు. కాగా.. ఆసియా సింహాల పరిరక్షణకు ఉద్దేశించిన లయన్ ప్రాజెక్టు కోసం రూ.2,900 కోట్లకు ఆమోదం లభించిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

'క్రిప్టో' మార్కెట్‌కు ట్రంప్ జోష్

అమెరికా వ్యూహాత్మక రిజర్వులో చేర్చబోయే.. ఐదు క్రిప్టో కరెన్సీల పేర్లను వెల్లడించిన ట్రంప్

రూ.26 లక్షల కోట్ల మేర పెరిగిన మార్కెట్ విలువ

వాషింగ్టన్, మార్చి 3: క్రిప్టో కరెన్సీతో వ్యూహాత్మక రిజర్వు ఏర్పాటుకు గతంలోనే కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా ఆ రిజర్వులో ఉంచబోయే క్రిప్టో కరెన్సీల పేర్లను వెల్లడించారు. ఎక్స్ఆర్‌పీ, సోలానా (ఎస్‌వోఎల్), కార్డానో (అడా) అనే మూడు క్రిప్టో కరెన్సీలతో వ్యూహాత్మక రిజర్వు ఏర్పాటు చేయాల్సిందిగా ప్రెసిడెన్షియల్ వర్కింగ్ గ్రూప్‌ను ఆదేశించినట్టు ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' పోస్టు ద్వారా తొలుత ఒక ప్రకటన చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే.. బిట్‌కాయిన్, ఎథేరియం పేర్లను కూడా ప్రస్తావిస్తూ మరో పోస్టు పెట్టారు. క్రిప్టో కరెన్సీ రిజర్వుకు ఆ రెండూ ఆయువుపట్టుగా ఉంటాయని.. తనకు బిట్‌కాయిన్, ఎథేరియం అంటే ఇష్టమని పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటన క్రిప్టో మార్కెట్‌లో పెను సంచలనం సృష్టించింది. ఒక్కసారిగా క్రిప్టో కరెన్సీల విలువలు పెరిగిపోయాయి. బిట్‌కాయిన్ విలువ 10% పెరగ్గా.. ఎథేరియం విలువ 13% మేర పెరిగింది. 90వేల డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్న బిట్‌కాయిన్ విలువ.. ట్రంప్ ప్రకటనతో లక్ష డాలర్ల మార్కు దిశగా పరుగులు తీస్తోంది. మొత్తంగా ట్రంప్ రెండు పోస్టులతో క్రిప్టో కరెన్సీ మార్కెట్ విలువ 300 బిలియన్ డాలర్లకు పైగా (దాదాపు రూ.26 లక్షల కోట్ల మేర) పెరిగింది. ఇంతకీ ట్రంప్ ప్రకటించిన ఈ వ్యూహాత్మక క్రిప్టో రిజర్వు ఏమిటి? అంటే.. ప్రతి దేశమూ ద్రవ్యోల్బణం నుంచి తన కరెన్సీ విలువను, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి బంగారాన్ని రిజర్వు చేసుకుంటుంది. దీన్నే గోల్డ్ రిజర్వ్ అంటారు. అలాగే, చమురు ధరల్లో



మార్కెట్ హెచ్చుతగ్గులు, ఒడుదొడుకుల నుంచి కాపాడుకోవడానికి చమురును రిజర్వు చేసుకోవడం కద్దు. అది ఆయిల్ రిజర్వ్. ఇలా అనూహ్య ఒత్తిళ్ల నుంచి తమ మార్కెట్లను కాపాడుకోవడానికి అన్ని దేశాలూ పలు ఉత్పత్తులతో కూడిన రిజర్వులను ఏర్పాటు చేసుకుంటాయి. ఇదే క్రమంలో అమెరికా తన కరెన్సీ విలువను కాపాడుకోవడానికి డిజిటల్ కరెన్సీతో వ్యూహాత్మక రిజర్వ్ ఏర్పాటుకు సిద్ధమైంది. ఇంతకీ ఈ బిట్‌కాయిన్ల రిజర్వును అమెరికా ప్రభుత్వం ఎలా ఏర్పాటు చేస్తుంది? బిట్‌కాయిన్ మైనింగ్ అంత సులువు కాదు కదా? అంటే.. మైనింగ్ చేయాల్సిన అవసరం లేకుండానే అగ్రరాజ్యం వద్ద పెద్ద ఎత్తున క్రిప్టో కరెన్సీ ఉన్నట్టు సమాచారం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ దొరికిపోయినవారి నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న బిట్‌కాయిన్ల విలువే 19 బిలియన్ డాలర్ల (రూ.1.65 లక్షల కోట్ల) దాకా ఉంటుందని అంచనా. చైనా కూడా ఇదే తరహాలో పెద్ద ఎత్తున క్రిప్టో కరెన్సీ రిజర్వులను కలిగి ఉన్నట్టు చెబుతారు. అలాగే.. ఒక దేశం అధికారికంగా క్రిప్టో కరెన్సీ రిజర్వును ఏర్పాటు చేసుకోవడం ఇదే మొదలు కాదు. గతంలో ఎల్‌సాల్వడార్ క్రిప్టో కరెన్సీ రిజర్వును ఏర్పాటు చేసుకుంది.

పుతిన్ గురించి ఆందోళన అక్కర్లేదు!

» వలసదారులు, హంతకులపైనే దృష్టి పెట్టాలి: ట్రంప్

వాషింగ్టన్, మార్చి 3: రష్యా అధ్యక్షుడు పుతిన్ గురించి ఎక్కువగా ఆలోచించాల్సిన, చింతించాల్సిన అవసరం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. దానికి బదులు దేశంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. ఆయన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. "పుతిన్ గురించి ఎక్కువగా ఆందోళన చెందనక్కర్లేదు. దానికి సమయం తగ్గించి.. వలసదారుల అత్యాచార ముఠాలు, డ్రగ్ లార్డ్స్, హంతకులు, మానసిక వైద్యశాలల నుంచి మన దేశంలోకి వస్తున్నవారిపై దృష్టి పెట్టాలి. ఈ అంశాలపై ఎక్కువ సమయం కేటాయించాలి. అప్పుడే మనం యూరోప్‌లా మారకుండా ఉంటాం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జరిగిన విలేకరుల సమావేశంలో తీవ్ర వాగ్వాదం జరిగిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

'నాటో' కూటమి నుంచి

అమెరికా వచ్చేయాలి

ఐరాస నుంచి కూడా..: ఎలాన్ మస్క్

వాషింగ్టన్, మార్చి 3: పరస్పర రక్షణ కోసం ఉద్దేశించిన 'నాటో' దేశాల కూటమి నుంచి అమెరికా బయటకు వచ్చేయాలని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. ఐక్యరాజ్య సమితి (ఐరాస) నుంచి కూడా బయటపడాలని సూచించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంత్రివర్గంలో ఆయన సభ్యుడు కానప్పటికీ, ప్రభుత్వ వ్యయాలను తగ్గించడానికి ఉద్దేశించిన ప్రభుత్వ సామర్థ్య విభాగా (డోగ్)నికి ఆధిపత్యం వహిస్తుండడం గమనార్హం. శనివారం ఎవరో ఒక వ్యక్తి 'నాటో, ఐరాస నుంచి అమెరికా బయటకు రావాల్సిన సమయం వచ్చింది' అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. ఇందుకు మస్క్ స్పందిస్తూ.. 'నేను అంగీకరిస్తున్నా' అని పేర్కొన్నారు. వివిధ దేశాలకు ఆర్థిక సాయం చేయడానికి ఉద్దేశించిన 'యూఎస్ ఎయిడ్' సంస్థను కూడా ఆయన 'క్రిమినల్ ఆర్గనైజేషన్'గా పేర్కొనడం గమనార్హం. ప్రభుత్వ వ్యయాల తగ్గింపు పేరుతో ఆ సంస్థను రద్దు చేయించడానికి కూడా ప్రయత్నిస్తుండడం గమనార్హం. ట్రంప్ కూడా నాటో కూటమిపై అసంతృప్తితో ఉన్నారు. అమెరికా సెనేటర్ మైక్ లీ వంటి వారు మస్క్‌కు మద్దతు తెలిపారు.

అమెరికా వైదొలగితే ఏమవుతుంది?

పశ్చిమ దేశాల ఉమ్మడి రక్షణ కోసం 1949లో నాటో ఏర్పాటయింది. నాటో నుంచి అమెరికా బయటకు వచ్చేస్తే మిలటరీ సామర్థ్యం, నిధులపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. రష్యాను అడ్డుకోవడం కష్టమవుతుంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఐక్యరాజ్యసమితి ఏర్పాటయింది. దీని నుంచి కూడా అమెరికా వచ్చేస్తే అధికార సమతౌల్యత మారుతుంది. అంతర్జాతీయ విధానాల రూపకల్పనలో ఇతర దేశాల ప్రభావం పెరుగుతుంది.



గల్లంతైన వారి కోసం గాలిస్తున్న మత్స్యకారులు, ఫైర్ సిబ్బంది

గోదావరిలో నాటు పడవ బోల్తా

» ఒకరు మృతి, మరొకరు గల్లంతు

» రాజమహేంద్రవరంలో ఘటన

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం వద్ద గోదావరిలో విషాదం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి నదిలో ప్రమాదవశాత్తూ ఒక నాటు పడవ బోల్తా పడిన ఘటనలో ఒకరు మరణించగా.. మరొకరు గల్లంతయ్యారు. వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరంలోని సింహాచల్‌నగర్, భవానీపురం, శాంతిపురం తదితర ప్రాంతాలకు చెందిన 23 మంది సోమవారం మధ్యాహ్నం పుష్కరఘాట్‌కు 700 మీటర్ల దూరంలోని బ్రిడ్జిలంకకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 7.30 గంటల ప్రాంతంలో పడవలో 11 మందిని పుష్కరఘాట్‌లో దింపారు. మిగిలిన వారిని తీసుకురావడానికి పడవ మళ్లీ వెళ్లింది. బ్రిడ్జిలంకలో ఉన్న మిగతా 11 మందిని ఎక్కించుకుని వస్తుండగా.. పాత రైలు వంతెన 8వ పిల్లర్ వద్దకు వచ్చేసరికి పడవలోకి నీళ్లు రావడం చూసి అందరూ కంగారు పడ్డారు. ఆ హడావుడికి పడవ బోల్తా పడింది. 9 మంది నీటిలోకి దూకి, అక్కడి స్తంభాన్ని పట్టుకుని కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కల ఉన్న మత్స్యకారులు ఆ 9 మందిని ఒడ్డుకు చేర్చి వెళ్లిపోయారు. కాసేపటికి పడవ నడిపిన వ్యక్తి ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. ఈ ఘటనలో సింహాచల్ నగర్‌కు చెందిన కావల అన్నవరం(52), భవానీపురానికి చెందిన గాడా రాజు(23) అనే ఇద్దరు గల్లంతయ్యారు. వీరిలో కొద్దిసేపటికి అన్నవరం మృతదేహం లభ్యమైంది.

బీఎస్పీ నుంచి మేనల్లుడిని బహిష్కరించిన మాయావతి

న్యూఢిల్లీ, మే 3: బీఎస్పీ నుంచి తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను బహిష్కరిస్తూ సోమవారం ఆ పార్టీ చీఫ్ మాయావతి నిర్ణయం తీసుకున్నారు. ఆకాశ్ ఆనందే ఆమె వారసుడని ఇంతవరకు భావించగా, ప్రస్తుతం పార్టీ నుంచి తొలగించడం గమనార్హం. పార్టీ ప్రయోజనాలను కాదని మామ అశోక్ సిద్ధార్థ్ ప్రభావంతో పనిచేస్తుండడమే ఇందుకు కారణమని తెలిపారు. రాజకీయ పరిపక్వత లేకుండా, స్వార్థంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. తన జీవిత కాలంలో వారసుడి పేరును ప్రకటించబోనని స్పష్టం చేశారు. ఆదివారం ఆనంద్‌ను పార్టీ నేషనల్ కోఆర్డినేటర్, ఇతర పార్టీ పదవుల నుంచి తొలగించారు. నేషనల్ కోఆర్డినేటర్ పదవిని ఆయన తండ్రి ఆనంద్ కుమార్‌కు ఇవ్వడం గమనార్హం. రాజ్యసభ సభ్యుడు రామ్‌జీ గౌతమ్‌ను కూడా మరో జాతీయ కోఆర్డినేటర్‌గా ప్రకటించారు.

అమెరికాకు గోయల్

(మొదటి పేజీ తరువాయి)

బృందంతో అమెరికాకు బయలుదేరారు. మార్చి 8 వరకు అక్కడే ఉండి యూఎస్ అధికారులతో అత్యవసర వాణిజ్య చర్చలు జరిపే అవకాశమున్నట్టు తెలుస్తోంది. ప్రతిపాదిత సుంకాల గురించి అగ్ర దేశాన్ని స్పష్టత కోరడం, వాటి వల్ల దేశంపై పడే ప్రభావాన్ని అంచనా వేయడం వంటి విషయాలతో సుంకాల తగ్గింపు, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మెరుగుపర్చడానికి రూపొందించిన వాణిజ్య ఒప్పందంపై చర్చలు వంటి వాటిపై కేంద్రమంత్రి దృష్టి పెట్టినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 'భారత్ ఆటోమొబైల్స్, రసాయనాల వంటి వాటి పారిశ్రామిక వస్తువులపై సుంకాలను తగ్గించడానికి అగ్రదేశంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నాం. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి భారత్ ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. హై ఎండ్ మోటార్ సైకిళ్లపై సుంకాలు 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించింది. బోర్బన్ విస్కీ టారిఫ్‌లను 150 నుంచి 100 శాతానికి తగ్గించింది. ఇతర టారిఫ్‌లను సమీక్షిస్తామని.. ఇంధన దిగుమతులను పెంచడానికి చర్యలు తీసుకుంటామని కేంద్రం తెలిపింది. అమెరికా భారత్‌పై విధించే పరస్పర టారిఫ్‌ల వల్ల భారత్‌కు ఏడాదికి 7 బిలియన్ డాలర్ల వరకు నష్టం వాటిల్లుతుందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక సైతం వెల్లడించింది.

మహిళలకే కంపెనీలు జై!

» 48% పెరిగిన ఉద్యోగ అవకాశాలు

» ఏఐ ఆధారిత విభాగాల్లోనూ పైచేయి

» 'ఫౌండిట్-2025' నివేదిక వెల్లడి

బెంగళూరు, మార్చి 3: దేశంలో మహిళా ఉద్యోగుల పంట పండుతోంది. మహిళా ఉద్యోగులను నియమించుకునేందుకు కంపెనీలు పోటీ పడుతున్నాయి. దీంతో వారికి ఎనలేని అవకాశాలు కల్పిస్తున్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే 2025లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు 48% పెరిగినట్టు తాజాగా ఫౌండిట్ అధ్యయనం వెల్లడించింది. మరీ ముఖ్యంగా కొత్తవారికి విస్తృతమైన అవకాశాలు ఉన్నట్టు తెలిపింది. కీలకమైన ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ), బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఇన్సూరెన్స్, తయారీ రంగం, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో మహిళలకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నట్టు అధ్యయనం పేర్కొంది. ఈ ఏడాది 25% మంది కొత్తవారికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపింది. కెరీర్ ప్రారంభంలో ఉన్న మహిళలకు మరింత ఎక్కువ డిమాండ్ ఉందని, ప్రధానంగా ఐటీ, మానవ వనరులు(హెచ్ఆర్), మార్కెటింగ్ విభాగాల్లో అవకాశాలు ఎక్కువగా వస్తున్నట్టు పేర్కొంది. ఇక, అనుభవం పరంగా చూసుకున్నా.. ఆయా రంగాల్లో 3 ఏళ్ల అనుభవం ఉన్న వారికి 53%, 4 నుంచి ఆరేళ్ల అనుభవం ఉన్నవారికి 32% అవకాశాలు వస్తున్నాయని తెలిపింది. పరిశ్రమలు, ఐటీ, కంప్యూటర్, అకౌంట్స్ విభాగాల్లో మహిళలకు 34% ఉద్యోగావకాశాలు పెరిగాయని నివేదిక వివరించింది. "భారత జాబ్ మార్కెట్‌లో మహిళలకు మరిన్ని అవకాశాలు పెరిగాయి. ముఖ్యంగా పరిశ్రమలు, టెక్నాలజీ విభాగాల్లో వారికి అపారమైన అవకాశాలు ఉన్నాయి" అని ఫౌండిట్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అనుపమ తెలిపారు. కృత్రిమ మేధ(ఏఐ)కు సంబంధించిన సైబర్ భద్రత, డేటా సైన్స్ క్లౌడ్ కంప్యూటింగ్ వంటి సాంకేతిక విభాగాల్లోనూ నైపుణ్యం ఉన్న మహిళలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు.

నల్లగొండలో పీఆర్‌టీయూ

కరీంనగర్‌లో బీజేపీ

తెలంగాణ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం

పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్ నేడు ప్రారంభం

కరీంనగర్/నల్లగొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో పీఆర్‌టీయూ, బీజేపీ సత్తా చాటాయి. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ గెలుచుకోగా, నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఎమ్మెల్సీ స్థానాన్ని పీఆర్‌టీయూ దక్కించుకుంది. కరీంనగర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఘనవిజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, పీఆర్‌టీయూ బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై 5,777 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. నల్లగొండ స్థానానికి జరిగిన హోరాహోరీ పోరులో పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, సిటింగ్ ఎమ్మెల్సీ అయిన టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిపై గెలుపొందారు. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,041 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 24,144 ఓట్లు చెల్లుబాటు కాగా, అభ్యర్థి గెలుపొందడానికి 12,081 ఓట్లను కోటా ఓటుగా నిర్ధారించారు. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు 12,959 ఓట్లు రాగా ఆయన సమీప పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి 7182 ఓట్లు వచ్చాయి. ఇక కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఓట్లను లెక్కించేందుకు 21 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 56 మంది అభ్యర్థులు పోటీ చేయగా.. మొత్తం 2,50,106 ఓట్లు పోలయ్యాయి. వీటి నుంచి చెల్లిన, చెల్లని ఓట్లను వేరు చేసే ప్రక్రియ సోమవారం రాత్రి వరకూ పూర్తికాలేదు. కట్టలు కట్టే ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం పూర్తయ్యే అవకాశముందని, ఆ తర్వాత నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభం కావచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్లు ఎక్కువగా పోలవడానికి కారణం ఓటింగ్‌పై అవగాహన కల్పించక పోవడమేనని పలువురు స్వతంత్ర అభ్యర్థులు ఆరోపించారు. చెల్లని ఓట్లు అధికంగా నమోదైనందున తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పెళ్లి చేసుకున్న వెంటనే పిల్లల్ని కనండి

» నూతన వధూవరులకు తమిళనాడు సీఎం స్టాలిన్ వినతి

» జనాభా తగ్గడంతో లోక్‌సభ సీట్లకు గండి

» పునర్విభజనలో నష్టం కలుగుతుంది

» ఎక్కువ మంది పిల్లల్ని కనాలని పిలుపు

చెన్నై, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పునర్విభజనలో తమ రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాలు తగ్గిపోతాయంటూ గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్.. జనాభాను పెంచడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇకపై కొత్తగా పెళ్లి చేసుకునే వధూవరులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పిల్లల్ని కనాలని ఆయన కోరారు. పునర్విభజన ప్రక్రియ మొదలయ్యేలోగా ఎక్కువ మంది పిల్లల్ని కంటే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. సోమవారం నాగపట్టణం జిల్లా పర్యటన సందర్భంగా ఓ వివాహ వేడుకలో పాల్గొన్న సీఎం వేదికపై మాట్లాడుతూ.. గతంలో పెళ్లయిన వెంటనే పిల్లల్ని కనవద్దని, కాస్త వేచి చూడాలంటూ విజ్ఞప్తి చేసేవారమన్నారు. కానీ, ఇపుడు అలా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎందుకంటే రాష్ట్ర జనాభా లెక్కల ప్రకారం



రిజర్వేషన్లు, పార్లమెంట్ స్థానాల సంఖ్యను నిర్ధారిస్తామని కేంద్రం చెబుతోందని, అలా జరిగితే అధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు అధికంగా వస్తాయన్నారు. కానీ, మనమంతా కుటుంబ నియంత్రణపై గట్టిగా దృష్టి పెట్టి విజయం సాధించామన్నారు. ఇపుడు లోక్‌సభ సీట్ల కేటాయింపులో రాష్ట్రానికి అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇకపై కొత్తగా పెళ్లి చేసుకున్నవారు వెంటనే పిల్లల్ని కనాలని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే తమ సంతానానికి కూడా అందమైన తమిళ పేరును పెట్టాలని సూచించారు. ఇదే తన హృదయపూర్వక వినతిగా పేర్కొన్నారు. దివంగత కలైంజర్ కృషి ఫలితంగా తమిళ భాషకు ప్రాచీన హోదా వచ్చిందని, అలాంటి ప్రాచీన భాషలో పిల్లలకు పేర్లు పెట్టాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు.

ఇక డిజిటల్ ఏపీ!



ఆర్టీజీఎస్‌పై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రులు నారాయణ, అనిత, అచ్చెన్నాయుడు, శ్రీనివాస్, సీఎస్ విజయానంద్

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ డిజిటల్ అక్షరాస్యుడిగా మారేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇలా చేయడం ద్వారా రాష్ట్రాన్ని డిజిటల్ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేయాలని సూచించారు. ఈ దిశగా అధికారులు కూడా కృషి చేయాలని ఆదేశించారు. డిజిటల్ అక్షరాస్యత పెరిగితే.. వాట్సాప్ గవర్నెన్స్ ఉపయోగించడమూ పెరుగుతుందని సీఎం చెప్పారు. పీపుల్స్ పర్సెప్షన్, ఆర్టీజీఎస్‌పై సోమవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలను అందించడంతో పాటు.. ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలు స్వీకరిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ సదుపాయం గురించి ప్రజలకు వివరించాలన్నారు. నిరక్షరాస్యులు కూడా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తమ ఫిర్యాదులు ప్రభుత్వానికి పంపేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం ప్రజలందరూ వాట్సాప్ గవర్నెన్స్ సులభంగా ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని, జిల్లా కలెక్టర్లందరూ ఈ బాధ్యతలను తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ స్థాయిలో కూడా వాట్సాప్ సేవలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాలు, సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాల్లో దీని గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని చెప్పారు. డేటా లేక్ అనుసంధాన ప్రక్రియ కూడా వేగవంతంగా జరగాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వం నుంచి ఏ సేవ కావాలన్నా అధికారుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా కేవలం తమ ఫోనులో వా ట్సాప్ ద్వారా సేవలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కల్పిస్తోందన్నారు.

నెలాఖరుకు 350 సేవలు

ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 200 సేవలు అందిస్తున్నామని.. ఈ నెలాఖరుకు మరో 150 సేవలు అందబాటులోకి తీసుకువస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ వివరించారు. ఈ నెలాఖరుకు మొత్తంగా 350 సేవలు, అనంతరం మొత్తంగా 500 సేవలకు విస్తరిస్తామని భాస్కర్ వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ను పెద్దఎత్తున ఉపయోగించి "వన్ స్టేట్.. వన్ యాప్" విధానంలో ప్రజలందరికీ ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెస్తామన్నారు.

అన్న క్యాంటీన్‌లలో భోజనం భేష్

అన్న క్యాంటీన్‌లలో భోజనం చాలా బాగుందన్న ఫీడ్‌బ్యాక్ వస్తోందని.. క్యాంటీన్‌లలో తింటున్నవారు సంతృప్తి చెందుతున్నారని సీఎం చంద్రబాబుకు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అన్న క్యాంటీన్ నిర్వహణపై 90 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు పి.నారాయణ, కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎం ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆర్టీజీఎస్ డిప్యూటీ సీఈవో మాధురి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ హైడ్రో గ్లోబల్ హబ్‌గా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యంతో ఈ ప్లాంటు ఏర్పాటు చేసినా.. 54 టన్నులకు పెంచుకునే అవకాశముందన్నారు. మొత్తం రూ. 1,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన ప్లాంట్ ద్వారా స్థానికంగా 2 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ ప్లాంటు వల్ల ఏడాదికి 206 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను తగ్గించడంతో పాటు వాతావరణంలోకి ఏడాదికి 190 టన్నుల నుంచీ 195 టన్నుల వరకూ ఆక్సిజన్ విడుదల అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పారిశ్రామిక అవసరాల కోసం సీఎన్జీ, ఎల్పీజీలతో గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్‌కు సరికొత్త విధానాన్ని అనుసరిస్తోందని వివరించారు. ఈ సాంకేతిక విధానం కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గిస్తుందన్నారు.

దేశానికి ఆదర్శంగా..

తిరుపతి జిల్లాలో ప్రవేశపెట్టిన ఈ విధానం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో, అలాగే దేశవ్యాప్తంగా ఇతర పరిశ్రమల్లో కూడా అనుసరించడానికి వీలుగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో తొలి గ్రీన్ హైడ్రోజన్ బ్లెండింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 ప్రకారం 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, రూ. 10 ట్రిలియన్ల పెట్టుబడిని సాధిస్తామనే విశ్వాసం కలుగుతోందన్నారు. హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థ పర్యావరణ పరిరక్షణకు పనిచేస్తోందని సీఎం చంద్రబాబు కితాబిచ్చారు.

దేశ, ప్రపంచ మార్కెట్లకు అనువుగా ఏపీ

ఓడరేవులు, బలమైన లాజిస్టిక్ నెట్ వర్క్ కలిగి వున్న ఏపీ దేశ, ప్రపంచ మార్కెట్ అవసరాలను తీర్చడానికి అనువుగా ఉందన్నారు. అలాగే గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతులకు కేంద్రంగా ఆవిర్భవించడానికి కూడా ఏపీ అనువుగా ఉందన్నారు. రాష్ట్రంలో విస్తారంగా ఉన్న వనరులను వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు ఈ సందర్భంగా సీఎం పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాగాలిలోని రాక్‌మెన్ ఇండస్ట్రీస్‌లో జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ గ్లోబల్ సీఈవో శ్రీనివాస్ అయ్యర్, రాక్‌మన్ ఇండస్ట్రీస్ ఎండీ ఉజ్వల్ ముంజాల్, సీఈవో కౌశిక్ మన్నా, ఓహ్మియం ఇంటర్నేషనల్ సీఈవో ఆర్నే బలంటైన్, స్థానిక ప్లాంట్ హెడ్ జగదీశన్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిట్ కస్టడీకి 'కల్తీ నెయ్యి' నిందితులు

- ఏ3, ఏ5లను అప్పగించిన కోర్టు
- ఏ5 బెయిల్ పిటిషన్ విచారణ 6కు వాయిదా
- ఏ3, ఏ4ల తరఫున మళ్లీ బెయిల్ పిటిషన్ దాఖలు

తిరుపతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి కేసు నిందితులు పొమిల్ జైన్, అపూర్వ వినయ్ కాంత్ చావడాలను కోర్టు మూడు రోజుల సిట్ కస్టడీకి అప్పగించింది. తిరుపతి 2వ ఏడీఎం కోర్టు సోమవారం ఈ మేరకు అనుమతిచ్చింది. గత నెల 9న నలుగురు నిందితులు అరెస్టు కాగా, నలుగురినీ 14 నుంచి 18వ తేదీ వరకు(ఐదు రోజులు) సిట్ కస్టడీకి కోర్టు అనుమతించిన సంగతి తెలిసిందే. 18న ఆ నలుగురినీ జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించిన సిట్ అధికారులు ఆ మరుసటి రోజే ఏ3, ఏ5 లను తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పిటిషన్ వేశారు. వారిని ఇదివరకే సిట్ అధికారులు కస్టడీకి తీసుకుని ఐదు రోజులు విచారించిన కారణంగా మళ్లీ కస్టడీకి అప్పగించాల్సిన అవసరం లేదని వారి తరఫు న్యాయవాదులు సోమవారం కోర్టులో వాదించారు. అయితే, కల్తీ నెయ్యి కేసులో వీరిద్దరూ కీలక నిందితులని, గతంలో సిట్ అధికారులు ఐదురోజులు కస్టడీకి తీసుకుని విచారించినప్పటికీ నిందితులు విచారణకు సహకరించలేదని ఏపీపీ జయశేఖర్ కోర్టు దృష్టికి తెచ్చారు. టీటీడీ వంటి ప్రతిష్టాత్మక ధార్మిక సంస్థను మోసగించడం ద్వారా కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బ తినడానికి నిందితులు కారకులయ్యారన్నారు. వారిని మరింత లోతుగా విచారించడం ద్వారానే వాస్తవాలు వెల్లడవుతాయని వివరించారు. ఏపీపీ వాదనలతో ఏకీభవించిన న్యాయాధికారి కోటేశ్వరరావు ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ సిట్ కస్టడీకి అప్పగించేందుకు అనుమతి జారీ చేశారు. కాగా, ఈ కేసులో ఏ5 నిందితుడు అపూర్వ వినయ్ కాంత్ చావడా బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈనెల 6వ తేదీకి వాయిదా పడింది. అలాగే, ఏ3, ఏ4 నిందితులకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారి తరఫు న్యాయవాదులు సోమవారం మరోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

తొక్కిసలాటపై 17న విచారణకు రండి!

- తిరుపతి జిల్లా ఉన్నతాధికారులకు నోటీసులు

తిరుచానూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఈనెల 17న విచారణకు హాజరు కావాలని జిల్లా ఉన్నతాధికారులకు నోటీసులు జారీ అయినట్లు తెలిసింది. వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందగా, 44మంది గాయపడిన విషయం విదితమే. దీనిపై రాష్ట్రప్రభుత్వం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణమూర్తి నేతృత్వంలో ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే రెండు విడతలుగా కమిషన్ విచారణ చేపట్టింది. తాజాగా ఈ నెల 17న కమిషన్ ఎదుట హాజరు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు సోమవారం నోటీసులు పంపినట్లు తెలిసింది.

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషా కోర్సులు

- 13 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో అమలుకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో కూడా ఉద్యోగాలు లభించే విధంగా ప్రభుత్వం సరికొత్త కోర్సులను ప్రవేశపెడుతోంది. నర్సింగ్ కాలేజీల్లో వైద్య విద్యతో పాటు వివిధ దేశాలకు చెందిన భాషా కోర్సులను కూడా ప్రవేశపెట్టేందుకు అనుమతిచ్చింది. ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో నిర్వహిస్తున్న 13 మెడికల్ కాలేజీల్లో విదేశీ భాషలకు సంబంధించిన కోర్సులను కూడా నర్సింగ్ సబ్జెక్టుల్లోకి తీసుకువచ్చారు. ఇందుకు ప్రత్యేక క్లాసులను నిర్వహించనున్నారు. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునేందుకు, విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు లభించడం కోసం ఈ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెడుతోందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

'కిల్కారీ' కాల్స్ సందేశాలు పాటించండి!

- గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యశాఖ కమిషనర్ సూచన

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు మొబైల్ ఆధారిత సేవ 'కిల్కారీ' ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా అందించే సలహాలు, సూచనలు పాటించాలని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ పేర్కొన్నారు. కిల్కారీ ప్రోగ్రామ్‌పై సోమవారం విజయవాడలో రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీర పాండియన్ మాట్లాడుతూ జిల్లాస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. కిల్కారీ వాయిస్ కాల్స్ ద్వారా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. గర్భవతిగా ఉన్నప్పుడు స్థానిక ఏఎన్ఎం వద్ద వివరాలు నమోదు చేయించుకునే సమయంలో ఇచ్చిన మొబైల్ నెంబర్‌కు ఈ కాల్స్ వస్తాయన్నారు. మహిళ గర్భం దాల్చిన 4వ నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకూ, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకూ 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమం డిజైన్ చేశామన్నారు.

నేడు లైన్‌మెన్ దివస్ ఘనంగా నిర్వహించండి: సీఎస్

విద్యుత్ రంగంలో లైన్‌మెన్ నిజమైన హీరోలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఒక ప్రకటనలో కొనియాడారు. విద్యుత్ రంగంలో అత్యంత కీలక పాత్ర పోషించే లైన్‌మెన్‌ను సత్కరించడం ద్వారా లైన్‌మెన్ దివస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించాలని విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు.

వ్యవసాయోత్పత్తుల ఎగుమతికి ప్రోత్సాహం!

- మార్క్‌ఫెడ్, ఎన్సీఈఎల్ మధ్య ఒప్పందం

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ఏపీ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్(మార్క్‌ఫెడ్), న్యూఢిల్లీకి చెందిన నేషనల్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్(ఎన్‌సీఈఎల్) మధ్య వ్యూహాత్మక అవగాహన ఒప్పందం(ఎంవోయూ) జరిగింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయశాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సమక్షంలో మార్క్‌ఫెడ్ ఎండీ మనజీర్ జిలానీ సమూన్, ఎన్‌సీఈఎల్ ఎండీ ఉనుపమ్ కౌసిక్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలోని సహకార సంఘాలు, రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. జాతీయ స్థాయి ఎగుమతి ఏజెన్సీ ఎన్‌సీఈఎల్ కీలకమైన వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్, అంతర్జాతీయ మార్కెటింగ్‌ను సులభతరం చేయనుంది. రైతుల ఆదాయం పెంచడానికి, ప్రపంచ మార్కెట్ అవకాశాలను సృష్టించడానికి ఈ ఒప్పందం దోహదపడుతుందని అధికారులు తెలిపారు.

జనసేనలోకి పిఠాపురం మాజీ ఎమ్మెల్యే దొరబాబు

- పవన్ కల్యాణ్‌తో భేటీ

డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు భేటీ అయ్యారు. సోమవారం సాయంత్రం మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయానికి కుటుంబసభ్యులతో కలిసి వచ్చిన ఆయన.. పవన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భవిష్యత్తు రాజకీయాలపై చర్చించారు. జనసేనలో చేరేందుకు దొరబాబు ఆసక్తి వ్యక్తం చేయగా.. అందుకు డిప్యూటీ సీఎం పవన్ అంగీకారం తెలిపారు.

గంజాయి నిందితులకు 'సంక్షేమం' కట్!

- ప్రజాభిప్రాయం తీసుకున్నాక తుది నిర్ణయం

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, మత్తుపదార్థాల కట్టడికి చర్యలు తీసుకొంటున్న ప్రభుత్వం తాజాగా కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలో గంజాయి సరఫరా కేసుల్లో పట్టుబడే వ్యక్తుల కుటుంబాలకు సంక్షేమ పథకాలు తొలగించేందుకు నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు 1800మంది, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 2500మంది వరకూ గంజాయి కేసుల్లో పట్టుబడ్డారు. సాగు చేస్తూ, సరఫరా చేస్తూ, విక్రయిస్తూ పట్టుబడిన వారిలో మన రాష్ట్రానికి చెందిన వారి ఆధార్ కార్డులు సేకరించి ఆయా వ్యక్తుల కుటుంబ సభ్యులకు ఏ ఒక్క సంక్షేమ పథకం ఇవ్వరాదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆఖరికి వృద్ధులకు పెన్షన్ ఉన్నా నిలిపివేసేందుకు కసరత్తు చేస్తోంది. గంజాయి, మత్తు కట్టడిపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం గతంలోనే ప్రభుత్వానికి ఈ సిఫారసు చేసింది. గంజాయి వల్ల యువత నిర్వీర్యమైపోతోందని, భావితరాల భవిష్యత్తు, యువత, పిల్లల జీవితాలను దృష్టిలో పెట్టుకుని ఇటువంటి కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిర్ణయంపై అధికారిక ప్రకటన చేసి ప్రజాభిప్రాయం కోరిన తర్వాతే అమలు చేయనున్నట్లు తెలిసింది.

దుబాయ్‌లోనే కేదార్ అంత్యక్రియలు పూర్తి

- మరణం వెనుక కుట్ర లేదని తేల్చిన అధికారులు
- అయినా.. మృతదేహం అప్పగింతలో జాప్యం
- తెలంగాణ ప్రభుత్వం సమాచారం కోరినందునే ఆలస్యం?

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సినీ నిర్మాత కేదార్ సెలగంశెట్టి అంత్యక్రియలు దుబాయ్‌లోనే పూర్తయ్యాయి. హిందూ సంప్రదాయం ప్రకారం.. ఆయనకు దహన సంస్కారాలు నిర్వహించారు. వారం రోజులుగా కేదార్ మృతదేహం అప్పగింతపై నీలినీడలు అలుముకున్న విషయం తెలిసిందే.! దుబాయ్ పోలీసులు ఆయన మృతిపై విచారణ జరిపి, క్లీన్‌చిట్ ఇచ్చారు. కేదార్ మృతి పట్ల ఎలాంటి కుట్ర, నేరం లేదని తేల్చారు. అయితే.. భారతీయ కాన్సులేట్ నిరభ్యంతర పత్రం జారీలో ఆలస్యం ఏర్పడడంతో మృతదేహాన్ని అందించడంలో జాప్యం జరిగింది. తెలంగాణ సర్కారు ఎంబసీని సమాచారం కోరడంతో.. ఎన్‌వోసీ జారీలో ఆలస్యమైంది. సోమవారం సాయంత్రం అన్ని ప్రక్రియలు పూర్తవ్వడంతో కేదార్ కుటుంబానికి మృతదేహాన్ని అప్పగించారు. ఆ వెంటనే.. కేదార్ భార్య, ఇతర కుటుంబ సభ్యులు దుబాయ్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు. తమ కుటుంబం ఇప్పటికే సినీ, రాజకీయ ప్రముఖులతో సంబంధాల కారణంగా అన్ని విధాలుగా నష్టపోయిందని, అంత్యక్రియల విషయంలోనైనా వారికి దూరంగా ఉండాలని కోరుకున్నట్లు కేదార్ కుటుంబసభ్యులు తెలిపారు. స్వదేశంలో అంత్యక్రియలు నిర్వహిస్తే.. విమానాశ్రయంలో దిగినప్పటి నుంచి దహన సంస్కారాల వరకు మీడియా హడావుడి ఉంటుందని, అందుకే దుబాయ్‌లో ఆ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలుస్తోంది. కేదార్ మరణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో చేసిన వ్యాఖ్యల తర్వాత కేదార్‌తో సన్నిహిత సంబంధాలున్న రాజకీయ, సినీ ప్రముఖులు ప్రస్తుత పరిణామాలకు దూరంగా ఉంటున్నారు. ఈ కారణంగా కేదార్ అంత్యక్రియల్లో వారు పాల్గొనలేదని సమాచారం. కాగా.. 2018లో సినీనటి శ్రీదేవి మృతిచెందినప్పుడు.. మూడ్రోజుల్లోనే దుబాయ్ పోలీసులు విచారణను పూర్తిచేసి, మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కేదార్ విషయంలో దర్యాప్తులో.. ఫోరెన్సిక్ నివేదిక రావడంలో చాలా ఆలస్యం ఏర్పడడం గమనార్హం.!

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ హర్షణీయం

- అంగన్వాడీల సమస్యనూ పరిష్కరించండి: తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8 నుంచి రాష్ట్రంలో 1,02,832 మంది మహిళలకు 90 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన వేంపల్లెలో మాట్లాడారు. 'ఇందులో 46,044 మంది బీసీ మహిళలు, 45,772 మంది ఈడబ్ల్యూఎస్ మహిళలు, 11,016 మంది కాపు మహిళలు ఉంటారని ప్రభుత్వం పేర్కొంది. రూ.255 కోట్ల ఖర్చుతో అమలు చేస్తున్న ఈ పథకం మహిళా ఆర్థిక సాధికారతకు ఎంతో ఉపయోగపడుతుంది. గతంలో చేదోడు పథకం కింద దర్జీలకు ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందేది. ఆ పథకాన్ని కొనసాగించాలి. దర్జీల షాపులకు ఉచితంగా విద్యుత్, సబ్సిడీపై ఆధునిక యంత్ర పరికరాలు సరఫరా చేయాలి. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తామని, మహాశక్తి కింద 19-59 మధ్య ఉన్న మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాయి. తొమ్మిది నెలలైనా అమలు కాలేదు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించినట్లే అంగన్వాడీల సమస్యలు కూడా పరిష్కరించాలి' అని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

'బ్రేక్ దర్శనాల'పై మల్లగుల్లాలు!

- ఇప్పటికే రోజుకు 7500 బ్రేక్ దర్శనాల తాకిడి
- ఇప్పుడు తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖల ఒత్తిడి
- సర్దుబాటుకు టీటీడీ ఉక్కిరిబిక్కిరి

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనాలకు ఇప్పుడు తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల తాకిడి మొదలవ్వడంతో టీటీడీ మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే రోజురోజుకూ పెరిగిపోతున్న బ్రేక్ టికెట్ల సంఖ్యను ఎలా తగ్గించాలనే ఆలోచనలో తలమునకలై ఉన్న టీటీడీకి.. తాజాగా తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై కూడా వీఐపీ బ్రేక్, రూ.300 దర్శన టికెట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో ఉక్కిరిబిక్కిరవుతోంది. మరోవైపు, తెలంగాణ సీఎం అభ్యర్థన మేరకు బ్రేక్ దర్శన టికెట్లు ఇచ్చేందుకు ఏపీ సీఎం అంగీకారం తెలిపినా టీటీడీ మాత్రం తమ సిఫారసు లేఖలు తీసుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర నేతలు గుర్రుమంటున్నారు. టోకెన్ రహిత దర్శనాలతో పాటు వివిధ రకాల టికెట్లు కలిగిన భక్తులు నిత్యం 60 వేల నుంచి 70 వేల మంది శ్రీవారిని దర్శించుకుంటున్న విషయం తెలిసిందే. వారాంతాల్లో ఆసంఖ్య లక్షకు వరకూ చేరుతోంది. ప్రస్తుతం ఏపీ నుంచి ఏపీ ప్రజాప్రతినిధుల ద్వారానే 1,800 నుంచి 2 వేల వరకు బ్రేక్ దర్శనాలకు టికెట్లు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. వీరితో పాటు పోలీసు, ప్రెస్, న్యాయవ్యవస్థ, ఇన్‌కమ్‌ట్యాక్స్, ఐఏఎస్, టీటీడీ ఉద్యోగులు, కేంద్రమంత్రులు, సీఎంవోలు.. ఇలా మరో వెయ్యి నుంచి 1,500, టీటీడీ బోర్డు చైర్మన్, సభ్యులకు 580, స్వయంగా వచ్చే వీఐపీలు, టీటీడీ అధికారులు, దాతలకు కలిపి మరో 600 టికెట్లు, శ్రీవాణీట్రస్టుకు విరాళాలిచ్చే భక్తులకు 1,500 బ్రేక్ టికెట్లు ఇస్తున్నారు. ఇలా వీఐపీ బ్రేక్ దర్శనాలు రోజుకు దాదాపు 7 వేల నుంచి 7,500 వరకు వెళ్లిపోతున్నాయి. ప్రస్తుతం వీరందరికీ దర్శనం చేయించడానికి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సమయం తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి రాసిన లేఖపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ సిఫారసు లేఖలపై సోమవారం నుంచి గురువారం వరకు ఏదైనా రెండు రోజులు వీఐపీ బ్రేక్ దర్శనం, మరో రెండు రోజులు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ప్రణాళికలు సిద్ధం చేయాలంటూ ప్రభుత్వం నుంచి టీటీడీకి ఆదేశాలు అందాయి. అయితే ఇప్పటికే పెరిగిన బ్రేక్ దర్శన సిఫారసులను ఎక్కడ తగ్గించాలో అర్థంకాక టీటీడీ అధికారులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ సిఫారసు లేఖలతో వస్తున్న తెలంగాణ భక్తులు 'మాలెటర్లు ఎందుకు తీసుకోరు. ప్రభుత్వం ప్రకటన చేసింది కదా' అంటూ వాగ్వాదాలకు దిగుతున్నారు. ఒకవేళ తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై దర్శనాలు ఇవ్వడం ప్రారంభిస్తే మరో 1,100 టికెట్లు పెరుగుతాయి. ఫలితంగా మరో గంట సమయం వీఐపీలకు కేటాయించాల్సి వస్తుంది.

ఆరు బ్రేక్ దర్శన టికెట్లు రూ.33 వేలు!

- వైసీపీ ఎమ్మెల్సీ లేఖపై టికెట్లు పొంది విక్రయించిన దళారీ

తిరుమల, మార్చి3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ సిఫారసు లేఖపై తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ టికెట్లను రూ.33 వేలకు విక్రయించి అక్రమానికి పాల్పడ్డాడో దళారీ. విజిలెన్స్ వింగ్ అధికారుల తనిఖీల్లో ఈ వ్యవహారం వెలుగుచూసింది. హైదరాబాద్‌కు చెందిన కమల్.. తమ కుటుంబంలోని ఆరుగురికి బ్రేక్ దర్శనాలు కావాలని తిరుపతికి చెందిన దామోదరం అనే దళారీని సంప్రదించారు. అందుకు ఆ దళారీ రూ.30 వేలు డిమాండ్ చేయగా, ముందుగా రూ.20 వేలు ఆన్‌లైన్ ద్వారా పంపారు. దీంతో దామోదరం వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇశ్రాయెల్ సిఫారసు లేఖతో ఆ ఆరుగురికి సోమవారం దర్శనం కోసం ఆదివారం అదనపు ఈవో కార్యాలయంలో లేఖ సమర్పించారు. టికెట్ల కోనుగోలు కోసం కూడా భక్తుల నుంచి దళారీ మరో రూ.3 వేలు వసూలు చేశారు. ఆ టికెట్లతో సోమవారం దర్శనానికి వచ్చిన భక్తులను విజిలెన్స్ వింగ్ అధికారులు అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా అసలు గుట్టు రట్టయింది. విజిలెన్స్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

వేసవిలో 'కోతలు' వద్దు

వ్యవసాయానికి 9 గంటలు ఇవ్వాల్సిందే

- గృహ, పారిశ్రామిక, వ్యాపార వర్గాలకూ నిరంతరాయంగా విద్యుత్తు
- ఆర్‌డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయండి
- డిస్కమ్‌లకు మంత్రి గొట్టిపాటి ఆదేశం

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'వేసవిలోనూ వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్‌ను సరఫరా చేయాలి. గృహ, పారిశ్రామిక, వ్యాపారవర్గాలకూ నిరంతరాయంగా విద్యుత్ అందించాలి' అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ డిస్కమ్‌లను ఆదేశించారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో కలసి డిస్కమ్‌ల సీఎండీలు పృథ్వీతేజ్, భాస్కర్, సంతోశ్‌రావులతో సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 'వేసవిలో విద్యుత్తు కొరత రానివ్వకుండా చర్యలు చేపట్టాలి. రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టమ్ (ఆర్‌డీఎస్ఎస్) పనులను వేగవంతం చేయాలి. వేసవి సమయంలో పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తిపై దృష్టి సారించాలి. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వ్యవసాయానికి విద్యుత్తు కనెక్షన్లను ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి' అని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.

కృష్ణా జలాల్లో మాకు 70% వాటా ఇవ్వండి

- గోదావరిలో తెలంగాణకు నికర జలాలెన్ని?
- విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల: రేవంత్‌రెడ్డి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ

న్యూఢిల్లీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల్లో తమ రాష్ట్రానికి 70 శాతం వాటా కేటాయించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే.. ఏపీలో కేవలం 30 శాతమే ఉందన్నారు.సోమవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన సమావేశమయ్యారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కృష్ణా బోర్డు (కేఆర్ఎంబీ) పక్షపాత ధోరణితో ఆంధ్రప్రదేశ్‌కు 66 శాతం, తెలంగాణకు 34 శాతం నీటి కేటాయింపులు చేసిందన్నారు. ఏపీ ఈ ఏడాది కూడా కేటాయింపులకు మించిన నీటిని తరలించుకుపోతోందని ఆరోపించారు. దీనిని అడ్డుకోవాలని.. కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలపై వెంటనే టెలిమెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందన్నారు. కేంద్ర జల సంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేఆర్ఎంబీల నుంచి ఎటువంటి అనుమతీ పొందలేదని చెప్పారు. తాము పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022లోనే డీపీఆర్ సమర్పించినా అనుమతుల్లో ఆలస్యం చేస్తున్నారని.. న్యాయస్థానాల పరిధిలో ఉన్న కర్ణాటకలోని అప్పర్ భద్రకు మాత్రం అనుమతులు ఇచ్చారని చెప్పారు. సీతారామ ఎత్తిపోతలు, సమ్మక్క సాగర్ బ్యారేజీలకు కూడా అనుమతులు ఇవ్వలేదన్నారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో రాజీపడబోమని తేల్చిచెప్పారు. తమ సాగునీటి ప్రాజెక్టులకు మౌలిక వసతుల అభివృద్ధి కింద 50 ఏళ్లపాటు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రాజెక్టులపై చేసిన అభ్యంతరాలను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న ఏపీ ప్రభుత్వం.. కేంద్రంతో మాట్లాడి తమ ప్రాజెక్టులకు అనుమతులు వేగంగా ఇప్పించాలన్నారు. సమ్మక్క సాగర్, సీతారామ సహా ఇతర ప్రాజెక్టులకు నికర జల కేటాయింపులే జరగలేదని, అలాంటప్పుడు గోదావరిలో అదనపు నీళ్లున్నాయని, సముద్రంలో కలిసే ఆ నీళ్లను ఉపయోగించుకుంటామని ఆంధ్రప్రదేశ్ చెప్పడం సరికాదన్నారు. గోదావరిపై నిర్మిస్తున్న తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయిన తర్వాత.. ఆంధ్రప్రదేశ్ ఏ ప్రాజెక్టు కట్టుకోవాలనుకుంటోందో దాని డీపీఆర్ ఇవ్వాలని, అప్పుడు చర్చలు జరిపి అభ్యంతరం ఉందో లేదో చెబుతామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


మొరటు దౌత్యం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నోరు అదుపులో పెట్టుకొనే వ్యక్తి కాదు కనుక, అదే లక్షణం ఉన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జరిగిన భేటీ చివరకు అలా ముగిసింది. బలమైన శత్రువుతో పోరాడుతున్న ఒక చిన్న దేశాధ్యక్షుడు, యుద్ధం మధ్యలో ఉంటూ, మూడేళ్ళుగా తనకు అందుతున్న సాయం ప్రమాదంలో పడిన స్థితిలో కూడా ఇంతటి గుండె ధైర్యంతో అమెరికా అధ్యక్షుడిని ఎదిరించడం అందరికీ నచ్చింది. నీ విలువైన వనరులన్నీ ఇస్తే తప్ప నా సాయం కొనసాగదని బ్లాక్ మెయిల్ చేసిన అమెరికా అధ్యక్షుడు ఆ పనేదో చూసుకోకుండా, తనను తప్పుబడుతూ, తన ప్రత్యర్థిని ఆకాశానికి ఎత్తేస్తూ మాట్లాడటంతో ఉక్రెయిన్ అధ్యక్షుడికి ఉక్రోషం ఆగలేదు. తనను తన దేశాన్ని అవమానిస్తున్నవారి ఎదుట తలవంచుకొని ఉండాల్సిన అవసరం లేదనుకున్నాడేమో ఆయన. మూడేళ్ళుగా అండగా ఉంటూ వచ్చిన అమెరికా అర్థంతరంగా ఆయుధసాయం నిలిపివేస్తే, బలమైన శత్రువు చేతుల్లో మరింత నలిగిపోవాల్సివస్తుందని జెలెన్‌స్కీకి తెలుసు. దీనితో పాటే, అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షులు కట్టకట్టుకొని ఇలా ఎందుకు విరుచుకుపడుతున్నారో, హితవు ముసుగులో ఎందుకు తనను విలన్ చేస్తున్నారో కూడా ఆయనకు తెలుసు. ఐదువందల బిలియన్ డాలర్ల ఆస్తులు అప్పగిస్తూ కూడా కుట్రలు సహించాల్సిన, శత్రు సంకీర్తనలను భరించాల్సిన అవసరం లేదనుకున్నాడు ఆయన.

ఒక దేశాధ్యక్షుడిని పిలిచి మరీ ఇలా అవమానించడంతో అమెరికా పరువు దిగజారిందని అక్కడి మీడియా వ్యాఖ్యానిస్తోంది. గతనెలలో జెలెన్‌స్కీని ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు గుర్తున్న వారికి ఇప్పటి వాగ్వాదం ఒక కొనసాగింపుగా కనిపించవచ్చు. జెలెన్‌స్కీని నియంతగా, యుద్ధానికి ఆద్యుడిగా, దేశాన్ని ముంచేసిన దుందుడుకు నాయకుడిగా ట్రంప్ ఆదిలోనే జెలెన్‌స్కీని అభివర్ణించారు. పూర్తిగా పుతిన్ పరిభాషలోనే ఆ విమర్శలు సాగాయి. తద్వారా ఉక్రెయిన్‌లోని అరుదైన, విలువైన వనరులను అమెరికన్ కంపెనీలకు అప్పగించే ఒప్పందానికి ఆయన జెలెన్‌స్కీ మెడలు వంచి, అమెరికా ఆయుధసాయానికి ప్రతిఫలంగా అనేక రెట్లు దోచుకొనే అవకాశం ఏర్పడింది. ట్రంప్ చేసిన ఒక వ్యాఖ్యను అందిపుచ్చుకొని, రష్యా అధ్యక్షుడు పుతిన్ సైతం తన దేశంలోనూ విలువైన ఖనిజాలను తవ్వుకోవచ్చుననీ, ఉక్రెయిన్ నుంచి తాను ఆక్రమించుకున్న భూభాగాలను కూడా అందుకు ఇస్తానని ఓ చవుక బేరాన్ని ప్రతిపాదించారు. ఇది జెలెన్‌స్కీమీద మరింత ఒత్తిడి పెంచింది. ఉక్రెయిన్ కులీనులు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, కేవలం వనరుల దోపిడీతప్ప, భవిష్యత్ భద్రత, సహకారంమీద అమెరికా నుంచి ఏ హామీ లేని ఈ ఒప్పందాన్ని జెలెన్‌స్కీ బలవంతంగా అంగీకరించాల్సివచ్చిందని అందరికీ తెలుసు. నాటో సభ్యత్వానికి తావేలేదనడం, భద్రత ఊసెత్తక పోవడంతో పాటు, మాటకు కట్టుబడని తన ప్రత్యర్థిని వెనకేసుకు రావడంతో పాటు, నీ దేశం సర్వనాశనమైందనీ, నీ సైన్యం పారిపోతోందని తననూ ఉక్రెయిన్‌నూ అవమానించడం ఆయన సహించలేకపోయారు.

టెలివిజన్ స్క్రీన్‌మీద ఈ ఘట్టాన్ని చూసిన సామాన్యులకు జెలెన్‌స్కీ తెగనచ్చేశాడు. ఇద్దరు దేశాధ్యక్షుల మధ్య ఈ తరహా ఘర్షణ చోటుచేసుకోవడం, అది ప్రత్యక్షంగా చూడగలగటం, అందునా అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా ఓ నాయకుడు ఘాటుగా మాట్లాడటం వారికి ఆశ్చర్యం కలిగించింది. తన చర్యలూ చేష్టలతో ప్రపంచాన్ని భయపెడుతున్న ఓ నాయకుడు కెమెరాల సాక్షిగా ఆత్మరక్షణలో పడటం వారికి నచ్చింది. దేశాధ్యక్షులు ఎంతో ఉన్నతంగా, గంభీరంగా, పరస్పరగౌరవంతో మాట్లాడుకుంటారనే భ్రమలను ఈ ఘట్టం పటాపంచలు చేసింది. వినయంగా తలూపకుండా మా దేశానికి వచ్చి మమ్మల్నే అవమానిస్తావా అన్న రీతిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు రగిలిపోయారనడానికి అనంతర పరిణామాలే సాక్ష్యం. అందరినీ చూడనివ్వండి అంటూనే ఒక అతిపెద్ద ప్రజాస్వామిక దేశాధినేత ఎదుటివ్యక్తిని నోరువిప్పనివ్వకుండా ఎంత అవమానకరంగా మాట్లాడారో ప్రపంచం చూసింది. మధ్యవర్తిగా ఉంటానని చెప్పిన పెద్దమనిషి పూర్తిగా ఒకవైపు మొగ్గడం మరోమారు గమనించింది. ఆప్తులను సైతం అర్థంతరంగా వదిలేసే అమెరికాతో అంటకాగేవారికి ఈ ఘట్టం మరో గుణపాఠం.

హిందీ ఆధిపత్యం దేశ భవితవ్యానికి చేటు



రాజకీయ, సామాజిక దురభిమానాల అజెండాలతో కాకుండా సమస్త ప్రజల శ్రేయస్సుకు సంకల్పించిన విశాల లక్ష్యాలతో విధ్యుక్త ధర్మాలను నిర్వహించినప్పుడే భారత్ సుస్థిరంగా పురోగమనపథంలో ప్రస్థానిస్తుంది. కుల మతాల పేరిట సామాజిక జనసముదాయాల మధ్య విభేదాలు, కలహాలు సృష్టించడానికి ప్రయత్నించడం మన గణతంత్ర రాజ్య సంస్థాపనా సూత్రాలకు ఎనలేని హాని చేస్తుంది. ప్రగతి సాధనలో తడబడుతున్న హిందీ రాష్ట్రాల భాషను దక్షిణ భారతావని నేర్చుకోవాల్సిందేనని నిర్దేశించడం భారత్ భవిష్యత్తుకు ముప్పుగా పరిణమిస్తుంది.

బహుశా, ఒక ముఖ్యమంత్రి రాసిన చాలా అసాధారణ లేఖ అది. సమస్త భారతీయులను ఉద్దేశించి రాసిన బహిరంగ లేఖ అది. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఆ లేఖకు వెన్వెంటనే వేలాది ప్రతిస్పందనలు వచ్చాయి. ఆ లేఖ రాసింది తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.కె.స్టాలిన్. 'ఇతర రాష్ట్రాలకు చెందిన నా ప్రియమైన సోదరీ సోదరుల్లారా' అంటూ ప్రారంభమైన ఆ లేఖ ఇలా కొనసాగింది: ఎన్ని ఇతర భారతీయ భాషలను హిందీ ఇప్పటివరకు కబళించిందో తెలిస్తే మీరు ఆశ్చర్యపోరూ? భోజ్‌పురి, మైథిలి, గఢ్వాలి, అవధి, బ్రజ్, కుమౌనితో సహా 19 భాషలు మాయమైపోయాయి. ఇంకా మరిన్ని భాషలు అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ఆరాటపడుతున్నాయి. ఏకరూప హిందీకి గుర్తింపు తీసుకువచ్చేందుకు చూపుతున్న పట్టుదల పురాతన మాతృభాషలను హరించివేసింది ఉత్తరప్రదేశ్, బిహార్‌లు హిందీ భాష మాట్లాడే ప్రాంతాల నడిబొడ్డు రాష్ట్రాలు కానేకావు. ఆ రాష్ట్రాల ప్రజానీకం అసలు భాషలు ఇప్పుడు గత కాలం అవశేషాలు. చరిత్ర గురించిన అవగాహన ఉన్నవారికి ఇదంతా ఎక్కడకు దారితీస్తుందో తెలుసు. అవును ఇది ఎక్కడ ముగుస్తుందో మాకు తెలుసు కనుకనే హిందీ ప్రాబల్యాన్ని తమిళనాడు ప్రతిఘటిస్తోంది'.

'ఏకరూప హిందీకి గుర్తింపునకు వ్యతిరేకంగా స్టాలిన్ ఆక్షేపిస్తున్న సమయంలోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెన్నైలో ఉన్నారు. ప్రణాళికా బద్ధంగా నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తమిళనాడు ఒక్క పార్లమెంటరీ స్థానాన్ని కోల్పోకుండా ఉండేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాగ్రత్త వహిస్తారని రాష్ట్ర ప్రజలకు అమిత్ షా హామీ ఇచ్చారు. అయితే నియోజకవర్గాల పునర్విభజన అనంతరం తమిళనాడుకు కేటాయించే సీట్ల సంఖ్య తగ్గదనే విషయమై అమిత్ షా ఎటువంటి హామీ ఇవ్వలేదు. ప్రస్తుత సీట్ల సంఖ్య కేటాయింపు జరిగినప్పుడు భారతదేశ జనాభా వృద్ధి రేట్లు భిన్నంగా ఉన్నాయి. ఉత్తర భారతావని రాష్ట్రాలలో జనాభా పెరుగుదల చాలా హెచ్చు స్థాయిలో ఉన్నది. తత్కారణంగా ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు ఒక నియోజక వర్గంలో 30 లక్షల మంది జనాభా ఉండగా తమిళనాడులో ఆ సంఖ్య ఇంచుమించు 18లక్షలుగా ఉన్నది. జనాభా సంఖ్య ఆధారంగా కొత్త లోక్‌సభ సీట్లు నిర్ణయించడం జరిగితే తమిళనాడు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గిపోయే అవకాశమున్నది. ఉత్తరప్రదేశ్‌లో వాటి సంఖ్య పెరుగుతుంది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం లోక్‌సభలో సీట్ల సంఖ్య 753కు పెరిగితే ఇప్పటికే అత్యధిక ఎంపీలను పంపుతున్న ఉత్తర ప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాల సంఖ్య 80 నుంచి 128కి పెరిగే అవకాశం తప్పకుండా ఉన్నది.

దీనివల్ల ఉత్తర దక్షిణ భారతదేశాల మధ్య రాజకీయ సమతౌల్యతకు వాటిల్లేదేమిటో స్పష్టమే. హిందీ భాష మాట్లాడే ప్రాంతాల నడిబొడ్డు రాష్ట్రాలలో దక్షిణాది రాష్ట్రాలలో కంటే లోక్‌సభ సీట్ల సంఖ్య పెరుగుతుంది. దీని పర్యవసానమేమిటంటే జాతీయ రాజకీయాలపై ఉత్తరాది ప్రాబల్యం బాగా పెరిగిపోతుంది. హిందీ రాష్ట్రాలను పరిపాలించే రాజకీయ పక్షాలే జాతీయ రాజకీయాలలో ప్రాధాన్యం పొందుతాయి. జాతీయ రాజకీయాలలో దక్షిణాది రాష్ట్రాల ప్రభావ ప్రాబల్యాలు గణనీయంగా తగ్గిపోతాయి.

ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతౌల్యత ఇలా తలకిందులు కావడం సరికాని ఆలోచనగా భారతీయ జనతా పార్టీ భావించడం లేదు. ఉత్తర భారతావనిలో లోక్‌సభ సీట్ల సంఖ్య పెరుగుదల ఏ స్థాయిలో ఉన్నా బాగా లబ్ధి పొందేది బీజేపీనే. దేశ రాజకీయాలపై తిరుగులేని పట్టుకు హిందీ రాష్ట్రాలలో ఆధిక్యత ఆ పార్టీకి ఎంతైనా అవసరం. అందుకు ఆ పార్టీకి లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన తోడ్పడనున్నది. ఈ కారణంగానే స్టాలిన్, ఇతర దక్షిణాది నాయకులు హిందీ ప్రాబల్యం, జాతీయ రాజకీయాలలో ఉత్తరాది పెత్తనం విషయమై అమితంగా కలవర పడుతున్నారు.

సకల రంగాలలో విజయాల మీద విజయాలు సాధిస్తూ పురోగమిస్తున్న కారణంగా దక్షిణాది రాష్ట్రాలను నియోజకవర్గాల పునర్విభజన తదితర చర్యలతో శిక్షిస్తున్నారని స్టాలిన్, ఇతర దక్షిణాది నాయకులు వాదిస్తున్నారు. నిజమే. ఆర్థికాభివృద్ధిలో దక్షిణ భారతావని ఉత్తర భారత రాష్ట్రాల కంటే బాగా ముందంజలో ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో అక్షరాస్యత రేటు 68శాతం కాగా కేరళలో అది 94శాతంగా ఉన్నది. ఆర్థికాభివృద్ధిలోనూ ఆ రెండు రాష్ట్రాల మధ్య ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. చాలా సంవత్సరాల క్రితం, సామాజిక మాధ్యమాలు రంగంలోకి రాక ముందు దక్షిణాది రాష్ట్రాల వృద్ధిరేట్లను టీవీ మోహన్ దాస్ పాయ్ గణించారు. ఆ వృద్ధి రేట్లు ఆసియన్ టైగర్స్‌గా సుప్రసిద్ధమైన సింగపూర్, దక్షిణ కొరియా మొదలైన ఆగ్నేయాసియా దేశాల వృద్ధిరేట్లతో సమాన స్థాయిలో ఉన్నాయి. జనాభా పెరుగుదల విషయంలోనూ ఇటువంటి వ్యత్యాసమున్నది. ఉత్తరాది, దక్షిణాది లోక్‌సభ నియోజకవర్గాల పరిమాణాలలో వ్యత్యాసానికి ప్రధాన కారణం జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు సంపూర్ణ ఫలితాలు సాధించడమే అన్నది స్పష్టం. హిందీయేతర రాష్ట్రాలలో ఇప్పుడు జనాభా రేట్లు, మరణాల రేట్ల కంటే తక్కువగా ఉన్నాయి. 1960, 70ల్లో అనియంత్రిత జనాభా పెరుగుదల విషయమై వ్యక్తమైన భయాందోళనలు నిరాధారమైనవని రుజువయింది. ఇందుకు ప్రధాన కారణం హిందీ భాషాయేతర రాష్ట్రాలు జనాభా నియంత్రణలో సంపూర్ణంగా విజయవంతమవడమేనని చెప్పక తప్పదు.

చాలా మంది దక్షిణ భారతీయులు భావిస్తున్న, అయితే తప్పనిసరిగా బయటకు చెప్పని విషయాలనే స్టాలిన్ బహిరంగ లేఖ వ్యక్తం చేసింది. హిందీ రాష్ట్రాల వైఫల్యాల కారణంగా దక్షిణాది రాష్ట్రాలు మరింతగా ముందుకు సాగకుండా ఎంతకాలం నిలువరిస్తారు? భారతదేశ రాజకీయాలపై అన్నిటా వెనుకబడిన రాష్ట్రాలే ప్రభావ ప్రాబల్యాలు నెరపేందుకు అవకాశం కల్పించడం దేశ శ్రేయస్సుకు మేలు చేస్తుందా? మనది ప్రజాస్వామిక సమాజం మాత్రమే కాకుండా ఒక సమాఖ్య పాలనా వ్యవస్థ కూడా. దేశం మరింతగా పురోగమించాలంటే రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. దేశాన్ని ప్రగతిపథంలో నిరంతరం ముందుకు తీసుకు వెళుతున్న రాష్ట్రాలను స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం శిక్షించడం దేశానికి ఏ విధంగా మేలు చేస్తుంది? దక్షిణ భారతదేశ ప్రజల మనస్సుల్లో సుడులు తిరుగుతున్న ప్రశ్నలివి.

ఇటువంటి నిరసన భావాల నుంచే హిందీ భాషపై మళ్లీ చర్చ ప్రారంభమయింది. దేశ ప్రజలకు స్టాలిన్ బహిరంగ లేఖే అందుకు తార్కాణం. హిందీ వ్యతిరేకత ద్రవిడ ఉద్యమంలో ఒక ప్రధాన భాగంగా ఉందన్న వ్రావాన్ని మనం దాదాపుగా మరచిపోయాము. తమిళ ప్రజల సాంస్కృతిక స్వాభిమానం, దక్షిణ భారతావని ప్రాంతీయ మనోభావాలను గుర్తించి గౌరవించిన మన జాతీయ నాయకులు హిందీ వ్యతిరేకతను రూపుమాపేందుకు విశేషంగా దోహదం చేశారు. హిందీ, ఇంగ్లీషును అధికార భాషలుగా నిరవధికంగా కొనసాగేందుకు హామీనిస్తూ 1967లో ఇందిరాగాంధీ ప్రభుత్వం అధికార భాషల చట్టాన్ని సవరించింది. 1965లో తమిళనాడులో హిందీ వ్యతిరేకత ఉద్యమం ఉధృతంగా జరిగిన ఫలితంగానే ఇందిరాగాంధీ చొరవతో ఆ చట్టాన్ని సవరించడం జరిగింది.

స్టాలిన్ తన లేఖలో వ్యక్తం చేసిన అభిప్రాయాలు సమంజసమైనవని చరిత్ర చెప్తుతుంది. హిందీ సాపేక్షంగా ఒక కొత్త భాష. హిందీని సంస్కృతమయం చేసేందుకు బ్యూరాక్రాట్లు, రాజకీయవేత్తలు, పండితులు, ఆకాశవాణి విశేషంగా దోహదం చేశాయి. హిందీ మాత్రమే 'జాతీయ' భాష అని ఆ భాషాభిమానులు వాదించడం కద్దు. అయితే ఇది తప్పుడు భావన. ఇంగ్లీషు అనుసంధాన భాషగా ఉపయోగపడడమే కాకుండా సాఫ్ట్‌వేర్ మొదలైన అంతర్జాతీయ వ్యాపార వాణిజ్యాలలో ఇతర ఆసియా దేశాల కంటే మనకు స్పష్టమైన ఆధిక్యతను, అనేక ప్రయోజనాలను సమకూరుస్తోంది.

దక్షిణాది రాష్ట్రాలపై హిందీని రుద్దడానికి ఆరాటపడుతున్నవారు దేశవ్యాప్తంగా హిందీ వ్యాప్తిచెందుతున్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. అయితే హిందీ భాషా రాష్ట్రాల సంకుచిత రాజకీయవేత్తలు, హిందీ భాషా దురభిమానుల కారణంగా హిందీ దేశ ప్రజలకు సుపరిచితం కావడం లేదు. సినిమా, టీవీ, స్ట్రీమింగ్, సంగీతం మొదలైన వాటి ఆలంబనతో ఆ భాష వ్యాప్తి చెందుతోంది. దక్షిణ భారతీయులు హిందీ భాషను మాట్లాడాలని డిమాండ్ చేస్తున్న వారు అదే సమయంలో బాలీవుడ్ (ఉర్దూవుడ్ అని వారే అగౌరవంగా మాట్లాడడం కద్దు) ప్రభావాన్ని తేలిగ్గా తీసిపారేస్తున్నారు. కొన్ని సంవత్సరాల క్రితం రాజకీయ దురుద్దేశాలతో బాలీవుడ్‌కు వ్యతిరేకంగా తీవ్ర ప్రచారం జరగడం గమనార్హం. ఇంగ్లీషును అనుసంధాన భాషగా ఉపయోగిస్తున్న వారిని 'వలసవాద బానిసలు' 'ఆంగ్ల మానసపుత్రులు' అని ఈసడిస్తున్నవారు పరాయి పాలకులకు వినాయక్ దామోదర్ సావర్కార్ రాసిన క్షమాపణ లేఖలను ఉపేక్షిస్తున్నారు!

సత్యమేవ జయతే. మన భారత గణతంత్ర రాజ్యం గురించిన సత్యమేమిటి? రాజకీయ, పాక్షిక, సామాజిక దురభిమానాల అజెండాలతో కాకుండా సమస్త ప్రజల శ్రేయస్సుకు సంకల్పించిన విశాల లక్ష్యాలతో విధ్యుక్త ధర్మాలను నిర్వహించినప్పుడే భారత్ సుస్థిరంగా పురోగమనపథంలో ప్రస్థానిస్తుంది. కుల మతాల పేరిట సామాజిక జనసముదాయాల మధ్య విభేదాలు, కలహాలు సృష్టించడానికి మీరు ప్రయత్నిస్తే మన సమున్నత గణతంత్ర రాజ్య సంస్థాపనా సూత్రాలకు మీరు ఎనలేని హాని చేస్తున్నట్లే, సందేహం లేదు. ప్రగతి సాధనలో తడబడుతూ, విఫలమవుతోన్న హిందీ రాష్ట్రాల భాషను దక్షిణ భారతావని నేర్చుకోవాల్సిందేనని మీరు మొండిగా పట్టుపడితే మీరు మన దేశ భవిష్యత్తుకు తీవ్ర ముప్పు కలిగించినవారవుతారు.

• వీర్ సంఘ్వీ
సీనియర్ జర్నలిస్ట్
(ది ప్రింట్)

నేర నియంత్రణలో భాగస్వామ్యం ప్రజల బాధ్యత

దేశంలో పెరిగిపోతున్న నేరాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. జాతీయ నేర రికార్డుల బ్యూరో నివేదిక (2022) ప్రకారం రోజూ 16,000 తీవ్ర నేరాలు నమోదవుతున్నాయి. మరో పక్క 54.2శాతం కేసుల్లో మాత్రమే నేర నిరూపణ అవుతున్నది. ఇది బ్రిటన్‌లో 80శాతం, అమెరికాలో 90శాతంగా ఉంది. ఇందుకు కారణం అక్కడి ప్రజల భాగస్వామ్యం. నేరాలు జరిగినప్పుడు పరిశోధన భారం పోలీసు శాఖ పైనే పడుతోంది. కానీ ప్రజల తోడ్పాటు ఉంటే సాక్ష్యాధారాల సేకరణ సులభమై శాంతిభద్రతలు మెరుగవుతాయి.

నేరం గురించి కీలక సమాచారం తెలిసినప్పటికీ చాలా మంది పోలీసులతో నేరుగా మాట్లాడటానికి భయపడతారు. వారి భద్రత గురించి లేదా సాక్షిగా కోర్టులో నిలబడాలని ఆందోళన చెందుతారు. ప్రస్తుతం ప్రజలు తమకు తెలిసిన నేర సమాచారం పోలీసు అధికారికి చేరవేయాలంటే హెల్ప్‌లైన్ 100కు ఫోన్ చేయాలి. ఉదాహరణకు ఒక విద్యార్థి తన కళాశాలలోని విద్యార్థులకు డ్రగ్స్ అక్రమ రవాణా చేసున్న వారిని గుర్తించి, వెంటనే ఆ నేరం ఆపాలని భావిస్తాడు. ఫోన్ చేయడానికి ఇదివరకు పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లు ఉండేవి. మొబైల్ ఫోన్‌ల పుణ్యమా అని ఇప్పుడా సౌలభ్యం లేదు, కనుక తన మొబైల్ ఫోన్ నుంచే కాల్ చేయాలి. అప్పుడు తన నెంబర్ అవతలి వారికి కనబడటం పెద్ద అవరోధంగా మారి, అతడు నిస్సహాయంగా ఉండిపోయే అవకాశమే ఎక్కువగా ఉంది. ఈ అవరోధాన్ని అధిగమించడం కోసమే కొన్ని దేశాల్లో 'క్రైమ్ స్టాపర్స్' అనే అజ్ఞాత నెంబర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. 'క్రైమ్ స్టాపర్స్' అనేది పోలీసులు, పౌర సమాజం మధ్య సహకారంతో నడిచే సంస్థ. ఏదైనా నేరం గురించి సమాచారం తెలిసినవారు కాల్ చేస్తే దీని సాంకేతికత వల్ల వారి ఫోన్ నెంబర్ అధికారికి కనిపించదు. అతను చెబితే తప్ప పేరు, వివరాలు తెలిసే అవకాశమే లేదు.



క్రైమ్ స్టాపర్స్ మొదట 1976లో అమెరికాలో స్థాపించబడింది. తర్వాత బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలో ఏర్పాటయింది. ఇందులో పౌర సమాజానికీ పాత్ర ఉండటం వల్ల ఈ వ్యవస్థలు ప్రజల నమ్మకం పొందాయి. సమాచారం ఇచ్చిన వారికి కొన్నిసార్లు రహస్యంగా బహుమతి ఇచ్చే ఏర్పాటు కూడా ఉంటుంది. కాలిఫోర్నియా వంటి రాష్ట్రాలలో 'P 3 మొబైల్ క్రైమ్ టిప్స్' వంటి యాప్ కూడా అజ్ఞాతంగా నేర సమాచారం ఇచ్చేందుకు అందుబాటులో ఉంది. బ్రిటన్‌లోనే క్రైమ్ స్టాపర్ సమాచారం ఆధారంగా 1,51,000 మంది నేరస్థులను అరెస్టు చేశారు. 36 కోట్ల పౌండ్ల విలువైన అక్రమ డ్రగ్స్ జప్తు చేశారు. ఆస్ట్రేలియాలో ఒక అజ్ఞాత కాలర్ అందించిన సమాచారం ఆధారంగా గత ఏడాది 896 కిలోల మెథాంపెటమైన్ జప్తు చేశారు.

అంతేగాక, తీవ్ర నేరాలు జరిగినపుడు పోలీసులే అలర్ట్ (హెచ్చరిక) చేసి సమాచారం సేకరించి ఛేదించిన కేసులూ ఉన్నాయి. నేరం జరిగిన వెంటనే టీవీ, రేడియో, రహదారి డిజిటల్ బోర్డులు, సోషల్ మీడియా వంటి ప్రసార సాధనాల ద్వారా, ముఖ్యంగా ఫోన్ సంక్షిప్త సందేశం (ఎస్ఎంఎస్) రూపంలో స్థానిక భాషలలో ప్రజలకు హెచ్చరిక పంపే అవకాశం ఉంది. అమెరికాలో, ఈ అలర్ట్ వ్యవస్థ బాలల అపహరణ వంటి నేరాల్లో కూడా ఉపయోగిస్తున్నారు. మసాచుసెట్స్‌లో 11 ఏళ్ల బాలిక కిడ్నాప్‌కు గురైనప్పుడు, ఈ అలర్ట్ అందుకున్న సాక్షులు ఇచ్చిన కీలక సమాచారం ఆమెను సురక్షితంగా కాపాడటానికి దోహదపడింది. పిల్లల అపహరణ జరిగిన వెంటనే అంబర్ అలర్ట్, అదృశ్యమైన వృద్ధులను కనుగొనడానికి సిల్వర్ అలర్ట్, పోలీసు అధికారులపై దాడి జరిగినప్పుడు బ్లూ అలర్ట్, ఇంకా తీవ్ర వాతావరణ మార్పులు, ప్రజా భద్రత అప్రమత్తతలు, జాతీయ అత్యవసర సందేశాలు పంపబడతాయి. అజ్ఞాతంగా నేర సమాచారం అందించే క్రైమ్ స్టాపర్, నేర హెచ్చరిక వ్యవస్థల వల్ల, నేర నియంత్రణలో ప్రజల బాధ్యత పెరిగి సమాజంలో శాంతి నెలకొంటుంది.

– శ్రీనివాస్ మాధవ్

విద్యార్థి ఎన్నికలు.. ప్రగతికి బాటలు

చదువుకుంటూనే సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుంటూ అసాంఘిక శక్తులపై పోరాటం చేసేవాడు విద్యార్థి. అతని నిస్వార్థపు ఆలోచనలు, చర్యలు దేశ నిర్మాణానికి, ప్రగతికి దోహదం చేస్తాయి. ఇలా యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘ నేతలుగా ఎదిగిన అనేక మంది దేశానికి ప్రధానులు, రాష్ట్రపతులు, ఆయా రాష్ట్రాలకు సీఎంలుగా ప్రజలకు సేవ చేశారు. ప్రస్తుతం సెంట్రల్ వర్సిటీలు, కొన్ని రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో తప్పితే.. ప్రభుత్వాలు విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో సమాజానికి, దేశానికి నిస్వార్థంగా పనిచేసేందుకు రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తగ్గిపోతున్నారు.

విద్యార్థి సంఘ ఎన్నికల జరిగిన కాలంలో విద్యార్థులందరూ సామాజిక స్పృహతో చైతన్యంగా ఉండేవారు. నాణ్యమైన విద్యాబోధన డిమాండ్ చేయడంతో పాటు కాలేజీ, హాస్టల్ ఫీజులు సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వంతో పోరాటం చేసేవారు. విద్య ప్రైవేటీకరణకు, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిచేవి. ప్రశ్నించే తత్వం ప్రతి విద్యార్థిలో ఉండటంతో విద్యాసంస్థలు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేసేవి. అటు సామాజిక ఉద్యమాల్లోనూ విద్యార్థులు కీలక పాత్ర పోషించేవారు.

ప్రస్తుతం చాలా మంది రాజకీయ నాయకులు ప్రజల కంటే వారి స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ కుల, మత, ప్రాంతీయ భావాలను రెచ్చగొడుతున్నారు. పదవుల్లో ఉండగానే వారసులను రాజకీయరంగ ప్రవేశం చేయించి, భవిష్యత్తు తరాలపై వారిని బలవంతంగా రుద్దుతున్నారు. ఈ పోకడలను మనం ప్రోత్సహించినా, కొనసాగించినా ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారతాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చాలాకాలం పాటు సాధారణ ఎన్నికలతో సమాంతరంగా విద్యార్థి సంఘం ఎన్నికలు కూడా నిర్వహించేవారు. తద్వారా విద్యార్థి సంఘాల నుంచి గొప్ప నాయకులు వచ్చేవారు. 1980–1985 మధ్యకాలంలో వివిధ రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో జరిగిన కొన్ని హింసాత్మక సంఘటనల వల్ల విద్యార్థి సంఘ ఎన్నికలను ప్రభుత్వాలు రద్దు చేశాయి. తరువాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం మాజీ ఎన్నికల అధికారి జె.ఎం. లింగ్డో అధ్యక్షతన ఒక కమిటీ వేసింది. 2006 సెప్టెంబర్‌లో ఆ కమిటీ ప్రతిపాదించిన రిపోర్టును అమలు చేయాలని యూనివర్సిటీలకు, కాలేజీలకు సుప్రీంకోర్టు సూచించింది. దీంతో కేంద్ర విశ్వవిద్యాలయాలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లోని వర్సిటీల్లో కొన్నిచోట్ల మాత్రమే విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

విద్యలో ప్రైవేటీకరణ, ఫీజుల దోపిడీ, ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు, నిరుద్యోగం, కులం, మతం, ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టించడం ఇలా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే అనేక వైపరీత్యాలు జరుగుతున్నా విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు కనీసం వారి హక్కుల కోసం గళం ఎత్తలేని అచేతన స్థితిలో ఉంటున్నారు. ప్రశ్నించే తత్వం తగ్గిపోతోంది. విద్యార్థి సంఘం ఎన్నికల అంశం తెరమీదకు వచ్చినప్పుడల్లా పాలకవర్గాలు, ఆయా యూనివర్సిటీల యాజమాన్యాలు శాంతిభద్రతల అంశాన్ని సాకుగా చూపుతున్నాయి. శాంతిభద్రతలే సమస్యైతే సాధారణ ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారు? ఇప్పటికైనా విశ్వవిద్యాలయాలు, కాలేజీలలో విద్యార్థి ఎన్నికలను నిర్వహించి ప్రజాస్వామ్యానికి అవసరమైన ప్రజా నాయకులను, సామాజికవేత్తలను దేశానికి అందించవలసిన ఆవశ్యకత ఉన్నది.

– ఎన్. సీతారామయ్య

కమ్యూనిస్టులను గట్టెక్కించే స్నేహితులెవరు?



2026 కల్లా కమ్యూనిస్టు 'నక్సలైట్ ముక్త్' దేశాన్ని నిర్మిస్తామని సాక్షాత్తు దేశ హోంమంత్రి ప్రతినబూనారు. మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలకు పడిన ఓట్లు 3 శాతం కూడలేవు. రెండు పంథాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలకు ఇది సంక్షోభ సమయం. స్నేహహస్తాన్ని అందించే మిత్రులుంటే కష్టాలు సంక్షోభాలను అధిగమించడం పెద్ద కష్టం ఏమీ కాదు.

శతవార్షికోత్సవాలు జరుపుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీలు ప్రజల్లో మళ్ళీ ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపగలవా? అనే ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తున్నది. మన దేశంలో కమ్యూనిస్టు పార్టీలు వంద చీలికలు కావచ్చు గానీ అవి సాధించిన విజయాలు కూడా అంతకు మించి ఉన్నాయి. రాజ్యాంగ రచన సాగుతున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ రెండు చోట్ల రైతాంగ సాయుధ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నది. అలాంటి పోరాటాలను నివారించే ఒక రక్షణాత్మక విధానంగా కూడ రాజ్యాంగ రచన సాగింది. రాజ్యాంగం అమల్లోనికి వచ్చిన తరువాత, సామాన్య ప్రజల హితం కోసం రూపుదిద్దుకున్న అనేక చట్టాలు కమ్యూనిస్టుల ప్రభావంతో వచ్చినవే. జమిందారీవ్యవస్థ రద్దు, భూపరిమితి చట్టాలు, పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతనాల చట్టం, వెట్టిచాకిరీ వ్యవస్థ రద్దు, అటవీ భూములపై ఆదివాసులకు హక్కులు మొదలైనవన్నీ కమ్యూనిస్టు – నక్సలైట్ ఉద్యమాల ప్రభావంతో వచ్చినవే. ఇందిరాగాంధీ 'గరిబీ హటావో', ఎన్.టి. రామారావు కిలో రెండు రూపాయల బియ్యం, జనతా వస్త్రాలు, పేదలకు ఇళ్ళు వగయిరా పథకాలు కూడా కమ్యూనిస్టు అభిమానుల్ని తమ వైపునకు లాక్కోవడానికి ప్రవేశపెట్టిన పథకాలే.

కమ్యూనిస్టు పార్టీ, సంఘపరివార్ ఒకేసారి పుట్టాయి. అన్ని రకాల వనరులు, వంద అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ సంఘపరివార్ సంపూర్ణ అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి దాదాపు తొంభై ఏళ్లు పట్టింది. దానికి కారణం కమ్యూనిస్టు పార్టీలు అనుసరించిన మతసామరస్య భావజాలమే. అయితే, కమ్యూనిస్టు పార్టీల నాయకులకు కూడా స్థలకాల పరిమితులు ఉన్నాయి. తొలితరం కమ్యూనిస్టు నాయకులు గ్రామాల్లో భూమి సంబంధిత సామాజికవర్గాల నుండి వచ్చినవారు. వ్యవసాయం, నీటిపారుదల గురించి పరిజ్ఞానం ఉన్నవారు. వ్యవసాయ కూలీల మీద సానుభూతి ఉన్నవారు. అప్పటి పరిస్థితుల్లో వ్యవసాయ కూలీల విముక్తే దేశవిముక్తి అని గట్టిగా నమ్మినవారు. ఆ దృక్పథంతోనే 'ఆంధ్రాథీసిస్', 'వ్యవసాయిక విప్లవం' వంటి కార్యక్రమాలు పుట్టాయి. జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయరంగానికి సింహవాటా ఉన్న కాలం అది. అందువల్ల కమ్యూనిస్టు పార్టీలు అప్పట్లో వెలుగులో కొనసాగాయి. ఒక మహా యంత్రవిప్లవం ఒకటి వస్తుందని గానీ, ఉత్పత్తి సంబంధాల సమీకరణలు సమూలంగా మారిపోతాయనిగానీ వాళ్ళు ఊహించలేదు. అది వారి కాలపరిమితి.

1990వ దశకంలో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజానికి ఆమోదాంశం సంక్షోభంలో పడింది. ప్రపంచ విప్లవ కేంద్రంగా ఒక వెలుగు వెలిగిన రష్యా సోషలిస్టు దేశంగా పతనమైంది. చైనా సోషలిజం మీద కూడ అనుమానాలు తలెత్తాయి. కమ్యూనిజం మీద అంతిమపోరుకు ప్రపంచ బ్యాంకు సిద్ధమైంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భవించింది. సరళీకృత ఆర్థిక విధానం వ్యాపించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విజృంభించింది. జాతీయ స్థూల ఉత్పత్తిలో వ్యవసాయం వాటా 15శాతానికి పడిపోయింది, పారిశ్రామిక ఉత్పత్తి వాటా కూడా ఆ స్థాయికే పరిమితం అయ్యింది. సేవారంగం అనూహ్యంగా పెరిగి దాదాపు 70శాతానికి చేరుకుంది. వర్గ స్పృహ వెనుకంజ వేసి ఉనికివాదం పెరిగింది.

ఇండియాలో చేపట్టాల్సిన విప్లవ కార్యక్రమం ఏమిటో తోచక నలుగురు సభ్యులతో కూడిన ఒక బృందం 1951 ఫిబ్రవరిలో స్టాలిన్ దగ్గరకు వెళ్ళింది. "ముందు మీ దేశాన్ని, మీ సమాజాన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, దానికి అనువైన ఒక విప్లవ కార్యక్రమాన్ని రూపొందించుకోండి" అన్నాట్ట స్టాలిన్. భారత కుల మత తెగ రంగాల్లో తీవ్రంగా కొనసాగుతున్న సంఘర్షణ కూడ వర్గపోరాటమేనని కమ్యూనిస్టు నాయకులకు అర్థం కాలేదు. ఫలితంగా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, మహిళలు తదితర ఉనికివాద సమూహాలు చాలావరకు కమ్యూనిస్టు పార్టీలకు దూరం అయ్యాయి. చైనాలో 1940 ప్రాంతంలో మావో చెప్పిన నూతన ప్రజాస్వామిక విప్లవమే ఇప్పటికీ మనదేశంలో అనేక కమ్యూనిస్టు పార్టీల కార్యక్రమంగా వుందంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. చైనా నూతన ప్రజాస్వామిక విప్లవంలో సామ్రాజ్యవాద వ్యతిరేకత అనే కోణం కూడ వుంది. ఇక్కడ అదిలేదు.

సరైన సమయం కోసం ఎదురు చూస్తున్న సంఘపరివార్ శక్తులు కమ్యూనిస్టు పార్టీల బలహీన సమయంలో ఆ 1990ల లోనే విజృంభించారు. రాజకీయరంగంలో కమ్యూనిస్టుల వెనుకంజతో ఏర్పడిన శూన్యాన్ని వాళ్లు ఆక్రమించుకున్నారు. భౌగోళికంగానూ, బౌద్ధికంగానూ వ్యాపించారు. సంఘపరివార్ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని 2004 ఎన్నికల్లో ఓడించిన ప్రజలు కమ్యూనిస్టుల మీద తమ నమ్మకాన్ని మరోసారి వ్యక్తం చేశారు. ఆ ఎన్నికల్లో వామపక్షాలకు 60 సీట్లు వచ్చాయి. రష్యా పతనం తరువాత ఇదొక అద్భుతం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి 'రైట్ ఆఫ్ ద సెంటర్'కు వ్యతిరేకంగా 'లెఫ్ట్ ఆఫ్ ద సెంటర్'గా యూపీఏ-1 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అయిన మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యారు. అయినప్పటికీ యూపీఏ-1 ప్రభుత్వం వామపక్షాల ప్రభావంతో ప్రజలకు అనేక మేళ్లు తలపెట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అలా రూపొందిందే.

అయితే, అమెరికాతో పౌర అణు ఒప్పందాన్ని వ్యతిరేకించిన వామపక్షాలు జులై 9, 2008న యూపీఏ-1 నుండి బయటికి వచ్చాయి. పార్లమెంటరీ ప్రజాస్వామంలో ప్రజలు ఇచ్చిన ఒక సువర్ణ అవకాశాన్ని వామపక్షాలు చేజేతులా పాడుచేసుకున్నాయి. ఇదో మహాతప్పిదం. వామపక్షాలు వదిలి వెళ్ళిపోయాక అధికారాన్ని నిలబెట్టుకోవడానికి కాంగ్రెస్ పార్టీ రకరకాల వాళ్ళతో చేతులు కలిపి భ్రష్టుపట్టింది. ఇవన్నీ సంఘపరివార్ సంపూర్ణ అధికారాన్ని చేపట్టడానికి దోహదం చేశాయి. ప్రజలకు కమ్యూనిస్టుల చర్యలు నచ్చలేదు. 2014 ఎన్నికల్లో వాళ్ళు కమ్యూనిస్టుల్ని కఠినంగా శిక్షించారు.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో మొదటి నుండీ రెండు పంథాల మధ్య ఒక చర్చ సాగుతూనే వుంది. ఇందులో మొదటిది: సాయుధ పోరాటం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవడం. రెండోది: పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా అధికారాన్ని చేపట్టడం. ఇప్పటికీ ఒకటి రెండు కమ్యూనిస్టు పార్టీలు మొదటి పంథాలోనూ, మిగిలిన కమ్యూనిస్టు పార్టీలు రెండో పంథాలోనూ కొనసాగుతున్నాయి. ఈ రెండు పంథాలూ ఇప్పుడు ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి.

2026 కల్లా కమ్యూనిస్టు తీవ్రవాదులులేని (నక్సలైట్ ముక్త్) దేశాన్ని నిర్మిస్తామని దేశ హోంమంత్రి ప్రతినబూనారు. మరోవైపు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలకు పడిన ఓట్లు 3 శాతం కూడలేవు. మొత్తం 543 సీట్లలో మూడు కమ్యూనిస్టు పార్టీలకు కలిపి 6 సీట్లు మాత్రమే వచ్చాయి. రెండు పంథాల్లోనూ కమ్యూనిస్టు పార్టీలకు ఇది సంక్షోభ సమయం.

స్నేహహస్తాన్ని అందించే మిత్రులుంటే కష్టాలు సంక్షోభాలను అధిగమించడం పెద్ద కష్టం ఏమీకాదు. ఇప్పుడు కమ్యూనిస్టుల మిత్రులు ఎవరు? అన్నది ప్రధాన ప్రశ్న. దేశంలో అనేకానేక ప్రజాసమూహాలు కష్టాల్లో ఉన్నాయి. వాటిల్లో ఆదివాసులు, ముస్లింలు అత్యధిక అణిచివేతను అనుభవిస్తున్నాయి. ఆరెస్సెస్ సిద్ధాంతవేత్త గురూజీ ఎంఎస్ గోల్వాల్కర్ 1968లో ప్రచురించిన 'బంచ్ ఆఫ్ థాట్స్' గ్రంథంలో 'హిందూరాష్ట్ర'కు ముస్లింలు, కమ్యూనిస్టులు, క్రైస్తవులు అంతర్గత శత్రువులని ప్రకటించారు. 2014లో ఢిల్లీలో జరిగిన వరల్డ్ హిందూ కాంగ్రెస్-మార్క్సిజం, మెకాలేయిజం, మిషనరీస్, మెటీరియలిజం, ముస్లిం ఎక్స్‌ట్రీమిజం –లను హానికరమైన ఐదు (malicious–5)గా ప్రకటించింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ 2014 ఫిబ్రవరిలో తంజావూర్‌లోని శాస్త్ర యూనివర్శిటీలో ఓ స్మారక ప్రసంగం చేస్తూ 'నాలుగు యుద్ధ రంగాలు' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు: "సరిహద్దుల్లో శత్రుదేశాలతో, దేశంలో ఉగ్రవాదులతో, తీవ్రవాదులతో పోరాడడమే గాకుండా దేశ శ్రేయస్సు కోసం పౌరసమాజం మీద కూడ యుద్ధం చేయాల్సి ఉంటుంది" అని వారు సిద్ధాంతీకరించారు.

ఒక చారిత్రక సందర్భంలో కమ్యూనిస్టుల నుంచి దూరం జరిగిన పూలే-అంబేడ్కరిస్టుల్లో ఇప్పుడు ఒక స్పష్టమైన చీలిక కనిపిస్తున్నది. ఒక సమూహం బీజేపీతో కలిసి నడుస్తున్నది. అది నచ్చని సమూహం కూడ ఒకటున్నది. అది కమ్యూనిస్టులు తమకు – బీజేపీ కన్నా మెరుగయిన మిత్రులు అనుకుంటున్నది. వీటన్నింటినీ క్రోడీకరించుకుంటే కమ్యూనిస్టు పార్టీలతో కలిసి పనిచేయడానికి ఒక మహాసముద్రం సిద్ధంగా ఉందని అర్థం అవుతుంది. ఆ దిశగా అడుగులు వేస్తే మరోసారి ఉజ్వల చరిత్రను సృష్టించడం కమ్యూనిస్టులకు అసాధ్యమేమీ కాదు.

■ డానీ
సామాజిక విశ్లేషకులు



చిరునవ్వులకు లేదు పోటీ : గుంటూరు కౌంటింగ్ కేంద్రంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు సరదా కబుర్లు



బంపర్ మెజారిటీ!

భారీ విజయం దిశగా టీడీపీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

మూడు రౌండ్లకే 30 వేల ఆధిక్యం

నాల్గో రౌండ్‌కు 38,491, ఐదో రౌండ్‌కు 47,850 ఆధిక్యం నమోదు

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ విజయం దిశగా దూసుకుపోతున్నారు. మొదటి రౌండ్ లెక్కింపుతోనే భారీ మెజారిటీని దక్కించుకున్న ఆయన రౌండ్ రౌండ్‌కు తిరుగులేని ఆధిక్యాన్ని కనబరుస్తున్నారు. గట్టి పోటీని ఇస్తారని అందరూ ఊహించిన పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు దారుణమైన ఓటమి చవి చూసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సోమవారం రాత్రి తొమ్మిది గంటల వరకు కౌంటింగ్ చూస్తే మూడు రౌండ్లకు గాను 30 వేల పైచిలుకు మెజారిటీతో ఆలపాటి ముందున్నారు. నాల్గో రౌండ్‌కు 38,491, ఐదో రౌండ్‌కు 47,850 అధిక్యతతో కొనసాగుతున్నారు. మిగిలిన రౌండ్లలోనూ కూడా ఆలపాటి ఇదే విధమైన అధిక్యంతో దూసుకుపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. మెజారిటీ ఎంత సాధించబోతున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా సాగుతున్నట్టు తెలుస్తోంది. సోమవారం జరిగిన మూడు రౌండ్ల లెక్కింపులో కూటమి బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 30 వేల పైచిలుకు ఆధిక్యం వచ్చింది. మిగిలిన రౌండ్లలో కూడా ఇదే విధంగా దూసుకుపోతే 70 వేల నుంచి 80 వేల వరకు మెజారిటీ వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఆలపాటి విజయంపై ధీమాగా ఉన్నారు. ఆ దిశగానే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆత్మీయ సమ్మేళనాలతో ఓటర్లకు దగ్గరయ్యారు. తన రాజకీయ అనుభవాన్నంతా రంగరించి ఎన్నికల సమరంలో దిగారు. విద్యావేత్తగా తనకున్న పరిచయాలను ఉపయోగించుకున్నారు. ప్రచారానికి సాంకేతికతను జోడించి పట్టభద్రులకు చేరువయ్యారు. దీనికితోడు ఎక్కువ సంఖ్యలో పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించటం కూడా ఆయనకు కలిసొచ్చింది. తన ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రధానంగా ప్రస్తావించారు.

కూటమి పాలనపై సంతృప్తిగా..

ప్రభుత్వంపై ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం కూడా ఈ ఎన్నిక ద్వారా పటాపంచలు కానుంది. కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులంతా కూడా సానుకూలంగా ఉన్నారన్నది స్పష్టమవుతోంది. ఉద్యోగుల ఓట్లపైనే ప్రధానంగా పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగ వర్గం అంతా కూడా కూటమి అభ్యర్థికే జై కొట్టింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపుతో ఆ పార్టీ యువపట్టభద్ర ఓటర్లంతా కూడా ఆలపాటికి ఓట్లేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా ఆలపాటి గెలుపునకు కృషి చేయాలని ఆ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఆలపాటి గెలుపునకు కూటమి కలసికట్టుగా కృషి చేసిందనే చెప్పాలి.



గుంటూరులోని కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం చంద్రబాబు

టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ఎమ్మెల్సీ స్థానం కావడంతో ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం కోసం ఆయన తరచూ సమీక్షలు నిర్వహించారు. నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రతినిధు లకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆలపాటి విజయం కోసం ఉమ్మడి కృష్ణాజిల్లాలో వారు పడిన కష్టం అంతా, ఇంతా కాదు. ప్రతి నియోజకవర్గానికి పార్టీ అధిష్ఠానం పరిశీలకులను నియమించింది. పకడ్బందీగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు ఉన్నారని ఈ ఎన్నికతో తేటతెల్లమైంది. మొదటి నుంచి ఆలపాటి లక్ష ఓట్ల మెజారిటీ సాధిస్తారని టీడీపీ శ్రేణులు చెబుతున్నాయి.

● విజయీభవ



ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 36,392 మంది విద్యార్థులకు గానూ తొలిరోజు 35,813 మంది హాజరయ్యారు. నగరంలోని దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో తమ హాల్ టికెట్ నెంబర్‌ను చూసుకుంటున్న విద్యార్థులు

6లో

పక్కా కమర్షియల్

వాణిజ్య పన్నుల శాఖలో అధికారుల అవినీతి

● జీఎస్టీ రిజిస్ట్రేషన్ తనిఖీలకు వెళ్లిన ఓ మహిళా వ్యాపారవేత్త నుంచి రూ.10 వేలు వసూలు చేయడమే కాకుండా కారులో ఆమె చేయి పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు ఓ జీఎస్టీవో. తాజాగా నగరంలో జరిగిన ఘటన ఇది.

● వన్‌టౌన్‌లోని సామారంగం చౌక్ సర్కిల్‌లో పనిచేసే ఇద్దరు అధికారులు కొద్దిరోజుల క్రితం సీవీటీ తనిఖీలకు వెళ్లారు. ఓ వాహనాన్ని తనిఖీ చేసి సంబంధిత డీలర్‌కు ఫోన్‌చేసి రూ.20 వేలు తనకు చెందిన మరో వ్యక్తికి ఫోన్ పే చేయించుకున్నారు. తర్వాత రోజు ఓ ప్రైవేట్ వ్యక్తిని పంపి పెద్దమొత్తంలో డిమాండ్ చేశారు.

..వాణిజ్య పన్నుల శాఖలోని సర్కిల్ కార్యాలయాల్లో పనిచేసే అధికారుల వసూళ్ల దందా ఇది. జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తులు చేసుకున్నా, క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లినా, సీవీటీలు చేసినా డీలర్లు ముడుపులు ముట్టజెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. డిమాండ్ చేసిన మొత్తం చేతుల్లోకి వచ్చే వరకు డీలర్లను ముప్పతిప్పలు పెడుతున్నారు. కీలకమైన అధికారులంతా ఓ ముఠాగా మారి ఈ డబ్బును పంచుకుంటుండగా, వాటిని వసూలు చేయడానికి ప్రైవేట్ వ్యక్తులను నియమించుకోవడం ఇపుడు చర్చనీయాంశమైంది.



- ముఠాగా ఏర్పడి డీలర్ల నుంచి భారీ వసూళ్లు
- తనిఖీల్లో వసూళ్లకు ప్రైవేట్ వ్యక్తుల నియామకం
- ఫోన్ పే చేయించుకోవడానికి మరికొందరు
- వచ్చిన మొత్తాన్ని పంచుకుంటున్న అధికారులు
- మహిళా వ్యాపారవేత్తలపై అసభ్యకర ప్రవర్తన
- కాగితాలకే పరిమితమైన కమిషనరేట్ ఉత్తర్వులు


ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వాణిజ్య పన్నుల శాఖ నిత్యం చెకింగ్ వెహికల్ ట్యాక్స్ (సీవీటీ) తనిఖీలు జరుగుతాయి. ఈ తనిఖీలకు ఓ సర్కిల్ పరిధిలోని అధికారులను మరో సర్కిల్‌కు పంపుతారు. ఏ అధికారి ఎక్కడ సీవీటీ నిర్వహించాలన్న దానిపై ఆ శాఖ ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వస్తాయి. కొద్దిరోజుల క్రితం వరకు మిగతా 6లో..

మరో ఇద్దరు శిశువుల గుర్తింపు



శిశు సంక్షేమ శాఖ అధికారులకు శిశువును అందజేస్తున్న పోలీసులు

విజయవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మహిళా ముఠా ద్వారా ఉత్తరాది నుంచి వచ్చి వేర్వేరు దంపతుల చేతుల్లోకి వెళ్లిన ఇద్దరు శిశువులను సోమవారం విజయవాడ పోలీసులు గుర్తించారు. విశాఖ జిల్లా నర్సీపట్నంలో ఒక శిశువును, పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మరో శిశువును కొనుగోలు చేసిన దంపతుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. వారిని విజయవాడకు తీసుకొచ్చి మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు అప్పగించారు. విజయవాడకు చెందిన బగలం సరోజిని గ్యాంగ్‌ను అరెస్టు చేసి వారి నుంచి ముగ్గురు శిశువులను సంరక్షించిన సంగతి తెలిసిందే. తర్వాత రాజమహేంద్రవరం వద్ద ఉన్న సీతానగరంలో ఒక శిశువును గుర్తించారు. తాజాగా గుర్తించిన ఇద్దరు శిశువులతో కలిపి మొత్తం శిశువుల సంఖ్య ఆరుకు చేరింది. మరో శిశువు కోసం పోలీసులు గాలిస్తున్నారు.





పేదరికం.. దూరం దూరం

- ఉద్యాన పంటలతో ఆర్థిక వృద్ధి
- సామాజిక, ఆర్థిక అంశాల ప్రాతిపదికన సాగిన సర్వే

అత్యల్ప పేదరిక స్థాయి కలిగిన జిల్లాగా ఉమ్మడి కృష్ణా

జిల్లాకు రాష్ట్రంలోనే రెండోస్థానం.. ఉమ్మడి పశ్చిమ గోదావరి ఫస్ట్

పేదరిక స్థాయి అత్యల్పంగా ఉన్న జిల్లాగా ఉమ్మడి కృష్ణాజిల్లా రికార్డు సాధించింది. రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అగ్రస్థానం సంపాదించింది. పేదరిక తలగణన నిష్పత్తి (హెచ్‌యూఆర్) ప్రకారం ఉమ్మడి కృష్ణాజిల్లా 4.38 శాతాన్ని సాధించడంతో పాటు మల్టీ పోవర్టీ ఇండెక్స్ (ఎంపీఐ) స్కోర్ 0.017గా నమోదు చేసింది. అన్ని ప్రభుత్వ విభాగాల పనితీరు, సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రణాళిక విభాగంగా నిర్వహించిన సామాజిక ఆర్థిక సర్వేలో ఈ ఘనత సాధించింది.

- ఎన్టీఆర్ జిల్లాలో భారీగా ఎయిడ్స్ కేసులు.. రాష్ట్రంలో రెండో స్థానం
- ఉమ్మడి జిల్లాకు ఆర్థిక వనరులుగా ఉద్యాన పంటలు
- అసెంబ్లీలో సామాజిక ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన ప్రణాళిక విభాగం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 2024-25 సంవత్సరానికి సామాజిక ఆర్థిక సర్వేను సోమవారం రాష్ట్ర ప్రణాళిక విభాగం విడుదల చేసింది. ఏటా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈ విభాగం ఆధ్వర్యంలో గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ విభాగాల పనితీరు, సామాజిక, ఆర్థిక అంశాలను ఈ సర్వేలో పరిగణనలోకి తీసుకుంటారు. దీనినిబట్టి పేదరిక జిల్లాలకు సంబంధించి సవివర నివేదిక ఇస్తారు. అల్పాదాయ వర్గాలకు సకాలంలో డీబీటీ ద్వారా ఆర్థిక సహాయాలు అందించటం, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కార్యక్రమాలు చేపట్టడం, స్కిల్ డెవలప్‌మెంట్, ఎంఎస్ఎంఈ, మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహాలతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలైన గ్రామీణ ఉపాధి హామీ పథకం, పీఎంఏవై, ముద్ర రుణాలు, పీఎంజీకేవై, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమాలు.. వంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటారు.

ఎయిడ్స్‌లో రెండో స్థానం

ఎయిడ్స్ కేసుల్లో ఎన్టీఆర్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా మొదటిస్థానంలో మిగతా 6లో..

● స్థూల నీటి పారుదల ఇలా..

స్థూల నీటి పారుదల విషయానికొస్తే.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లాలో కాల్వల ద్వారా 0.12 లక్షల హెక్టార్లు, చెరువుల ద్వారా 0.15 లక్షల హెక్టార్లు, బావుల ద్వారా 0.46 లక్షల హెక్టార్లు, ఇతర పద్ధతుల ద్వారా 0.11 లక్షల హెక్టార్ల చొప్పున మొత్తం 0.84 లక్షల హెక్టార్ల మేర నీటిని అందిస్తున్నారు. కృష్ణాజిల్లాలో కాల్వల ద్వారా 1.43 లక్షల హెక్టార్లు, చెరువుల ద్వారా 0.03 లక్షల హెక్టార్లు, బావుల ద్వారా 0.31 లక్షల హెక్టార్లు, ఇతర పద్ధతుల ద్వారా 0.01 లక్షల హెక్టార్లు కలిపి మొత్తం 1.78 లక్షల హెక్టార్ల మేర సాగునీటిని అందిస్తున్నారు.

● వ్యవసాయ రుణాల పంపిణీ ఇలా..

2024-25 సంవత్సరానికి సంబంధించి షార్ట్‌టర్మ్ రుణాలు ఎన్టీఆర్ జిల్లాలో రూ.3,407 కోట్లు, కృష్ణాజిల్లాలో రూ.3,985 కోట్లు, వ్యవసాయ టర్మ్ రుణాలు-మౌలిక సదుపాయాలు-అనుబంధ కార్యకలాపాలకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాలో రూ.3,957 కోట్లు, కృష్ణాజిల్లాలో రూ.2,603 కోట్లు ఇచ్చారు. మొత్తంగా వ్యవసాయ రుణాలు చూస్తే ఎన్టీఆర్ జిల్లాలో రూ.7,364 కోట్లు, కృష్ణాజిల్లాలో రూ.6,588 కోట్ల మేర రుణ పంపిణీ జరిగింది.


● పంటసాగు హక్కు కార్డుల పంపిణీ ఇలా..

2024-25 ఆర్థిక సంవత్సరానికి పంట సాగు హక్కు కార్డుల పంపిణీ లక్ష్యం ఎన్టీఆర్ జిల్లాలో 55,560 కాగా, 2025, జనవరి 1 నాటికి 53,275 కార్డులను జారీ చేశారు. కృష్ణాజిల్లాలో 70 వేల కార్డులను జారీ చేయాల్సి ఉండగా, 66,683 జారీ చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యంలో ఎన్టీఆర్ జిల్లాలో 96 శాతం, కృష్ణాజిల్లాలో 95 శాతం సాధించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉద్యం పోర్టల్ ద్వారా పారిశ్రామిక యూనిట్ల కోసం ఎన్టీఆర్ జిల్లాలో 61,158 మంది, కృష్ణాజిల్లాలో 88,810 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.



56 మంది కొత్త ఎస్ఐలు

విజయవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు కొత్తగా 56 మంది ఎస్ఐలను హోంశాఖ కేటాయించింది. అనంతపురం జిల్లాలోని పోలీసు శిక్షణా కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న వారు కమిషనరేట్‌లో సోమవారం రిపోర్టు చేశారు. వారితో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు గౌతమీ షాలి, సరిత, తిరుమలేశ్వరరెడ్డి, కృష్ణమూర్తినాయుడు సమావేశం నిర్వహించారు. కేసుల నమోదు, దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, వాటిని రాసే విధానంపై సీపీ వివరించారు. కేసు డైరీ రాయడం, నేరస్థలాన్ని ఏవిధంగా పరిశీలించాలన్న దానిపై సూచనలు చేశారు. పోలీసు శాఖలోకి కొత్తగా అడుగుపెట్టిన వారిని అభినందించారు.



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-14 (మంగళ)
సహర్ (ఉదయం) : 5-11 (బుధ)

ప్రాణం తీసిన తగాదా

క్షణికావేశంలో పురుగుమందు తాగిన తండ్రీకొడుకు

తండ్రి మృతి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమారుడు

గంపలగూడెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో తండ్రీకొడుకుల మధ్య జరిగిన ఓ తగాదా ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. తండ్రి ప్రాణాలు కోల్పోగా, కొడుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గాదెవారిగూడెం గ్రామానికి చెందిన పసుపులేటి మల్లికార్జునరావు (55) సోమవారం మిర్చి పొలంలో పనులు చేయిస్తున్నాడు. ఆ పనుల విషయంలో మల్లికార్జునరావు కొడుకు కోటేశ్వరరావు కూలీలతో గొడవపడ్డాడు. దీనికి సంబంధించి ఇంటికి వెళ్లాక తండ్రీ కొడుకుల మధ్య తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. తండ్రి మల్లికార్జునరావు క్షణికావేశంలో పురుగు మందు తాగాడు. అది చూసిన కొడుకు కోటేశ్వరరావు కూడా తాగాడు. ఇద్దరినీ తోటమూలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, తండ్రి మల్లికార్జునరావు మృతిచెందాడు. కోటేశ్వరరావును తిరువూరులోని ఆసుపత్రికి తరలించారు.



6లో

రూ.12.13 కోట్లతో రాయనపాడు స్టేషన్ ఆధునికీకరణ

రాంగ్ టర్న్

ఇబ్రహీంపట్నం, జూపూడి వద్ద ప్రాణాలు తీస్తున్న యూటర్న్‌లు

● రాంగ్ రూట్‌లో వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్న వాహన చోదకులు ● పట్టించుకోని పోలీసులు,



ఇసుమంత ఏమరపాటు, కన్ను మూసి తెరిసే లోపు ఏమైందో తెలియనంత వేగం.. యూటర్న్ తీసుకునే సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోలేదంటే రాంగ్ టర్న్‌గా మారి కాటికి పోవాల్సిందే. వాహనాలను నిర్లక్ష్యంగా నడిపేవారికి, రాంగ్ రూట్‌లో వెళ్లేవారికి మృత్యు కుహరాలుగా మారిన ఐదు యూటర్న్‌లను ఇప్పుడు వాహన చోదకులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఇటీవల జరిగిన ఓ ఘటనలో సమాజానికి వైద్య సేవలందించాల్సిన ఇద్దరు వైద్య విద్యార్థినుల్లో ఒకరు మృతి చెందగా మరో విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉంది. దీనికి కారణం ఈ యూటర్న్‌లే. తస్మాత్ జాగ్రత్త.!! - ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం

విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇబ్రహీంపట్నం మండలం పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న ఒక యూటర్న్, జూపూడి వద్ద ఉన్న రెండు యూటర్న్‌లు, తుమ్మలపాలెం వద్ద ఒకటి, గుంటుపల్లిలోని రెండు పాఠశాలల వద్ద ఉన్న యూటర్న్‌లు రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అవే ఇప్పుడు వాహన చోదకులను కలవరపెడుతున్నాయి. జూపూడి యూటర్న్ వద్ద గత శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిమ్రా కళాశాల వైద్య విద్యార్థునుల్లో ఒకరు సయ్యద్ తాజ్ అఫ్సా (20) స్పాట్‌లో మృతిచెందగా, మరో వైద్య విద్యార్థిని అర్షా మెహవిష్ (21) ప్రాణాలతో పోరాడుతుండటం స్థానికులను నివ్వెరపరుస్తోంది. కాబోయే ఓ డాక్టర్‌ను కోల్పోవడానికి కారణం ఈ యూటర్నే ప్రధాన కారణమైతే కళాశాల యాజమాన్యం, పోలీసుల పరోక్ష కారణమని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. నిమ్రా కళాశాలకు వెళ్లేందుకు వైద్య, ఇంజనీరింగ్ విద్యార్థులు రాంగ్ రూట్‌ను ఎంచుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ యూటర్న్ వద్ద అటు కళాశాల యాజమాన్యం కానీ, ఇటు పోలీసులు కానీ విద్యార్థులు కళాశాలకు వచ్చిపోయే సమయంలో ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇద్దరు వైద్య విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయనే చెప్పాలి. అలాగే గుంటుపల్లి వద్ద ఉన్న డాన్‌బోస్కో స్కూల్, సెయింట్ అన్స్ స్కూళ్ల వద్ద ఉన్న యూటర్న్‌ల వద్ద కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతేడాది ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక డిగ్రీ విద్యార్థిని స్కూటీపై వెళుతూ యూటర్న్ తీసుకుంటుండగా లారీ ఢీకొని మృతి చెందింది. ఇక్కడ స్కూల్ పిల్లలు రోడ్డు దాటేటప్పుడు కూడా అటు పాఠశాలల యాజమాన్యాలు, ఇటు పోలీసులు ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. తుమ్మలపాలెం వద్ద ఉన్న యూటర్న్ వద్ద సైతం అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు మృత్యు కుహరాలుగా మారిన ఈ యూటర్న్‌ల వద్ద బారికేడ్స్ ఏర్పాటు చేయడంతో పాటు భద్రతా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద యూ టర్న్ తీసుకుంటున్న వాహనాలు

ఐక్యరాజ్యసమితి సదస్సుకు కొమ్మారెడ్డి



భారతీనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జైపూర్‌లో సోమవారం నుంచి ప్రారంభమైన ఆసియా, పసిఫిక్ ఐక్యరాజ్యసమితి సదస్సుకు రాష్ట్ర సర్క్యులర్ ఎకానమి ఫామ్ ప్రిన్సిపల్ సెక్ సురేష్‌కుమార్, సీనియర్ అధికారులతో కలిసి హాజరైనట్టు ఏపీ స్టేట్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మన రాష్ట్రంలో చెత్త నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా సరికొత్త సాంకేతికతలు, ఉత్తమ విధానాలను అవలంభించడం వంటి అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు.

చివరి గ్రామాలకూ సాగునీరందించాలి

● ఏపీ కౌలు రైతుల సంఘం



ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలురైతుల సంఘం నేతలు

గవర్నర్‌పేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో చివరి గ్రామం వరకూ సాగునీరు అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, సహాయ కార్యదర్శి బీ రంగారావు, నేతలు ఎస్‌కే మస్తానయ్య, మూర్తి తదితరులు మంగళవారం నగరంలోని ఇరిగేషన్ కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ తిరుమలరావును కలిసి వినతిపత్రం అందజేశారు. తాళ్లరేవు మండలంలో 6వేల ఎకరాల పైబడి వరి పొలం ఉందని, ప్రతి ఏడాది సుమారు 800 ఎకరాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదిలాగే కొనసాగితే రోడెక్కి నిరసన తెలుపుతామని, ఆ పరిస్థితి రాకుండా అధికారులు స్పందించి నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దుర్గగుడి చీరల స్కామ్‌పై దర్యాప్తు ముమ్మరం

ఇంద్రకీలాద్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై ఉన్న దేవస్థానం చీరల విభాగంలో జరిగిన అవకతవకలపై దేవదాయ శాఖ కమిషనర్, దుర్గగుడి ఈవో కె.రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. 2018-2019 మధ్య చీరల అమ్మకంలో సుమారు రూ.2కోట్లు అవకతవకలు జరిగాయని నాటి విచారణాధికారి దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపారు. కమిషనర్ ఆ నివేదికను ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు కమిషనర్ కాణిపాకం దేవస్థానం ఈవోను విచారణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన రిటైర్డ్ కావటంతో విచారణ నిలిచింది. ప్రస్తుతం కమిషనర్ మరో విచారణ కమిటీని నియమించారు. ఇందులో డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాసరావు, వెంకటేష్, సూపరింటెండెంట్ కె.ఎల్.ఎన్.శెట్టి ఉన్నారు. ఈ కమిటీ సోమవారం ఆలయానికి వచ్చి విచారణ చేపట్టారు. పూర్వ ఈవో భ్రమరాంబ హయాంలో చీరల విభాగంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్టు వెలుగులోకి వచ్చాయి. ఆ తరువాత ఉన్నతాధికారులు విచారణ చేపట్టి నివేదికను పంపడం, గుమస్తా సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేయడం, అతడు కోర్టును ఆశ్రయించి విధుల్లో చేరడం జరిగింది. తాజాగా కమిషనర్ నియమించిన ఈ కమిటీ సోమవారం దుర్గగుడి చీరల విభాగానికి విచ్చేసి తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు.

7, 8న ఉన్నతాధికారుల విచారణ

దుర్గగుడిలో చీరల గోల్‌మాల్‌పై ఈనెల 7,8న విచారణ జరుగుతుందని ఈవో కె.రామచంద్రమోహన్ తరఫున ఏఈవో పి.సుధారాణి సోమవారం నోటీసు జారీ చేశారు. తొలుత ఈ విచారణ 11, 12న జరుగుతుందని సమాచారం ఇచ్చినా వివిధ కారణాలతో 7,8న జరుగుతుందన్నారు. గుంటూరు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విచారణ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఆడిట్, చీరలు, ఫెస్టివల్, పూజలు, ప్రధాన ఆలయం, పరిపాలనా, లీజులు, లీగల్ విభాగాలకు చెందిన ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, గుమస్తాలు, ఈనెల 7న మహామండపంలోని 5వ అంతస్తులోని చీరల గోడౌన్‌కు ఉదయం 9 గంటలకల్లా రావాలని పేర్కొన్నారు.

పర్యాటక కేంద్రంగా కొండపల్లి

● ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్

ఇబ్రహీంపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో కొండపల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఏపీ టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ అన్నారు. సోమవారం ఆయన కొండపల్లి బొమ్మల కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ - విజయవాడ హైవే పక్కనే ఉన్న కొండపల్లిలోని కొండపల్లి బొమ్మలను ప్రతి శని, ఆదివారాల్లో టూరిజం ప్యాక్‌లో చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే పర్యాటలకు టూ డేస్ ప్యాకేజీగా ప్రమోట్ చేయాలనుకుంటున్నామన్నారు. కొండపల్లి బొమ్మల చరిత్ర, తయారీ విధానాన్ని ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషల్లో వివరించేలా ట్రాన్స్‌లేటర్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కొండపల్లి బొమ్మలను, ఖిల్లాను, ఏపీ టూరిజానికి సంబంధించిన ఆస్తులను ఆయన సందర్శించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం వాళ్లు చూసేలా టూరిజం ప్యాకేజీలో అమరావతితో పాటు దుర్గా టెంపుల్, కొండపల్లి ఖిల్లా, కొండపల్లి వాటర్ ఫాల్స్ చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.



కొండపల్లిలో పర్యటిస్తున్న అజయ్‌జైన్

రూ.కోటితో భవనం కడితే నిరుపయోగం

కొండపల్లి బొమ్మల కళాకారుల కోసం కోటి రూపాయలతో సొసైటీ భవనం కట్టించి ఇస్తే ఎందుకిలా నిరుపయోగంగా ఉంచారంటూ అజయ్ జైన్ సీరియస్ అయ్యారు. పర్యాటకులు వచ్చినప్పుడు ఎక్కువ మంది సొసైటీ భవనంలో బొమ్మలు ఏర్పాటు చేస్తుంటే పర్యాటకులు వాటిని ఫొటోలు తీసుకోవడం, వాటి తయారీ, చరిత్ర తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారు వచ్చినప్పుడు తయారీదారులే భవనంలో లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన, పర్యాటకశాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోడూరుపాడులో అరుదైన పునుగుపిల్లి

● మగ పునుగుపిల్లిగా గుర్తించిన అటవీశాఖ సిబ్బంది



హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అటవీ ప్రాంతంలో మాత్రమే ఎక్కువగా కనిపించే పునుగుపిల్లి కృష్ణాజిల్లా బాపులపాడు మండలంలోని కోడూరుపాడులో సోమవారం తెల్లవారుఝామున కనిపించింది. ఆళ్ల భాను అనే వ్యక్తి ఇంటి ముందు ఖాళీ ప్రదేశంలో తిరుగాడుతుండగా గమనించి స్థానికుల సహాయంతో వలవేసి పట్టుకుని బోనులో భద్రపరచారు. తొలుత ఏదో జంతువుగా భావించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు సోమవారం ఉదయం గ్రామానికి చేరుకుని ఆరుదైన జాతికి చెందిన మగ పునుగుపిల్లిగా గుర్తించారు. తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో తరించే పునుగుపిల్లి కోడూరుపాడులో దర్శనమివ్వడంతో స్థానికులు చూసేందుకు ఎగబడ్డారు. డీఎఫ్ఓ సునీత సూచనల మేరకు డీఆర్ఓ ప్రకాష్ పంచనామా నిర్వహించి దగ్గరలో ఉన్న సూరవరం అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు బోనుతో సహా తరలించారు.

ప్రజా రవాణా సంస్థలో.. తాత్కాలిక బదిలీలు కొనసాగించండి

● నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ వినతి

బస్టేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థలో ప్రస్తుతం అమలులో ఉన్న తాత్కాలిక బదిలీలను శాశ్వత బదిలీలు ఇచ్చేవరకు కొనసాగించాలని ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సంస్థ కమిషనర్, వీసీ, ఎండీకి విన్నవించిం ది. ఈ మేరకు సోమవారం ఒక పత్రికా ప్రకటనలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వెంకటరమణారెడ్డి గతంలో తాత్కాలిక బదిలీల గురించి చేసిన ప్రయత్నాల క్రమంలో శాశ్వత బదిలీలు అయ్యేంత వరకు తాత్కాలిక బదిలీలు కొనసాగేలా ఉత్తర్వులు ఇచ్చారన్నారు.

తాడేపల్లిలో గంజాయి విక్రేత అరెస్టు

తాడేపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో గం జాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం తాడేపల్లి పోలీసులు అ రెస్టు చేశారు. సీఐ కళ్యాణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ ప రిధిలోని సీతానగరం పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్ముతున్నార న్న సమాచారంతో నిఘా పెట్టగా రైల్వే వంతెన వద్ద ముగ్గురు వ్యక్తు లు గంజాయి అమ్ముతుండగా పట్టుకునే క్రమంలో పారిపోయారు. విద్యాధరపురానికి చెందిన గుమ్మడి సాయికుమార్‌ను అరెస్టు చేసి అతడి నుంచి కేజీ 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామ ని సీఐ కళ్యాణ్‌రాజు తెలిపారు. కాగా విజయవాడకు చెందిన కోటి, మహేష్ అనే వారిని పట్టుకుంటామని తెలిపారు.

జీఎస్టీవో ఆనంద్‌రావుపై వేటు

విజయవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నుల శాఖలో విజయవాడ డివిజన్-1 పరిధిలోని గొల్లపూడి సర్కిల్‌లో జీఎస్టీవోగా పనిచేస్తున్న ఆనంద్‌రావుపై ఆ శాఖ ముఖ్య కమిషనర్ బాబు ఏ వేటు వేశారు. ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సోమవారం ఆదేశాలిచ్చారు. నున్నకు చెందిన ఓ మహిళ వ్యాపారవేత్త జీఎస్టీ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.10వేలు డిమాండ్ చేశాడు. ఆమె నగదు ఇవ్వడానికి సిద్ధమవ్వగా తనను కారు ఎక్కించుకుని చేయి పట్టుకున్నాడని బాధితురాలు ముఖ్య కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై ఆయన విచారణకు ఆదేశించారు. పార్కు రోడ్డు సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ విచారణ చేసి నివేదిక ఇచ్చారు. దీని ఆధారంగా ఆనంద్‌ను సస్పెండ్ చేశారు.

సజావుగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

విజయవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 36,392 మంది విద్యార్థులకు గాను 35,813 మంది విద్యార్థులు హాజరయ్యారు. 579 మంది పరీక్షలకు హాజరుకాలేదు. తొలిరోజున జరిగిన లాంగ్వేజ్ పరీక్షలకు సెట్-1 ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేశారు. కృష్ణాజిల్లాలో మొత్తం 201,171 మంది విద్యార్థులకు గాను 19,873 మంది విద్యార్థులు హాజరయ్యారు. 298 మంది విద్యార్థులు హాజరుకాలేదు.

131 మద్యం సీసాలు స్వాధీనం

విజయవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రహస్యంగా మద్యం అమ్మకా లు సాగిస్తున్న నలుగురిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నా రు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నలుగురు వ్యక్తులు ముందుగానే మ ద్యం సీసాలను కొనుగోలు చేసి ఇళ్లలో భద్రపరుచుకున్నారు. సోమవారం రా త్రి రహస్యంగా విక్రయిస్తుండగా సీఐ విజయసుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని 131 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎలియాజర్, హెచ్‌సీ పలగాని చెన్నారావు, ఎంఎస్పీ శివ, ఆర్.రాంబాబు, ఎ.గురుబ్రహ్మం, బి.హరీష్ పాల్గొన్నారు.

మహిళా శక్తిని, యుక్తిని చాటేలా వేడుకలు

● సమన్వయ శాఖల అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తిని, యుక్తిని చాటిచెప్పేలా ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహణకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించే కార్యక్రమాలపై చర్చించేందుకు కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి, పురపాలక, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయం, ఇలా వివిధ శాఖల అధికారులు మహిళా కేంద్రీకృత కార్యక్రమాల నిర్వహణకు సిద్ధం కావాలన్నారు. మహిళా సాధికారతను ప్రతిబింబించేలా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. స్వీయ రక్షణపై మహిళలకు అవగాహన కల్పించే కార్యక్రమాలపైనా దృష్టిసారించాలని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పీఓ-యూసీడీ వెంకటరత్నం, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత సమాజానికి సమష్టి కృషి అవసరం

బాల్య వివాహ రహిత సమాజం కోసం సమష్టిగా కృషిచేయాలని, వాటి దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విజయవాడ సివిల్ కోర్టు సమీపంలోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, చిల్డ్రన్ హోం ప్రాంగణంలో బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని సిగ్నేచర్ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ అధికారి డి.శ్రీలక్ష్మి, నోడల్ అధికారి సిహెచ్.సాయిగీత, సీడీపీఓలు జ్యోత్స్న, జి.మంగమ్మ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.రాజరాజేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలను గుర్తించాలి...

చిన్నపిల్లల్లో వినికిడి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వారి ఆరోగ్యకర జీవితానికి మంచి పునాది వేయొచ్చని, చెవి సంరక్షణ, వినికిడి ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని కలెక్టర్ లక్ష్మీశ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో లక్ష్మీశ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. వినికిడి సమస్యలకు కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, సీపీవో వై.శ్రీలత, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

రూ.12.13 కోట్లతో రాయనపాడు స్టేషన్ ఆధునికీకరణ



రాయనపాడు రైల్వేస్టేషన్

రైల్వే స్టేషన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరానికి సమీపంలో ఉన్న రాయనపాడు రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ కింద రూ.12.13 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న ఏపీలో 53 రైల్వే స్టేషన్లను అన్ని సౌకర్యాలతో అప్‌గ్రేడ్ చేస్తున్నారు. వాటిలో రాయనపాడు స్టేషన్ ఒకటి. ఇది ఎన్ఎస్‌జీ-5 కేటగిరి కింద పనిచేస్తుంది. స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫారాలున్నాయి. విజయవాడ జంక్షన్‌కు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ స్టేషన్‌లో రోజు మొత్తంలో 20 రైళ్లు ఆగుతాయి. చెన్నై - బల్లార్ష - నాగపూర్ - న్యూఢిల్లీ ట్రాక్ మార్గంలో అత్యంత రద్దీగా ఉండే స్టేషన్లలో ఒకటిగా నిలిచింది. దీన్ని విజయవాడ బైపాస్ స్టేషన్ అని కూడా పిలుస్తారు. నాగపూర్, సికింద్రాబాద్ (వరంగల్ మీదుగా) నుంచి విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కత్తా వైపు వెళ్లే అనేక రైళ్లు విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌కు వెళ్లకుండానే రాయనపాడు స్టేషన్‌లోనే ఆగుతాయి. అందుకే ఈ స్టేషన్‌కు ప్రాముఖ్యత ఏర్పడింది. స్టేషన్ వెలుపల భాగాన్ని అందంగా తీర్చిదిద్దటంతో పాటు ప్రయాణికుల రాకపోకలకు ఆటంకాలు లేకుండా ట్రాఫిక్ రద్దీ లేకుండా అభివృద్ధి చేస్తున్నారు. రైల్వేస్టేషన్‌కి ప్రవేశించటానికి వరండా, దివ్యాంగులకు అనుకూలమైన మరుగుదొడ్లు, ఏసీ వెయిటింగ్ హాల్, విశాలమైన పార్కింగ్ ప్రాంతంతోపాటు ప్లాట్‌ఫారం సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్లాట్‌ఫారం ఉపరితలం పనులు, ప్లాట్‌ఫారంపై షెల్టర్లు, వెయిటింగ్ హాల్, మాడ్యులర్ టాయిలెట్, ప్రవేశ ద్వారం, పరిసర ప్రాంతాల అభివృద్ధి, లిఫ్ట్ పనులుతో సహా 58 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ఏడాది చివరి నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 53 రైల్వే స్టేషన్లను రూ.2,611కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. తిరుపతి, నెల్లూరు రైల్వే స్టేషన్ల పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. మరోవైపు తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను యాత్రికుల రద్దీని తగ్గించటానికి క్రాసింగ్ స్టేషన్‌గా అభివృద్ధి చేస్తున్నారు.

ఔషధ మొక్కల సాగుతో అత్యధిక లాభాలు

గాంధీనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఔషద మొక్కల సాగుతో అత్యధిక లాభాలు పొందొచ్చని పలువురు వక్తలు తెలిపారు. రాష్ట్రస్థాయి ఔషద, సుగంధ మొక్కల పంటల కొనుగోలుదారులు, అమ్మకందారుల అవగాహన సదస్సు గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో సోమవారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆయుష్ డిపార్ట్‌మెంట్ హోమియోపతి అదనపు డైరెక్టర్ డాక్టర్ సుజాత, ఏపీఈడీఏ సంస్థ ప్రాంతీయ డైరెక్టర్ పెద్దస్వామి, సీఎస్ఐఆర్- సీఐఎంఏపీ సంస్థ ప్రిన్సిపల్, సీనియర్ సైంటిస్ట్ కేవీఎస్.సత్య శ్రీనివాస్, డాక్టర్ బృందావనం, కళ్యాణ్‌బాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన రైతులు, అమ్మకందారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఏపీ మెడిసినల్ అండ్ ఆటోమేటిక్ ప్లాంట్ బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికం.. దూరం దూరం

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం 18,252 మంది హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వీరికి యాంటీ రిట్రోలర్ థెరపీ (ఏఆర్‌టీ) కింద వైద్య సదుపాయాలు అందిస్తున్నారు. 2024-25 సంవత్సరంలో మాత్రం కేసులు స్వల్పంగా తగ్గాయి. పాజిటివిటీ రేటు 1.27గా ఉంది. కృష్ణాజిల్లాలో 6,379 కేసులు మాత్రమే నమోదు కాగా, పాజిటివిటీ రేటు 0.82 శాతంగా ఉంది.

ఆర్థికవృద్ధికి ఉద్యాన పంటలు

ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్థికాభివృద్ధిలో ఉద్యాన పంటలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. మామిడి దిగుబడిలో ఎన్టీఆర్ జిల్లాలో 14 మిలియన్ టన్నులు, కృష్ణాజిల్లాలో 14 మిలియన్ టన్నులు, అరటిలో ఎన్టీఆర్ జిల్లాలో 64, కృష్ణాలో 62 మిలియన్ టన్నులు, బొప్పాయి ఉత్పత్తిలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 87, కృష్ణాలో 82.5 మిలియన్ టన్నులు, కొబ్బరికాయల్లో ఎన్టీఆర్ జిల్లాలో 16, కృష్ణాజిల్లాలో 17 మిలియన్ టన్నులు, స్వీట్ ఆరెంజ్ ఉత్పత్తిలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 21.5, కృష్ణాజిల్లాలో 0, ఆయిల్‌పామ్‌లో ఎన్టీఆర్ జిల్లాలో 20, కృష్ణాజిల్లాలో 20 మిలియన్ టన్నులు, జీడిపప్పు ఉత్పత్తిలో ఎన్టీఆర్ జిల్లాలో 1, కృష్ణాజిల్లాలో 1 హెక్టార్, మిరప ఉత్పత్తిలో ఎన్టీఆర్ జిల్లాలో 6.20, కృష్ణాజిల్లాలో 5.75 మిలియన్ టన్నులు, టమాటా ఉత్పత్తిలో ఎన్టీఆర్ జిల్లాలో 64, కృష్ణాజిల్లాలో 60 మిలియన్ టన్నుల మేర దిగుబడి లభిస్తోంది.

పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తిలో..

పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తికి సంబంధించి కూడా ప్రణాళిక విభాగం నివేదిక ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సగటున రోజుకు ఎన్టీఆర్ జిల్లాలో 2,54,809 లీటర్లు, కృష్ణాజిల్లాలో 3,31,610 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. మాంసం ఉత్పత్తిలో ఎన్టీఆర్ జిల్లాలో 26,670 కేజీలు, కృష్ణాజిల్లాలో 29,734 కేజీలు, కోడిగుడ్ల ఉత్పత్తిలో ఎన్టీఆర్ జిల్లాలో 94 లక్షలు, కృష్ణాజిల్లాలో 1.40 కోట్లు చూపించారు. ఎన్టీఆర్ జిల్లాలో 28,397 పశువులు ఉండగా, కృష్ణాజిల్లాలో 36,126 ఉన్నాయి. గేదెలు.. ఎన్టీఆర్ జిల్లాలో 2,35,052, కృష్ణాజిల్లాలో 2,83,711 ఉన్నాయి. గొర్రెలు.. ఎన్టీఆర్ జిల్లాలో 2,34,933, కృష్ణాలో 2,19,734 ఉన్నాయి. మేకలు.. ఎన్టీఆర్ జిల్లాలో 91,979, కృష్ణాలో 53,764 ఉన్నాయి. పందులు.. ఎన్టీఆర్ జిల్లాలో 1,686, కృష్ణాజిల్లాలో 3,656, కోళ్లు.. ఎన్టీఆర్ జిల్లాలో 39,13,406, కృష్ణాజిల్లాలో 55,67,749 ఉన్నాయి.

పక్కా 'కమర్షియల్'

(5వ పేజీ తరువాయి)

సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్లు ఈ సీవీటీలకు వెళ్లేవారు. తర్వాత వెళ్లడం మానేశారు. ఎవరిని తనిఖీలకు పంపాలో ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నడుచుకుంటున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా వాణిజ్య పన్నుల శాఖలో సుమారు 20 సర్కిళ్ల వరకు ఉన్నాయి. ఒక్కో సర్కిల్‌కు ఒక అసిస్టెంట్ కమిషనర్, ఇద్దరు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు, ముగ్గురు నుంచి నలుగురు జీఎస్టీవోలుంటారు. వీరంతా ఓ ముఠాగా ఏర్పడుతున్నారు. ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలను పక్కన పెట్టేసి, తమ వర్గం అనుకున్న వారిని సీవీటీలకు పంపుతున్నారన్న ఆరోపణలున్నాయి. తనిఖీల్లో వసూలు చేసిన మొత్తాలను ఈ బ్యాచ్ వాటాలు వేసుకుంటోందని వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

బినామీలతో వ్యవహారాలు

తనిఖీలకు వెళ్తున్న అధికారులు తమ చేతులకు మట్టి అంటుకోకుండా వ్యవహారాలు నడుపుతున్నారు. ముఖ్యంగా ముడుపుల బాగోతాల విషయంలో చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. సీవీటీ తనిఖీల్లో వసూలు చేసే ముడుపుల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నారు. వాస్తవానికి ఈ తనిఖీలకు డ్రైవర్, అటెండర్, వాచ్‌మెన్లను ఉపయోగించకూడదు. కొన్ని సర్కిళ్లలోని అధికారులు వారి ద్వారానే ముడుపుల స్వీకరణ చేయిస్తున్నారు. మరికొన్ని సర్కిళ్లలో డీలర్ల నుంచి వసూలు చేయడానికి ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుంటున్నారు. వారి ఫోన్ పే, గూగుల్ పేకు చెల్లింపులు చేయించుకుంటున్నారు. ఒక్కో తనిఖీల్లో రోజుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అవినీతి ఆరోపణలు ఉన్న అధికారులను ఈ తనిఖీలకు పంపుతుండడం గమనార్హం. కొద్దినెలల క్రితం గాంధీనగర్ సర్కిల్‌లోని అధికారులు వాణిజ్య పన్నుల శాఖ అప్పిలేటివ్ అథారిటీలో పనిచేస్తున్న అధికారికి చెందిన బంధువుల నుంచి రూ.4లక్షలు డిమాండ్ చేయడం దుమారాన్ని రేపింది. తాజాగా సామారంగం చౌక్ సర్కిల్‌లోని అధికారులు సీవీటీలకు వెళ్లి రూ.20 వేలు వసూలు చేశారు. తర్వాత పెద్దమొత్తంలో డబ్బు పంపాలని సంబంధిత డీలర్‌కు ఫోన్లు చేసినట్టు సమాచారం.

సీఆర్‌యూలోనూ వసూళ్లు

ప్రస్తుతం అన్ని సర్కిల్ కార్యాలయాల్లో అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్తున్నారు. సాధారణంగా డీలర్ల జీఎస్టీ రిజిస్ట్రేషన్ నెంబర్లకు ఆధార్ అనుసంధానం కావాలి. కొంతమంది డీలర్లు వారి ఆధార్‌ను అనుసంధానం చేయించలేదు. ప్రతి ఏజెన్సీని తనిఖీ చేసి జీఎస్టీ రిజిస్ట్రేషన్ నెంబర్‌కు ఆధార్‌ను అనుసంధానం చేయించాలని ముఖ్య కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ విధులను పర్యవేక్షించడానికి అక్కడ ప్రత్యేక సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (యూనిట్) పనిచేస్తోంది. ఈ తనిఖీలకు వెళ్లిన అధికారులూ భారీగా ముడుపులు వసూలు చేస్తున్నారు. తాజాగా గొల్లపూడి సర్కిల్‌లో పనిచేస్తున్న జీఎస్టీవో నున్నకు చెందిన మహిళను రూ.10 వేలు డిమాండ్ చేయడంతో పాటు వాటిని తీసుకునే క్రమంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన వాణిజ్య పన్నుల శాఖలో పెద్ద దుమారాన్ని రేపుతోంది. దీనిపై అధికారులు ఇప్పటికే విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఆ సర్కిల్‌లోని మరో అధికారి పాత్ర ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

విరిగిన కరెంటు స్తంభాలను తొలగించాలి



పటమట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 12వ డివిజన్ ధనేకుల పున్నారావు వీధిలో శిరీష్ కంపెనీ వెనుక భాగంలో రోడ్డు పక్కనే తొలగించిన విద్యుత్ స్తంభాలను కొన్ని నెలలుగా పడేసి ఉంచారు. వాటి పక్కనే థర్మాకోల్ షీట్స్ వ్యర్థాలను గుట్టలుగా పెట్టారు. దోమలకు, విష కీటకాలకు ఆవాసాలుగా అవి మారకముందే వాటిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వడదెబ్బపై అవగాహన పెంచుకోవాలి

● డాక్టర్ జి.సమరం



మాట్లాడుతున్న డాక్టర్ జి.సమరం

పటమట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఎండలు, వాటి వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ వైద్యుడు సమరం సూచించారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో సోమవారం జరిగిన ఆరోగ్య సదస్సులో మనిషిపై అతి ఉష్ణం- అతి శీతలం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉష్ణోగ్రత 54 సెంటీగ్రేడ్స్ కంటే ఎక్కువైతే ప్రాణాంతకమన్నారు. శీతాకలంలో బయట చల్లదనం 18 డిగ్రీల కంటే తగ్గితే ప్రాణాలు తీస్తుందన్నారు. అతి ఉష్ణం, అతి శీతలం వల్ల మెదడ్లో షీట్ రెగ్యూలేషన్ సెంటర్ వైఫల్యం చెందుతుందన్నారు. వేసవిలో వడ దెబ్బ సహజమన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి వెంటనే ప్రాథమిక చికిత్స చేయించాలన్నారు. వేసవిలో వదులుగా ఉండే నూలు దుస్తులు ధరించాలన్నారు. నివాసం ఉండే గదులను చల్లగా ఉంచుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు టోపి, గొడుగు, తల గుడ్డ ధరించాలన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగవద్దని ఆయన సూచించారు.



పోస్టాఫీసు రోడ్డులో సంచరిస్తున్న కుక్కలు

వీధికుక్కల స్వైర విహారం

స్థానికుల బెంబేలు

పటమట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోస్టాఫీసు బజారులో, ఆర్టీసీ కాలనీల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ వాహన చోదకులను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మున్సిపల్, వెటర్నరీ అధికారులు కుక్కలను నిర్మూలిస్తున్నామని ప్రకటనలు ఇచ్చేందుకే పరిమితం అయినట్లు, నివారణ చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద నివారణకు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని స్థితిలో ఉన్నట్లు ప్రజలు చెబుతున్నారు. సంబంధిత అధికారులు కుక్కలను నిర్మూలించాలని పలువురు కోరుతున్నారు.

శతకాలతో బ్యాటర్లు

భారీ స్కోర్‌తో ఫ్రెండ్స్ సీసీ జట్టు గెలుపు





శ్యామ్ ప్రసాద్(159), సుశాంత్‌నాయుడు(138) ఫ్రెండ్స్ సీసీ జట్టు క్రీడాకారులు

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మూలపాడు గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బి లీగ్ మ్యాచ్‌లలో సోమవారం పటేల్ సీసీ, ఫ్రెండ్స్ సీసీ మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఫ్రెండ్స్ సీసీ జట్టు 50ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి 348పరుగులు భారీ స్కోర్ చేసింది. జట్టులో ఎం.శ్యామ్ ప్రసాద్ 159పరుగులు, ఎం.సుశాంత్ నాయుడు 138పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పటేల్ సీసీ జట్టు 24.4ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 140పరుగులు చేసి ఓటమి పాలైంది.



పతకాలు సాధించిన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన

ఖేలో భారత్ నగర క్రీడోత్సవ్‌లో

సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినులకు పతకాలు

విజయవాడ(స్పోర్ట్స్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఖేలో భారత్ నగర క్రీడోత్సవ్‌లో తమ కళాశాల విద్యార్థినులు పలు క్రీడాంశాల్లో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాలు సాధించినట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.హేమ తెలిపారు. బ్యాడ్మింటన్, కబడ్డీ, అథ్లెటిక్స్ తదితర అంశాల్లో పతకాలు సాధించగా క్రీడాకారులను కళాశాల కన్వీనర్ లలిత ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.మాధవి తదితరులు అభినందించారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం







సిద్ధార్థ మహిళా కళాశాల పరీక్ష కేంద్రానికి తమ పిల్లలను తీసుకువచ్చిన తల్లిదండ్రులు, పరీక్షా కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది, ఎంజీ రోడ్డులోని చైతన్య పరీక్షా కేంద్రం వద్ద కుమారుడికి బెస్టాఫ్ లక్ చెబుతున్న తండ్రి

నూతన పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి

ఎంపీ కేశినేని శివనాథ్



మాట్లాడుతున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగంలో నూతన పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఏపీఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని ఆటోమొబైల్ పారిశ్రామికవేత్తలు, ఇతర పారిశ్రామికవేత్తలు సోమవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను కలిశారు. ఆటో మొబైల్ రంగంలో నూతన పరిశ్రమలను స్థాపించటానికి కావాల్సిన సదుపాయాలు, ప్రభుత్వం అందించాల్సిన సహాయ సహకారాలు, కొనసాగుతున్న పరిశ్రమలకు అందించాల్సిన చేయూత తదితర విషయాలను పారిశ్రామికవేత్తలు ఎంపీతో చర్చించారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీలో ఉద్యోగాలు పెంచేందుకు విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన సంస్కరణలను ఎఫ్‌ట్రానిక్స్ సీఈవో రామకృష్ణ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు తన దృష్టికి తీసుకువచ్చిన విషయాలను ముఖ్యమంత్రితో పాటు విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. అనంతరం ఎంపీ శివనాథ్‌కు ఆటోమొబైల్ ఇండస్ట్రీ పారిశ్రామికవేత్తలు మెమెంటో బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ గౌరవ ప్రెసిడెంట్ బాయన వెంకట్రావు, ప్రెసిడెంట్ దోనేపూడి దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ ఎం. రామచంద్ర రావు, జేఆర్డీ టాటా ఇండస్ట్రీస్ ఎస్టేట్ సొసైటీ చైర్మన్ వినోద్ బాబు, విజయవాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ సెక్రటరీ టి.నాగేశ్వరరావు, పారిశ్రామికవేత్తలు, టీడీపీ నాయకులు, ఎంఎస్ఎంఈ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సంకె విశ్వనాథం, మాజీ కార్పొరేటర్ కాకు మల్లికార్జున యాదవ్ పాల్గొన్నారు.

కృత్రిమ మేథస్సుపై లయోలాలో సదస్సు

భారతీనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం, యూజెడ్‌వీఐఎస్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కళాశాల సెమినార్ హాల్‌లో కృత్రిమ మేథస్సు (ఏఐ భవిష్యత్తు అన్వేషణ) అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు యూజెడ్‌వీఐఎస్ కంపెనీ రిసోర్స్ పర్సన్ ఎ. ధ్రువ పాల్గొని విద్యార్థులకు కృత్రిమ మేథస్సు (ఏఐ) తాజా పరిణామాలను వివరించారు. కంప్యూటరింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ , రోబోటిక్స్ ఇంజనీరింగ్ తదితర అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ సదస్సులో కంపెనీ రిసోర్స్ పర్సన్లు అనిల్ శివ, తరుణ్, లిఖిత, కంప్యూటర్ విభాగాధిపతి టీ. కమలాకర్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలను సమర్థంగా నిర్వహించండి

రాష్ట్ర పరీక్షల సంచాలకుడు కేవీ శ్రీనివాస్‌రెడ్డి



మొగల్రాజపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పదవతరగతి పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని రాష్ట్ర పరీక్షల సంచాలకుడు కేవీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవారం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలను ఎలా నిర్వహించాలనే దాని మీద సూచనలు చేశారు. ముఖ్యంగా సెల్ ఫోన్‌లను పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 168 పరీక్షా కేంద్రాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 11,696 మంది, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 15,987 మంది, ఓపెన్ 1743 మంది పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. 336 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 336 మంది డిపార్టుమెంట్ అధికారులు, 50 మంది కస్టోడియన్‌లు విధుల్లో ఉంటారని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

గుణదల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గుణదల వాటర్ పంపింగ్ ఇన్‌టేక్ వెల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతుల నేపథ్యంలో బుధవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనుందని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. 6న యదావిధిగా నీటి సరఫరా జరగనుందని చెప్పారు. శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, నాగార్జున నగర్, కరెన్సీనగర్, శ్రీరామచంద్ర నగర్, గణేష్ నగర్ కాలనీ, కామినేని నగర్, భారతీ నగర్, క్రీస్తురాజపురం కొండ ప్రాంతం, ఓడీఏ ట్యాంక్ పై భాగం, ఫిలిం కాలనీ, జయప్రకాష్ నగర్, గంగిరెద్దుల దిబ్బ, లూర్దునగర్, బెత్లహామ్ నగర్, కార్మిక నగర్, దేవినేని నగర్, రెవెన్యూ కాలనీ, మాచవరం, మసీదు వీధి, కంచుకోట బజార్, ఎస్‌బీహెచ్ కాలనీ, ఐటీఐ రోడ్డు, ఓల్డ్ 5 రూట్, గుంటూరు బాపనయ్య కాలనీ, అంబేడ్కర్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, విజయలక్ష్మి కాలనీ, సుబ్బారావు కాలనీ, గజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సీటీవో కాలనీల వారికి బుధవారం సాయంత్రం తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగనుందని చెప్పారు.

సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు



సోది చెబుతున్న అధ్యాపకులు



ఫ్యాన్సీ డ్రెస్ పోటీలో విద్యార్థిని

ప్రభుత్వాసుపత్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఏపీ హంస ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు పాటలు, వక్తృత్వం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 8న బహుమతులు అందించనున్నారు. ఈసందర్భంగా ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వినుకొలు రామకృష్ణ, సహ అధ్యక్షుడు కేబీసీ శేఖర్, ఆశాలత, సమత, వనిత, సిద్ధంశెట్టి రమణ జాలం సరోజిని, బొమ్మగంటి రాంబాబు, భార్గవి, నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగ శేషమ్మ, రమణ, విజయలక్ష్మి, వెంకట రమణ పాల్గొన్నారు.

తెలంగాణలో ఉన్న ఏపీ హోంగార్డులను రాష్ట్రానికి బదిలీ చేయాలి

● ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్

గాంధీనగర్: తెలంగాణలో విధులు నిర్వర్తిస్తున్న ఏపీకి చెందిన హోంగార్డులను రాష్ట్రానికి బదిలీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక దాసరిభవన్‌లోని సోమవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన వేలాది మంది హోంగార్డులు ఉమ్మడి రాష్ట్రంలో సెలక్టయి రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో ఉండాల్సి వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ బదిలీలపై హోంగార్డులు ఇరు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు, పోలీస్ బాస్‌లకు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్ లో నిరుద్యోగ భృతి ఊసే లేకపోవడం బాధాకరమని సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. బడ్జెట్‌ను పునఃపరిశీలించి విద్యారంగానికి 30 శాతం, యువజనరంగానికి 10 శాతం, క్రీడాసాంస్కృతిక రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



బహుమతులు సాధించిన విద్యార్థినులు

జాతీయ స్థాయి సెమినార్‌లో ఫార్మశీ విద్యార్థులకు బహుమతులు

మొగల్రాజపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వికాస్ విద్యాసంస్థలు ఫార్మశీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో తమ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించారని మొగల్రాజపురం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సునీత ఒక ప్రకటనలో తెలిపారు. పరిశోధనలను పోస్టర్ రూపంలో ప్రదర్శించే పోటీలో ఫార్మాస్యూటిక్స్ విభాగంలో మొదటి, రెండు బహుమతులు, ఫార్మకాగ్నసీ విభాగంలో మొదటి, రెండు బహుమతులు, నూతన ఉత్పత్తుల తయారీ ఐడియాతాన్ అనే శీర్షిక పోటీల్లో బి.ఆకాంక్ష, సీహెచ్ మనోజ్ఞ తయారు చేసిన హెర్బల్ సోప్‌కు ప్రథమ స్థానంతోపాటు రెండు వేల నగదు బహుమతి అందుకున్నట్లు తెలిపారు. చేబ్రోలు హనుమయ్య కళాశాలలో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో గర్ల్స్ కబడ్డీలో మొదటి స్థానంతో పాటు నాలుగువేల నగదు, షాట్‌పుట్‌లో మొదటి రెండు బహుమతులతో పాటు రూ.వెయ్యి, రూ.500లు గెలుచుకున్నారని పేర్కొన్నారు.



శిక్షణ పొందుతున్న సర్వీస్ ప్రొవైడర్లతో మెప్మా ఎండీ తేజ భరత్

సర్వీస్ ప్రొవైడర్ల సేవలు ప్రజలకు అందిస్తాం

● మెప్మా ఎండీ తేజ భరత్

గవర్నర్‌పేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వీస్ ప్రొవైడర్ల శిక్షణ పూర్తి కాగానే వారి సేవలను నగర ప్రజలకు అందించి, ప్రొవైడర్ల ఆదాయం పెంచే విధంగా కృషి చేస్తున్నట్లు మెప్మా ఎండీ తేజ భరత్ తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎలక్ట్రీషియన్ ట్రైనింగ్ సెంటర్‌ను సోమవారం ఆయన సందర్శించి, శిక్షణ తీసుకుంటున్న వారితో మాట్లాడారు. మెప్మా, హోమ్ ట్రయాంగిల్ సంయుక్తంగా ప్లంబింగ్ సేవలు, విద్యుత్ సేవలు, గృహోపకరణాలు మరమ్మతు సేవలకు హోమ్ ట్రయాంగిల్ యాప్ ద్వారా శిక్షణ పొందిన వారి సేవలు ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. 824 మందికి శిక్షణ పూర్తికానుందని, శిక్షణ పొందిన వారికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఉచిత శిక్షణతో పాటు హోమ్ ట్రయాంగిల్ అనే యాప్‌లో ఉచితంగా ఆన్ బోర్డ్ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ (యూసీడీ) వెంకటనారాయణ, నగరపాలక సంస్థ అర్బన్ కమ్యూనిటీ డవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి చేస్తా

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫౌండేషన్ జాతీయ బోర్డు డైరెక్టర్ జి.సుబ్బయ్య

బస్టేషన్: అట్టడుగు వర్గాలైన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఇటీవల నూతనంగా నియమితులైన కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ (డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్) జాతీయ బోర్డు డైరెక్టర్ జి.సుబ్బయ్య తెలిపారు. సోమవారం విజయవాడ ఆర్టీసీ భవన్‌లోని కార్యవర్గ కార్యాలయంలో సుబ్బయ్యను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారికి అన్ని వేళలా అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ విజయరత్నం, కార్యదర్శి ఏవీ రాజు, కోశాధికారి జి.సి.హెచ్.కోటయ్య, నాయకులు పాల్గొన్నారు.



సుబ్బయ్యను అభినందిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు









సొంత ఖాతా నుంచే ఇంటి అద్దె చెల్లించా!

▸ 'ఆంధ్రజ్యోతి' కథనంపై రిటైర్డ్ పీసీసీఎఫ్ చిరంజీవ్ వివరణ

అమరావతి, మార్చి3(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయ భవనానికి రెండేళ్ల తర్వాత ఇతర ప్రభుత్వ విభాగాలు చెల్లించే అద్దెతో సమానంగానే అద్దె సవరించినట్లు రిటైర్డ్ పీసీసీఎఫ్ చిరంజీవ్ చౌదరి తెలిపారు. భవన యజమాని అటవీ శాఖ కార్యాలయాన్ని ఖాళీ చేయాలని లేదా ఇతర శాఖలతో సమానంగా అద్దె చెల్లించాలని కోరినందున అద్దె పెంచినట్లు వివరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో అడవిలో 'కిమ్' రాజ్యం శీర్షికతో కథనం వచ్చిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 2016నుంచి తాను రెయిన్ ట్రీ పార్కులో ఉంటుండగా, అదే సొసైటీకి చెందిన ప్రస్తుత ఇంటికి నెలకు రూ.50 వేలు తన వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నుంచి అద్దె చెల్లిస్తున్నట్లు తెలిపారు. తన పదవీ కాలంలో ప్రభుత్వ వాహనాలను అధికారిక పనుల కోసమే వినియోగించానని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎప్పుడూ వాడలేదన్నారు. పీసీసీఎఫ్‌గా వాడిన వాహనాలన్నీ పదేళ్ల కంటే పాతవని చెప్పారు. శాఖాపరమైన బదిలీలు, పోస్టింగ్‌ల్లో ఏ ఒక్కరి ప్రమేయం, అవినీతికి ఆస్కారం లేకుండా ఉపముఖ్యమంత్రి మద్దతుతోనే చేసినట్లు తెలిపారు. చాలాకాలంగా ఒకే పోస్టులో ఉన్న వారిని పరిపాలనా కారణాలతో బదిలీ చేయగా, కోర్టు నుంచి అనుకూల ఉత్తర్వులు పొందారన్నారు.

సిబ్బంది కొరత వల్లే రెండు షిఫ్టుల విధానం

▸ 'ఆంధ్రజ్యోతి' కథనంపై రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ వివరణ

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జైలులో గార్డింగ్ సిబ్బంది కొరత కారణంగానే రెండు షిఫ్టుల విధానం అమలు చేస్తున్నామని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. జైళ్లశాఖ కోస్తాంధ్ర రీజియన్‌లో ఉన్నతాధికారికి, సిబ్బందికి నడుమ కొనసాగుతున్న వివాదంపై 'జైళ్ల శాఖ.. కోస్తాంధ్రలో కోల్డ్‌వార్' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై సూపరింటెండెంట్ తరఫున డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్ వివరణ ఇచ్చారు. జైలులో 220మంది గార్డింగ్ సిబ్బందికి గాను 155మంది మాత్రమే ఉన్నారన్నారు. షడక్ అనే ఓపెన్ జైలు ఖైదీని డీఐజీ కార్యాలయంలో ఏసీ మరమ్మతు నిమిత్తం పంపించామని వివరించారు. ఈ విషయంలో కిందిస్థాయి ఉద్యోగిని సస్పెండ్ చేయలేదని, శాఖాపరమైన విచారణ కొనసాగుతోందన్నారు.

టెన్త్ హాల్‌టికెట్లు విడుదల

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సోమవారం తెలిపింది. విద్యార్థులు పాఠశాల లాగిన్ ద్వారా లేదా మనమిత్ర వాట్సాప్ నంబరు ద్వారా నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. కాగా ఈ నెల 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

గ్రూప్2 అభ్యర్థులకు హారిజంటల్ రిజర్వేషన్

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 మెయిన్స్ నోటిఫికేషన్‌లో మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి హారిజంటల్ రిజర్వేషన్ విధానం వర్తిస్తుందని ఏపీపీఎస్సీ సోమవారం ప్రకటించింది. సాధారణంగా అమలుచేసే వర్టికల్ రిజర్వేషన్‌లో భాగంగానే ఇది కూడా అమలవుతుందని తెలిపింది. హారిజంటల్ రిజర్వేషన్‌లో అర్హులైన మహిళా అభ్యర్థులు లేకపోతే ఆ పోస్టులను ప్రస్తుత నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామంది.

గ్రూప్-2 వెబ్ ఆప్షన్లపై నిరుద్యోగ జేఏసీ హర్షం

విజయవాడ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'గ్రూప్-2 అభ్యర్థుల విన్నపాలను గౌరవించి వెబ్ ఆప్షన్లు పెట్టుకోమని తెలియజేయటం శుభ పరిణామం' అని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్ సోమవారం హర్షం వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్ల ఆలస్యం కారణంగా వేలమంది వయోపరిమితి కోల్పోయారని, వయోపరిమితి పెంచి నోటిఫికేషన్లు ఇచ్చి ఆదుకోవాలని ఆయన కోరారు.

దేవదాయశాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్ అర్హులే

▸ హైకోర్టు స్పష్టీకరణ

▸ పిటిషన్ కొట్టివేత.. 25 వేలు ఖర్చులు విధింపు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టేందుకు అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ అర్హులేనని హైకోర్టు తేల్చిచెప్పింది. మూడో వ్యక్తి ప్రోద్బలంతో పిటిషనర్ ప్రస్తుత వ్యాజ్యాన్ని దాఖలు చేశారని పేర్కొంది. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారనేందుకు ఈ కేసు మంచి ఉదాహరణ అని తెలిపింది. వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ పిటిషనర్ రమణమూర్తికి రూ.25వేలు ఖర్చులు విధించింది. ఈ సొమ్మును నాలుగు వారాల్లో ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీకి చెల్లించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఫిబ్రవరి 28న తీర్పు ఇచ్చారు. సోమవారం తీర్పు ప్రతి అందుబాటులోకి వచ్చింది. దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ అక్రమాలపై రాష్ట్ర విజిలెన్స్ విచారణ పూర్తయ్యేవరకు ఆయనను దేవదాయశాఖలో కొనసాగించకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మచిలీపట్నానికి చెందిన



వీవీ రమణమూర్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దేవదాయశాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల తుది విచారణ జరిపిన న్యాయమూర్తి నిర్ణయాన్ని వెల్లడించారు. 'దేవదాయ శాఖ చట్టంలోని సెక్షన్ 3, 4 ప్రకారం అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తి కమిషనర్‌గా నియమితులయ్యేందుకు అర్హులు. చట్టంలోని సెక్షన్ 3(2) ప్రకారం హిందూ మతాన్ని ఆచరించనప్పుడు మాత్రమే కమిషనర్ పోస్టుకు అనర్హులు. వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, మన్సాస్ ట్రస్ట్ ఈవోగా అక్రమాలకు పాల్పడ్డారంటూ త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా రామచంద్రమోహన్‌ను గతంలో సస్పెండ్ చేశారని, హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు పొందడం ద్వారా తిరిగి విధుల్లో చేరారని పిటిషనర్ రమణమూర్తి వ్యాజ్యంలో పేర్కొన్నారు. 'ఇన్‌చార్జి కమిషనర్‌గా రామచంద్రమోహన్ ఏవిధంగా అనర్హుడో అఫిడవిట్‌లో పేర్కొనలేదు. మూడో వ్యక్తి ప్రోద్బలంతో పిటిషనర్ ప్రస్తుత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కోర్టు విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్

▸ పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు

▸ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వర్క్‌షాప్‌లో లోకేశ్



ఏపీ విద్యావిధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, పాల్గొన్న ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, పరిటాల సునీత, మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్సీ అనురాధ తదితరులు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యలో విప్లవాత్మక సంస్కరణలు తెస్తున్నట్టు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్, జీవో 117కు ప్రత్యామ్నాయం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సోమవారం ఉండవల్లిలోని నివాసంలో వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యారంగంలో ఎలాంటి మార్పులు చేపడితే బాగుంటుందనే దానిపై వారి నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, దేశంలోనే ఏపీ విద్యా వ్యవస్థను నంబర్ 1 చేయాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా సంస్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. తాను యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు జీవో 117 వల్ల కలిగిన దుష్ఫలితాల గురించి అనేక మంది తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. జీవో 117 పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారన్నారని, వారంతా ప్రైవేటు పాఠశాలల్లో చేరారని చెప్పారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నివేదిక ప్రకారం జాతీయ సగటుతో పోలిస్తే ఏపీ పాఠశాల విద్యలో ఎక్కువ అభ్యసన అంతరం ఏర్పడిందన్నారు. 3వ తరగతి విద్యార్థుల్లో.. భాషా సబ్జెక్టుల్లో 57శాతం మంది, గణితంలో 54శాతం మంది మాత్రమే అంచనా మేరకు మెరుగ్గా ఉన్నారన్నారు. ఇది జాతీయ సగటుతో పోలిస్తే 5 నుంచి 8శాతం తక్కువని చెప్పారు. పైతరగతుల్లో ఈ అంతరం ఇంకా ఎక్కువగా ఉందన్నారు. అసర్-2024 నివేదిక రాష్ట్రంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీలో లోపాలను బహిర్గతం చేసిందన్నారు. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ నివేదిక ప్రకారం టీచర్ విద్య శిక్షణలో ఏపీ 60 పాయింట్లు సాధించిందన్నారు.

నియోజకవర్గానికో మోడల్ స్కూల్!

గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దేందుకు జీవో 117 రద్దుచేసి, ప్రత్యామ్నాయం తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సీబీఎస్‌ఈపై విద్యార్థులకు మాక్ పరీక్ష నిర్వహిస్తే 90శాతం మంది ఫెయిల్ అయ్యారని తెలిపారు. ఐబీ సిలబస్ పేరుతో రూ.5 కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. విద్యారంగంలో ఉత్తమ విధానాల అమలుకు టీచర్లను విదేశాలకు పంపుతామన్నారు. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులపై కొందరు టీచర్లు పోలాండ్‌లో అధ్యయనం చేస్తారని తెలిపారు. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్స్, బెంచీలు, తాగునీరు, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెలలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి వెల్లడించారు.

ప్రజాప్రతినిధుల సూచనలు ఇవీ..

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస స్థాయిలో అయినా విద్యార్థుల సంఖ్య ఉంటే ఇబ్బందులుండవని, దీనికి ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని కొణతాల రామకృష్ణ అన్నారు. శివారు ప్రాంతాలున్న గ్రామాల్లో విద్యార్థులకు రవాణా ఇబ్బంది లేకుండా చూడాలని బండారు సత్యనారాయణమూర్తి కోరారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌కు కనీస విద్యార్థుల సంఖ్య 45 చేయాలని లోకం మాధవి సూచించారు. గురుకుల పాఠశాలలు పెంచాలని కొవ్వూరు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోని విద్యార్థులకు ఎంసెట్, ఐఐటీ కోచింగ్ నిర్వహించాలని కొండబాబు కోరారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక అమలుచేయాలని కాల్వ శ్రీనివాసులు సూచించారు.

18 మీటర్ల లోపు ఎత్తు భవన నిర్మాణాలకు

స్వీయ ధ్రువీకరణ ఇస్తే సరి

▸ టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేదు!

▸ భవన నిర్మాణదారులకు ఏపీ సర్కారు శుభవార్త

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవన నిర్మాణ అనుమతులకు స్వీయ ధ్రువీకరణ పత్రం ఇస్తే సరిపోతుంది. టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు అనుమతి వస్తుంది. అయితే భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్‌టీపీలు, ఇంజనీర్లు లేదా ఆర్కిటెక్ట్‌ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి అఫిడవిట్ ఇవ్వాలి. దీనికి సంబంధించి గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీచేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చింది. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను ఏపీడీపీఎంఎస్ పోర్టల్‌లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం, సర్కులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు, 1985కు ముందు నిర్మించిన భవనాల పునర్నిర్మాణానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.

పర్చూరు ఓట్ల తొలగింపు కుట్రపై 'సిట్'

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విజయం సాధించడానికి అక్రమ మార్గంలో ఓట్ల తొలగింపునకు పాల్పడిన వారి గుట్టు రట్టు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ నేతృత్వంలో గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్‌తోపాటు మరికొందరు పోలీసుల్ని సభ్యులుగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో బాపట్ల జిల్లా పర్చూరులో గుట్టు చప్పుడు కాకుండా 24 వేల మంది ఓటర్లకు సంబంధించి ఫారమ్ 7 ఇచ్చి ఓట్ల తొలగింపునకు ప్రయత్నించారు. అప్పటి ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కూటమి సర్కారుకి మరోసారి ఫిర్యాదు చేయగా పరిశీలించిన ప్రభుత్వం 'సిట్' ఏర్పాటు చేసింది.



చిత్రజ్యోతి
SINCE 1965



ఆస్కార్ వేడుకలు..
అనోరాకు అగ్రస్థానం

ప్రపంచ సినీ రంగంలో ఉన్నత పురస్కారంగా భావించే 97వ ఆస్కార్ అవార్డుల వేడుక కన్నులపండువగా సాగింది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఆదివారం సాయంత్రం (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) నిర్వహించిన ఈ కార్యక్రమానికి కానన్ ఓబ్రియాన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆయన భారతీయులను ఉద్దేశించి హిందీలో మాట్లాడడంతో పాటు 'బ్రేక్ ఫాస్ట్ చేశారా' అని అనడం అందర్నీ ఆకట్టుకుంది.





ఈ వేడుకలో అందర్నీ ఆశ్చర్యపరిచిన చిత్రం 'అనోరా'. చిన్న చిత్రంగా తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా ఐదు అకాడమీ అవార్డులను దక్కించుకుంది. ఉత్తమ చిత్రం, ఎడిటింగ్, స్క్రీన్ ప్లే, దర్శకుడు, నటి విభాగంలో పురస్కారాలు దక్కించుకుంది. దర్శకత్వంతో పాటు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే అందించిన సీన్ బేకర్.. ఒకే చిత్రానికి నాలుగుసార్లు అవార్డు అందుకున్న మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. వాల్ట్ డిస్నీ గతంలో వేర్వేరు సినిమాల ద్వారా నాలుగు అవార్డులను అందుకున్న సంగతి తెలిసిందే. సీన్ బేకర్ ఈ అవార్డును వేశ్యలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ థియేటర్ల మనుగడను కాపాడాల్సిన అవసరాన్ని చెప్పారు.

ఉత్తమ నటుడిగా అడ్రియన్ బ్రాడీ

బ్రాడీ కార్బెట్ తెరకెక్కించిన 'ద బ్రూటలిస్ట్' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్నారు అడ్రియన్ బ్రాడీ. ఆయనకు ఇది రెండో ఆస్కార్ పురస్కారం. 2002లో రోమన్ పొలాన్‌స్కీ దర్శకత్వంలో తెరకెక్కిన 'పియానిస్ట్' అతి పిన్న వయస్కుడిగా తొలిసారి ఆస్కార్‌ను అందుకున్నారు. ఈ రెండు సినిమాలు హోలోకాస్ట్ నేపథ్యంలో రూపొందినవే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధించిన విజయాలు, ఘనతలు శాశ్వతం కాదని తెలిపారు. అలాగే, 'ద రియల్ పెయిన్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటుడిగా అవార్డును అందుకున్నారు కీరన్‌కైల్ కల్కిన్.

ఉత్తమ నటిగా మైకీ మ్యాడిసన్

'అనోరా' చిత్రానికి ఉత్తమ నటిగా పురస్కారం అందుకున్నారు మైకీ మ్యాడిసన్. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాలో ఆమె వేశ్య పాత్రలో నటించారు. ఈ అవార్డును అందుకోవడం కలలా ఉందని మ్యాడిసన్ చెప్పారు. అలాగే, 'ఎమిలియా పెరెజ్' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటిగా జో సాల్డాన అవార్డును అందుకున్నారు. అత్యధిక నామినేషన్లతో రేసులో నిలిచిన నాన్ ఇంగ్లీష్ చిత్రం 'ఎమీలియా పెరెజ్' కేవలం రెండు అవార్డులతో సరిపెట్టుకుంది. పది నామినేషన్లు సాధించిన 'బ్రూటలిస్ట్' చిత్రం మూడు అవార్డులు పొందింది. 'డ్యూన్ 2' చిత్రం రెండు అవార్డులను సొంతం చేసుకుంది.

ఆస్కార్ బృందంలో తెలంగాణ వాసి పాత్ర



ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్‌లో పురస్కారం పొందిన 'డ్యూన్ 2' చిత్రం వీఎఫ్ఎక్స్ టీమ్‌లో తెలంగాణ వాసి ఉండడం విశేషం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మునిసిపాలిటీ అమీనాపురంకు చెందిన ఎడ్ల సుమంత్‌రెడ్డి ఈ చిత్రానికి ఆరు క్యారెక్టర్లను డిజైన్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

కేసముద్రం (ఆంధ్రజ్యోతి)

విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం: అనోరా
ఉత్తమ దర్శకుడు: సీన్ బేకర్ (అనోరా)
ఉత్తమ నటుడు: అడ్రియన్ బ్రాడీ (ద బ్రూటలిస్ట్)
ఉత్తమ నటి: మైకీ మ్యాడిసన్(అనోరా)
ఉత్తమ సహాయ నటుడు: కీరన్‌కైల్ కల్కిన్ (ద రియల్ పెయిన్)
ఉత్తమ సహాయ నటి: జో సాల్డాన (ఎమిలియా పెరెజ్)
ఉత్తమ ఎడిటింగ్ : అనోరా (సీన్ బేకర్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ద బ్రూటలిస్ట్ (లాల్ క్రాలే)

అనూజకు నిరాశ

భారత్ తరఫున ఆస్కార్ నామినేషన్ పొందిన లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ 'అనూజ' చిత్రానికి నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో పోటీపడుతున్న చిత్రాలను ఓడించి, 'ఐ యామ్ నాట్ ఏ రోబో' లఘు చిత్రం పురస్కారాన్ని కైవసం చేసుకుంది.

మందుల మంచీ చెడూ



మనం రకరకాల మందులు వాడుకుంటూ ఉంటాం. వాటిలో పరగడుపున తీసుకోవాల్సిన మందులుంటాయి. తినే ముందు, తిన్న తర్వాత వేసుకోవలసినవీ ఉంటాయి. మందులు సమర్థంగా పనిచేయాలంటే, వాటిని ఎలా వాడుకోవాలో, వాటి వాడకంలో ఎలాంటి నియమాలు పాటించాలో వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

పోపుల డబ్బా లేకపోతే వంటింట్లో వంట పూర్తి కానట్టే, మందుల డబ్బా లేకపోతే ఆరోగ్యం అటకెక్కే పరిస్థితి చాలా ఇళ్లలో ఉంటుంది. అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, రక్తం పలుచన చేసే మందులు... ఇలా మన మందుల డబ్బాలో రకరకాల మందులు ఉంటూ ఉంటాయి. ఏ మాత్రను ఎప్పుడు మింగాలో వైద్యుల ప్రిస్క్రిప్షన్‌లో స్పష్టంగా పేర్కొని ఉంటుంది. అయినా ఆ నియమాలను తూచతప్పకుండా పాటించేవాళ్లను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. ఉదయం మింగవలసిన మాత్ర మర్చిపోయి, మధ్యాహ్నం వేసుకునేవాళ్లుంటారు. పరగడుపున తీసుకోవలసిన మందును తిన్న తర్వాత వేసుకునేవాళ్లుంటారు. వేసుకోవలసిన మాత్రలన్నిటినీ ఒకేసారి కలిపి మింగేసేవాళ్లూ ఉంటారు. కానీ తీసుకునే మందుల సామర్థ్యం పూర్తి స్థాయిలో దక్కాలన్నా, శరీరం మందును సంపూర్తిగా శోషించుకోవాలన్నా వైద్యులు సూచించిన నియమాలను తప్పనిసరిగా అనుసరించాలి.

ఖాళీ కడుపుతో...

కొన్ని మందులను శరీరం సమర్థంగా శోషించుకోవాలంటే వాటిని ఖాళీ కడుపుతోనే తీసుకోవాలి. థైరాయిడ్ మాత్ర అలాంటిదే! థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తి ఉదయం వేళ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ మాత్రను తప్పనిసరిగా పరగడుపునే తీసుకోవాలి. సెమాగ్లూటైడ్ అనే మధుమేహం మందు, ఉదయం అల్పాహారానికి గంట ముందు తీసుకోవాల్సి ఉంటుంది. సల్ఫొనైలూరియాస్ అనే మధుమేహ మందును ఆహారానికి అరగంట ముందు వేసుకోవాలి. మెట్‌ఫార్మిన్ అనే ఇంకొక రకం మందు ఆహారం తర్వాత తీసుకోవచ్చు. ఇంకొన్ని రకాల మధుమేహం మందులు తిన్న తర్వాతే తీసుకోవలసి ఉంటుంది. ఎప్పుడు తీసుకోవడం మేలన్నది చక్కెర మందు రకం మీద ఆధారపడి ఉంటుంది. అధిక రక్తపోటుకు వాడుకునే కొన్ని మందులతో పొట్టలో సమస్యలు వేధిస్తాయి కాబట్టి వీటిని ఆహారం తిన్న తర్వాత తీసుకోవాలి.

కొన్ని ఆహారం తర్వాతే...

ఒకే పూట ఒకటి కంటే ఎక్కువ మందులు వాడుకునే పరిస్థితి ఉంటుంది. అలాంటప్పుడు వాటిని కలిపి వేసుకున్నా సమస్య ఉండదు. అయితే ఖాళీ కడుపుతో వేసుకోవలసిన మాత్ర పరగడుపునే ఆ ఒక్క మాత్రకే పరిమితం కావడం ఉత్తమం. నొప్పి నివారణ మందులతో గ్యాస్ట్రైటిస్ సమస్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ మందులను ఆహారం తిన్న తర్వాతే తీసుకోవాలి. అలాగే మందుల ప్రభావం ఆహారం మీద కూడా ఆధారపడి ఉంటుంది. పాంటాప్రొజోల్ లాంటి అసిడిటీ మందులు ఆహారం తినడానికి అర గంట ముందే వేసుకోవాలి. కొన్ని క్యాల్షియం మందులను ఖాళీ కడుపుతో వేసుకుంటే గ్యాస్ట్రైటిస్ సమస్య వేధిస్తుంది. కాబట్టి వీటిని కూడా తిన్న తర్వాత తీసుకోవాలి. అలాగే ఐరన్ మందులతో కొందరికి మలబద్ధకం, మరికొందరికి డయేరియా రావచ్చు. కాబట్టి వాటిని కూడా ఆహారం తిన్న తర్వాత తీసుకోవాలి.

కాలం చెల్లిన మందులతో...

కాలం చెల్లినంత మాత్రాన మందులు విషపూరితంగా మారిపోవు. ముందువరకూ సమర్థంగా పనిచేసిన మందులు, ఒక్క రోజు దాటిన వెంటనే విషంగా మారిపోయే పరిస్థితి ఉండదు. కానీ కాలం చెల్లిన తర్వాత మందులు వాటి ప్రభావాన్ని కోల్పోతాయి. టెట్రాసైక్లిన్ గ్రూపుకు చెందినకాలం చెల్లిన మందులతో మాత్రం కొన్ని దుష్ప్రభావాలు ఉండవచ్చు. కాబట్టి ఏ మందైనా దాని తయారీ, కాలం చెల్లే తేదీలను గమనించుకుని వాడుకోవాలి.

మందులు వికటిస్తే?

మోతాదు పెరగడం వల్ల, ఊహించని పరిణామాల వల్ల మందులు వికటించే అవకాశాలుంటాయి. ఒకసారి సమర్థంగా పనిచేసిన మాత్ర, కొన్ని రోజుల తర్వాత రెండోసారి తీసుకున్నప్పుడు డ్రగ్ రియాక్షన్‌కు దారి తీయవచ్చు. ఆ నిర్దిష్ట సమయంలో, ఆ నిర్దిష్ట మందుకు, మన శరీరం అవసరానికి మించి స్పందించడమే ఈ పరిస్థితికి కారణం. కొన్ని సందర్భాల్లో మందు మోతాదు పెరగడం వల్ల కూడా డ్రగ్ రియాక్షన్ సంభవించవచ్చు. ఇలా మందులు వికటించినప్పుడు ప్రధానంగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేంటంటే...

> సాధారణంగా ఎవరైనా నీళ్లతోనే మందులు మింగుతారు. కానీ మందులు మింగడం ఇష్టం లేని వాళ్లు పాలు, పండ్లరసాల మీద ఆధారపడుతూ ఉంటారు. అయితే మధుమేహం, అధిక రక్తపోటు, హృద్రోగాలు.. ఇలా ఒకటికి మించి రుగ్మతలున్నవాళ్లు పాలు, పండ్ల రసాలతో కలిపి మందులు మింగడం వల్ల అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరిపోయే అవకాశాలుంటాయనే విషయం గుర్తుపెట్టుకోవాలి.



- చర్మం మీద దద్దుర్లు, దురదలు
- వాంతులు
- కడుపులో నొప్పి
- కళ్లు తిరగడం

తీవ్రమైన డ్రగ్ రియాక్షన్‌లో...

సాధారణంగా సిప్రోఫ్లాక్సిన్, నార్‌ఫ్లాక్సిన్ లాంటి ఫ్లోరోక్వినోలోన్స్ తాలూకు మందులతో, ఎప్టాయిన్, కార్బామజెపీన్, వాల్‌ప్రోవేట్ లాంటి కొన్ని మూర్ఛ మందులతో, కొన్ని నొప్పి నివారణ మందులతో, కొన్ని యాంటీబయాటిక్స్‌తో కొందర్లో తీవ్ర డ్రగ్ రియాక్షన్ తలెత్తే అవకాశాలుంటాయి. ఎంతో అరుదుగా కొన్ని కీమోథెరపీ మందులు కూడా వికటిస్తూ ఉంటాయి. అలాంటి సందర్భాల్లో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.

- రక్తపోటు పూర్తిగా పడిపోతుంది
- అంతర్గత వాపులు ఏర్పడతాయి
- శ్వాస నాళికలో వాపు వల్ల శ్వాస అందని ప్రమాదకర పరిస్థితి తలెత్తవచ్చు

కాబట్టి తేలికపాటి లక్షణాలైనా, తీవ్రమైనా లక్షణాలైనా వాటిని వైద్యుల దృష్టికి తీసుకువెళ్లడం అత్యవసరం. అలాగే వికటించిన మందులను గుర్తు పెట్టుకుని, వైద్యులను కలిసి, చికిత్స తీసుకునే ప్రతి సందర్భంలో వాటి గురించి వైద్యులకు తెలియపరచాలి.

మందుల నిల్వ ఇలా...

- ప్రొబయాటిక్ మందులను ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసుకోవాలి
- ఇన్సులిన్ మందులను ఫ్రీజర్‌లో నిల్వ చేసుకోవాలి
- కీమోథెరపీ మందులు, వ్యాక్సిన్లు ఫ్రిజ్ చేసుకోవాలి
- మధుమేహం, అధిక రక్తపోటు, ఇతరత్రా సాధారణ మందులన్నీ సూర్యరశ్మి సోకకుండా, నీడలో, గది ఉష్ణోగ్రతలో నిల్వ చేసుకోవాలి.

మద్యంతో మందులు?

మద్యం ఔషధాల ప్రభావాన్ని తగ్గిస్తుంది. మద్యంతో కలిపి తీసుకోవడం వల్ల, కొలెస్ట్రాల్ మందులు, రక్తం పలుచబడే మందుల ప్రభావం కూడా సన్నగిల్లుతుంది. అయితే మద్యం వల్ల రియాక్షన్ వచ్చే మందులు కూడా కొన్ని ఉన్నాయి. మద్యం మానేయడానికి తోడ్పడే డైసల్ఫిరామ్, నీళ్ల విరేచనాల కోసం తీసుకునే మెట్రోజిల్ గ్రూపు సంబంధిత మందులను మద్యంతో కలిపి తీసుకున్నప్పుడు రియాక్షన్ రావచ్చు. వాంతులు, చర్మం వాపులు, కడుపులో నొప్పి, శ్వాస సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి ఈ మందులను మద్యంతో కలిపి తీసుకోకూడదు.

సొంత వైద్యం ఎంత మేరకు?

సొంత వైద్యం అలవాటుగా మారకూడదు. మరీ ముఖ్యంగా యాంటీబయాటిక్స్ వైద్యులు సూచించినంత కాలం, సూచించిన మోతాదుల్లో మాత్రమే వాడుకోవాలి. సూచించిన రోజుల కంటే తక్కువ రోజులకు పరిమితం కావడం, ఎక్కువ రోజులు వాడుకోవడం... రెండూ శ్రేయస్కరం కాదు. యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ (మందులు పనిచేయని స్థితి) లేదా దుష్ప్రభావాలకు గురి కాకుండా ఉండాలంటే వైద్యులు సూచించకుండా వాటిని వాడుకోకూడదు.

డాక్టర్ శశి కిరణ్
సీనియర్ జనరల్ ఫిజీషియన్,
యశోద హాస్పిటల్స్,
సోమాజిగూడ, హైదరాబాద్.



లేత కొబ్బరిలో...

ఎండ పెరుగుతోంది కాబట్టి అప్పుడప్పుడూ కొబ్బరినీళ్లు తాగుతూ ఉంటాం. అయితే కొబ్బరినీళ్లు తాగేసి కాయ విసిరేయకుండా, దాన్లోని లేత కొబ్బరిని కూడా తింటూ ఉండాలి. ఎందుకంటే...

- లేత కొబ్బరిలో పీచు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి జీర్ణశక్తి మెరుగు పడుతుంది. పేగులు కూడా ఆరోగ్యంగా ఉంటాయి
- లేత కొబ్బరిలో ఉండే పొటాషియం, ఎలక్ట్రొలైట్లు వ్యాయామం నుంచి కోలుకునే అత్యవసర పోషకాలను భర్తీ చేస్తాయి. కాబట్టి లేత కొబ్బరిని వ్యాయామం తర్వాత అల్పాహారంగా తీసుకోవచ్చు
- లేత కొబ్బరిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెకు మేలు చేస్తాయి
- లేత కొబ్బరిలో యాంటీబ్యాక్టీరియల్, యాంటీవైరల్ గుణాలు కలిగిన లారిక్ యాసిడ్ ఉంటుంది. దీంతో వ్యాధినిరోధకశక్తి మెరుగవుతుంది
- దీన్లోని మీడియం చైన్ ట్రైగ్లిజరైడ్స్ తక్షణ శక్తిని అందిస్తాయి.



పచ్చబొట్లతో ప్రమాదాలు

పచ్చబొట్లు ఫ్యాషన్‌లో భాగమైపోయాయి. నలుగురినీ ఆకట్టుకునే అందమైన పచ్చబొట్టు పొడిపించుకునేటప్పుడు దాంతో పొంచి ఉండే ప్రమాదాలను కూడా గుర్తు పెట్టుకోవాలి.

అలర్జీలు: టాటూల కోసం ఉపయోగించే సిరాతో, ప్రత్యేకించి ఎర్ర సిరాతో కొందరికి చర్మపు అలర్జీలు తలెత్తుతాయి. దాంతో పచ్చబొట్టు పొడిపించుకున్న చోట దురదలు, దద్దుర్లు ఏర్పడతాయి. అలాగే పచ్చబొట్టు పొడిపించుకున్న ప్రదేశం ఎండకు బహిర్గతం అవడం వల్ల కొందర్లో ఫొటోఅలర్జిక్ రియాక్షన్ కూడా తలెత్తుతుంది



ఇన్‌ఫెక్షన్లు: టాటూలు చర్మపు సహజసిద్ధ రక్షణ పొరను ఛిద్రం చేస్తాయి. పరిశుభ్రత, స్టెరిలైజేషన్‌లను పాటించకపోతే వాటితో చర్మపు ఇన్‌ఫెక్షన్లు వేధిస్తాయి. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి లాంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లతో పాటు, కొన్ని రకాల బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలుంటాయి.

కెలాయిడ్ మచ్చలు: కొందర్లో కెలాయిడ్ స్కారింగ్ సమస్య ఉంటుంది. ఈ సమస్య ఉన్నవాళ్లలో టాటూ వేయించుకున్న ప్రదేశం ఉబ్బెత్తుగా, అందవిహీనంగా మారిపోతుంది. అలాగే ఎమ్మారై స్కానింగ్ సమయంలో టాటూలు ఇబ్బందికరంగా మారతాయి. ఇమేజింగ్ నాణ్యతను దెబ్బతీస్తాయి.

చర్మం పలుచన: సోరియాసిస్ లాంటి చర్మ సమస్యలున్నవాళ్లలో టాటూల వల్ల చర్మం మరింత పలుచబడి, మచ్చలు ఏర్పడతాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- టాటూలు వేయించుకునే ముందు, వైద్యుల చేత చర్మ తత్వాన్ని పరీక్షించుకోవాలి.
- నాణ్యమైన సిరా, పనిముట్లు వాడే టాటూ కళాకారులను ఎంచుకోవాలి
- అనుభవమున్న, పరిజ్ఞానమున్న ఆర్టిస్టులకే ప్రాధాన్యం ఇవ్వాలి
- సున్నిత చర్మం కలిగి ఉన్న వాళ్లు టాటూలకు దూరంగా ఉండడమే మేలు

మెదడు దెబ్బతినకుండా...



దైనందిన జీవితంలో మనం అనుసరించే కొన్ని అలవాట్లు మెదడు ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా దెబ్బతీస్తూ ఉంటాయి. నిరంతరం మెదడు చురుగ్గా ఉండాలంటే ఆ అలవాట్లకు స్వస్తి చెప్పాలి.

ఎక్కువ సేపు కూర్చుంటే: గంటల తరబడి కదలకుండా కూర్చోడానికీ, జ్ఞాపకశక్తికి కీలకమైన మెదడులోని ఒక భాగంలో మార్పులకూ సంబంధం ఉందని పరిశోధనల్లో తేలింది. ఆ ప్రభావాన్ని తగ్గించడం కోసం ప్రతి గంటకూ లేచి నిలబడి కనీసం ఐదు నిమిషాల పాటైనా నడుస్తూ ఉండాలి.

సరిపోని నిద్ర: కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు నిద్రాభంగం కలగకుండా కంటి నిండా నిద్రపోవాలి. నిద్ర లోపిస్తే, జ్ఞాపకశక్తితో పాటు, సమస్యను పరిష్కరించే నైపుణ్యాలు కూడా దెబ్బతింటాయి. కాబట్టి రాత్రి నిద్రకు రెండు గంటల ముందు నుంచి మెదడును మెలకువగా ఉంచే ఫోన్లు, టివిలకు దూరంగా ఉండాలి.

ఒంటరితనం: మెదడు ఆరోగ్యానికి ఒంటరితనం ప్రమాదకరం. తరచూ ఇతరులతో కలుస్తూ కాలక్షేపం చేస్తూ ఉండడం వల్ల మెదడు చైతన్యమవుతూ చురుగ్గా ఉంటుంది. ఒంటరితనంలో బయటి నుంచి ప్రేరణ లోపించడం మూలంగా మానసిక కుంగుబాటు, ఆందోళన, మతిమరుపు సమస్యలు వేధిస్తాయి. కాబట్టి తరచూ స్నేహితులు, కుటుంబసభ్యులతో సరదా సమయాలు గడుపుతూ ఉండాలి.

మోతమోగే హెడ్‌ఫోన్స్: సంగీతం వినడం ద్వారా సేద తీరడం మంచిదే కానీ, చెవులు మోతమోగేలా పెద్ద శబ్దంతో హెడ్‌ఫోన్స్‌లో పాటలు వినడం వల్ల మెదడుకు చేటు జరుగుతుంది. పెద్ద శబ్దాలు వినికిడి లోపం సమస్యకు దారి తీస్తాయి. వినికిడి లోపం క్రమేపీ డిమెన్షియా, అల్జీమర్స్ వ్యాధులకు దారి తీస్తుంది.

అధిక చక్కెర చేటు

చక్కెరలో పోషకాలు ఉండవు. అయినా అందరం తీపిని ఇష్టంగా తింటాం. అయితే కొందరు తీపి పదార్థాలను విపరీతంగా తింటూ ఉంటారు. ఇలాంటి అలవాటుతో ఒరిగే నష్టాల గురించి తెలుసుకుందాం!

ఆకలి పెరుగుతుంది

చక్కెర ద్వారా శరీరంలోకి ఎక్కువ క్యాలరీలు చేరడం వల్ల ఆకలి పెరుగుతుంది. తీపితో రుచి మొగ్గలు సంతృప్తి పడినా పొట్ట నిండదు. ప్రాథమిక పోషకాలు లోపించే శుద్ధి చేసిన పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల శరీరం చక్కెరను ఖర్చు చేసుకుని వెంటనే ఆకలిని పెంచుతుంది. దాంతో అదనపు ఆహారంతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకుంటాయి.



చికాకు పెరుగుతుంది

అదనపు చక్కెరతో చికాకు, ఆందోళనలు పెరుగుతాయి. అలాగే అదనపు చక్కెరలు జోడించిన పదార్థాలు తినడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. భావోద్వేగాలు అదుపు తప్పుతాయి. మానసిక కుంగుబాటు కూడా వేధిస్తుంది

నిస్సత్తువ ఆవరిస్తుంది

శరీరం చక్కెరను సులభంగా శోషించుకుంటుంది. త్వరగా జీర్ణమైపోతుంది. దాంతో సులభంగా నిస్సత్తువ ఆవరిస్తుంది. త్వరిత శక్తిని అందిస్తుంది కాబట్టే ఎంత తీపి తిన్నా తిన్న అరగంటకే నిస్సత్తువం వేధిస్తుంది.

తీపి మీద యావ

మనసు చక్కెర వైపే లాగుతోందంటే మనం చక్కెరకు బానిసలమయ్యామని అర్థం. చక్కెర మెదడులో ఉత్పత్తయ్యే హ్యాపీ హార్మోన్‌ను ప్రేరేపిస్తుంది. కాబట్టి చక్కెర తిన్న వెంటనే కలిగే సంతృప్తికి వ్యసనపరులుగా మారిపోతాం! పదే పదే ఆ సంతృప్తిని పొందడం కోసం మళ్లీ మళ్లీ తీపి కోసం ఆరాటపడతాం!

అధిక రక్తపోటు

అధిక చక్కెర అధిక రక్తపోటుకు దారి తీస్తుంది. చక్కెర వల్ల, కొలెస్ట్రాల్ లాంటి కొవ్వులు రక్తనాళాల్లోని లోపలి గోడలకు అతుక్కుపోయి, రక్తనాళాలను గట్టి పరుస్తాయి. దాంతో రక్తపోటు పెరుగుతుంది.

కీళ్ల నొప్పులు

చక్కెర కీళ్ల నొప్పులను పెంచుతుంది. వాపు, నొప్పులకు దారి తీస్తుంది. తీపి పదార్థాల వల్ల కీళ్ల నొప్పుల సమస్య మరింత పెరిగినట్టు, రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్‌తో బాధపడే వారు పేర్కొన్నట్టు అధ్యయనాలు చెప్తున్నాయి.

మాంసకృత్తులు మన భోజనంలోనే...

భారతీయ భోజనంలో మాంసకృత్తుల లోటు ఉంటుందన్నది అపోహ మాత్రమే! నిజానికి వృక్షాధారిత పదార్థాలను సమపాళ్లలో తీసుకోగలిగితే సరిపడా ప్రొటీన్‌ను సమకూర్చుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం!

తృణధాన్యాలు, చిక్కుళ్లు, పండ్లు, కూరగాయలతో కూడిన సంప్రదాయ భారతీయ భోజనాలన్నీ ప్రధానంగా వృక్షాధారితమైనవే! అలాగని భారతీయ భోజనంలో మాంసకృత్తులు లోపించాయనుకుంటే పొరపాటు. వృక్షాధారిత పదార్థాల్లో కూడా ప్రొటీన్ పుష్కలంగా దొరికే పదార్థాలను భోజనంలో ఉండేలా చూసుకుంటే మాంసకృత్తుల లోపాన్ని నియంత్రించుకోవచ్చు.



మాంసకృత్తుల అవసరత

వయసు, శరీర బరువు రోజువారీ పనుల ఆధారంగా మాంసకృత్తుల మోతాదును ఎవరికి వారు లెక్కించుకోవాలి. ఇందుకోసం పోషకాహార నిపుణుల సహాయం తీసుకోవచ్చు. వారి సలహాల ఆధారంగా సరిపడా మాంసకృత్తులు సమకూరే భోజనాన్ని ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాలి. స్థానికంగా లభించే ఎన్నో ఆహారపదార్థాల్లో మాంసకృత్తులు పుష్కలంగా ఉంటాయి. అవేంటంటే...

కాయధాన్యాలు: కందిపప్పు, పెసరపప్పు, సెనగపప్పు, ఎర్ర కందిపప్పు

చిక్కుళ్లు, పప్పులు: సోయా బీన్స్, రాజ్మా, అలసందలు

పాల ఉత్పత్తులు: పెరుగు, జున్ను, పనీర్, నెయ్యి

చిరుధాన్యాలు, తృణ ధాన్యాలు: రాగులు, సజ్జలు, జొన్నలు, మొక్కజొన్న, గోధుమలు

గింజలు, విత్తనాలు: బాదం, నువ్వులు, పొద్దుతిరుగుడు, గుమ్మడి విత్తనాలు

- **స్నాక్స్:** వేరుసెనగలు, సెనగపప్పు, మొలకలు
- పుట్టగొడుగులు, టోఫు
- అవకాడొ

లెక్కలేనన్ని అపోహలు

ప్రొటీన్ పరంగా భారతీయ భోజనం చుట్టూరా ఎన్నో అపోహలు అలుముకుని ఉన్నాయి. ఆ అపోహలు, వాస్తవాల గురించి తెలుసుకుందాం!

- భారతీయ భోజనంలో ప్రొటీన్లు పరిమితమనే అపోహ ప్రచారంలో ఉంది. కానీ పప్పుధాన్యాలు, మొలకలు, తృణధాన్యాలలో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.
- శాకాహారుల భోజనంలో ప్రొటీన్ లోపిస్తుందన్నది కూడా అపోహే! పనీర్, సెనగలు లాంటి వాటిని భోజనంలో చేర్చుకోవడం ద్వారా ప్రొటీన్‌ను తేలికగా భర్తీ చేసుకోవచ్చు.
- అధిక ప్రొటీన్ మూత్రపిండాలకు హానికరం. ముందు నుంచీ మూత్రపిండాల సమస్యలున్నవారికి అధిక ప్రొటీన్ చేటు చేస్తుంది తప్ప, ఆరోగ్యంగా ఉన్న వాళ్లకు ప్రొటీన్ ఎటువంటి చేటూ చేయదు.

భోజనం ప్రణాళికాబద్ధంగా...

ప్రొటీన్ లోపం తలెత్తకుండా ఉండాలంటే ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనంలో సరిపడా ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలి. అందుకోసం...

బ్రేక్‌ఫాస్ట్ ఇలా...

గుడ్లు: ఉడికించినవి, స్క్రాంబుల్ చేసినవీ, లేదా కూరగాయ ముక్కలతో కలిపి ఆమ్లెట్ వేసి తినొచ్చు

పెరుగుతో: బెర్రీస్, నట్స్ కలుపుకుని తినొచ్చు

కాటేజ్ చీజ్: పండ్ల ముక్కలు కలుపుకుని తినొచ్చు. లేదా కూరగాయలతో కలిపి తినొచ్చు

ప్రొటీన్ స్మూదీస్: బాదం పాలు, అరటిపండు, షియా విత్తనాలు కలిపి తాగొచ్చు

టోఫు: టోఫు, కూరగాయ ముక్కలను వేయించుకుని తినొచ్చు

ఓట్స్: ఓట్స్ షియా విత్తనాలను కలిపి రాత్రంతా నీళ్లలో నానబెట్టుకుని, ఉదయాన్నే పండ్ల ముక్కలతో కలిపి తినొచ్చు

లంచ్‌లో...

పప్పుధాన్యాలు: కందిపప్పు లేదా పెసలతో పప్పు వండుకుని, అన్నంతో, రోటీతో తినొచ్చు. పప్పుకు కూరగాయలు, ఆకుకూరలు జోడించుకోవాలి.

కాబూలీ చనా: నానబెట్టి ఉడికించుకుని సలాడ్‌తో కలిపి తినొచ్చు. టమాటాలతో కలిపి వండుకుని, అన్నంతో, రోటీతో తినొచ్చు

కాటేజ్ చీజ్: షాహి పనీర్, పనీర్ టిక్కా, పాలక్ పనీర్‌లను రోటీ లేదా అన్నంతో కలిపి తినొచ్చు

మూంగ్ దాల్ చిల్లా: పెసరపప్పు దోసె, పెరుగుతో, కూరలతో కలిపి తినొచ్చు

రాజ్మా లేదా కడి: ఈ రెండూ వంటకాలూ అన్నంతో, రోటీతో తినొచ్చు

ధోక్లా: సెనగపిండితో తయారయ్యే ఈ గుజరాతీ వంటకం బలవర్ధకమైనది. తేలికపాటి లంచ్‌లో భాగంగా ఢోక్లాను చట్నీతో కలిపి తినొచ్చు

సోయా చంక్స్: కూరలా వండుకుని తినొచ్చు. కూరగాయలతో కలిపి వేయించుకుని తినొచ్చు

పచ్చి బఠాణీ: వీటితో పులావ్ వండుకోవచ్చు. పనీర్‌తో కలిపి కూర తయారుచేసుకుని రోటీ, అన్నంతో తినొచ్చు.

డిన్నర్ ఇలా...

పనీర్ టిక్కా: పుదీనా చట్నీతో కలిపి తినొచ్చు లేదా దోస, టమాటా సలాడ్‌తో కలిపి తినొచ్చు

పెసరపప్పు: రోటీ లేదా అన్నంతో కలిపి తినొచ్చు

కిచిడి: క్యారట్స్, పచ్చి బఠాణీ, పాలకూర, పెసరపప్పు, బియ్యంతో తయారుచేసుకునే కిచిడి బలవర్ధకమైన ఆహారం

చనా మసాలా: బ్రౌన్ రైస్, క్వినోవా లేదా పొట్టుతీయని గోధుమపిండితో తయారుచేసిన రోటీలతో కలిపి తినొచ్చు

పాలక్ పనీర్: రోటీలు, అన్నంతో కలిపి తినొచ్చు.


రుణాలకు మహిళల పరుగులు

గడచిన ఐదేళ్లలో 22% పెరుగుదల

సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం

క్రెడిట్ స్కోర్ పర్యవేక్షణ కూడా ఎక్కువే..

సిబిల్-నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: మహిళలు రుణాల కోసం పురుషులతో పోటీ పడుతున్నారు. గత ఐదేళ్ల కాలం (2019-2024)లో రుణాలు తీసుకునే మహిళల సంఖ్య 22 శాతం పెరిగిందని, వారిలో అధిక శాతం మంది సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల వారేనని ట్రాన్స్‌యూనియన్ సిబిల్, నీతి ఆయోగ్‌కు చెందిన మహిళా అంత్రప్రెన్యూర్‌షిప్ ప్లాట్‌ఫామ్ (డబ్ల్యూఈపీ), మైక్రోసేవ్ కన్సల్టింగ్ (ఎంఎస్‌సీ) ఉమ్మడిగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. రుణగ్రహీతల నుంచి నిర్మాతలుగా పరివర్తన: భారత ఆర్థిక వృద్ధి కథనంలో మహిళల పాత్ర" పేరిట ఈ నివేదిక రూపొందించారు. వారు తీసుకుంటున్న రుణాల్లో అధిక మొత్తం వినియోగ డిమాండ్ పెరగడానికే పోతున్నదని, వ్యాపారాలకు పోతున్న సొమ్ము చాలా తక్కువగా ఉంటున్నదని ఆ నివేదికలో తెలిపారు. వ్యాపార అవసరాల కోసం రుణాలు తీసుకున్న వారి సంఖ్య కేవలం 3 శాతం ఉన్నట్టు పేర్కొన్నారు. వ్యక్తిగత రుణాలు, కన్స్యూమర్ డ్యూరబుల్ రుణాలు, ఇంటి రుణాలు వంటి వ్యక్తిగత రుణాల వాటా 42 శాతం ఉండగా బంగారం రుణాల సంఖ్య 38 శాతం ఉంది. మహిళలు రుణాలు తీసుకోవడమే కాకుండా క్రెడిట్ స్కోర్‌ను చురుగ్గా పర్యవేక్షించుకుంటున్నారని నీతి ఆయోగ్ తెలిపింది. గత ఏడాది డిసెంబర్ నాటికి 2.7 కోట్ల మంది మహిళలు క్రెడిట్ స్కోర్ పర్యవేక్షించుకోవడం వారిలో పెరుగుతున్న ఆర్థిక చైతన్యానికి చిహ్నమని తెలిపింది. 2024లో ఇలా స్వయం పర్యవేక్షణ చేసుకున్న మహిళల వాటా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 49 శాతం ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది.

బంగారం..బంగారమే

సురక్షిత పెట్టుబడి సాధనం

భవిష్యత్‌లోనూ డిమాండ్

సీఈఏ అనంత నాగేశ్వరన్

న్యూఢిల్లీ: సురక్షిత పెట్టుబడిగా బంగారానికి ఢోకా లేదని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అన్నారు. ఈ కోణంలో చూస్తే భవిష్యత్‌లో పసిడికి డిమాండ్ మరింత పెరుగుతుందన్నారు. పసిడి, పసిడి మార్కెట్లపై ఐజీపీసీ-ఐఐఎంఏ నిర్వహించిన వార్షిక సదస్సులో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. పెట్టుబడుల వివిధీకరణ (డైవర్సిఫికేషన్) కోసం చూసే ప్రతి మదుపరి పోర్టుఫోలియోలో బంగారం తప్పనిసరిగా ఉండాలన్నారు. 'స్టోర్ వాల్యూ, సాంస్కృతిక, మతపరమైన ఉత్సవాల్లో నగగానేగాక, పసిడి ప్రతి వ్యక్తి పెట్టుబడుల పోర్టుఫోలియోలో ఉండాల్సిన ఆస్తి' అని ఆయన అన్నారు.



పదింతలు పెరిగిన విలువ

గత 23 సంవత్సరాలకు చూసినా ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర 250/290 డాలర్ల నుంచి పదింతలు పెరిగిందని నాగేశ్వరన్ అన్నారు. గత మూడు నెలల్లో దేశీయ స్టాక్ మార్కెట్ 8 శాతం నష్టపోతే, ఔన్స్ మేలిమి (24 క్యారట్స్) బంగారం విలువ మాత్రం 200 డాలర్లు (8 శాతం) పెరిగి 2,860 డాలర్లకు చేరిన విషయాన్ని గుర్తు చేశారు. పసిడి ప్రాముఖ్యత ముందు ముందు మరింత పెరుగుతుందన్నారు. ప్రస్తుతం మన దేశంలో బంగారాన్ని నగల తయారీ లేదా సురక్షిత పెట్టుబడిగానే ఉపయోగిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ ధోరణి మారి, మరింత ప్రయోజనకరంగా ఉపయోగించే అవకాశం ఉందని నాగేశ్వరన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అప్పులపై జర జాగ్రత్త

ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ప్రభుత్వాల అప్పులపైనా సీఈఏ నాగేశ్వరన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ అప్పులు అనేక దేశాలకు మోయలేని భారంగా మారాయన్నారు. దీంతో భవిష్యత్‌లో ప్రభుత్వాల ఆదాయాలు ఈ అప్పుల చెల్లింపులకే సరిపోతాయి తప్ప, అభివృద్ధి ఖర్చులకు ఏమీ విగలవన్నారు. ఈ ఏడాది మార్చి ముగిసేనాటికి మన దేశ అప్పు జీడీపీలో 57.1 శాతానికి చేరే అవకాశం ఉందన్నారు. 2026 మార్చి నాటికి దీన్ని 56.1 శాతానికి తగ్గించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీ ఇక నవరత్నాలు

న్యూఢిల్లీ: రైల్వే శాఖకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీలకు నవరత్న హోదా కల్పించడానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపింది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ ప్రత్యేక గుర్తింపు సాధించినందుకు రైల్వే శాఖ పీఎస్‌యూలను అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "తమ సంస్థలను నవరత్న స్థాయికి నడిపించిన టీమ్ ఐఆర్‌సీటీసీ, టీమ్ ఐఆర్‌ఎఫ్‌సీ ఉద్యోగులకు అభినందనలు" అని ఆ పోస్ట్‌లో ఆయన రాశారు.

ఫిబ్రవరిలో స్టార్టప్స్ రూ.14,418 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: గత నెలలో దేశీయ స్టార్టప్‌లు మొత్తం 165 కోట్ల డాలర్ల (సుమారు రూ.14,418 కోట్లు) నిధులను సమీకరించాయని ప్రైవేట్ మార్కెట్ పరిశోధన వేదిక ట్రాక్షన్ వెల్లడించింది. దాంతో ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన 11 నెలల్లో (ఏప్రిల్-ఫిబ్రవరి) స్టార్టప్‌లు సమీకరించిన మొత్తం నిధులు 2,540 కోట్ల డాలర్లకు చేరుకుందని తెలిపింది. ఈ జనవరిలో 138 కోట్ల డాలర్ల ఫండింగ్‌తో పోలిస్తే, గతనెలలో స్టార్టప్‌లు 19.5%అధిక నిధులు సమీకరించగలిగాయి.



సామ్‌సంగ్ ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్ హెడ్‌సెట్

మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఆవిష్కరించిన సంస్థ

బార్సిలోనా (స్పెయిన్): దక్షిణా కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సామ్‌సంగ్.. మిక్స్‌డ్ రియాల్టీ హెడ్‌సెట్ విభాగంలో 'యాపిల్ విజన్ ప్రో'కు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ప్రాజెక్ట్ 'మూహన్' (కొరియా భాషలో అనంతం అని అర్థం) పేరుతో ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్ హెడ్‌సెట్‌ను బార్సిలోనాలో సోమవారం ప్రారంభమైన 'మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2025'లో ఆవిష్కరించింది. అమెరికన్ టెక్ దిగ్గజం గూగుల్‌తో కలిసి అభివృద్ధి చేస్తోన్న ఈ హెడ్‌సెట్‌ను సామ్‌సంగ్ వచ్చే ఏడాది మార్కెట్లోకి అందుబాటులోకి తేనుంది. అంతేకాదు, ఆండ్రాయిడ్ ఎక్స్‌ఆర్ ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేస్తోన్న తొలి హెడ్‌సెట్ ఇదే. దీన్ని హెడ్‌సెట్‌తో పాటు గ్లాసెస్ రూపంలోనూ అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. అత్యంత నాణ్యమైన డిస్‌ప్లేతో కూడిన ఈ హెడ్‌సెట్‌లో గూగుల్ మ్యాప్స్ ద్వారా నావిగేషన్, క్రీడల వీక్షణ కోసం ఎక్స్‌టెండెడ్ వ్యూ, గూగుల్ జెమినీ ఏఐ హెల్ప్ వంటి ఫీచర్లను పొందుపరిచింది.

హైదరాబాద్‌లో జువారీ హౌసింగ్ ప్రాజెక్ట్

రూ.1,500 కోట్లకు పైగా పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ రియల్టీ మార్కెట్లోకి మరో కార్పొరేట్ దిగ్గజం ప్రవేశిస్తోంది. జువారీ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ జువారీ ఇన్‌ఫ్రావరల్డ్ ఇండియా లిమిటెడ్.. గంగోత్రి డెవలపర్స్‌తో కలిసి ఒక భారీ హౌసింగ్ ప్రాజెక్టు చేపడుతోంది. కొల్లూరు మైక్రో మార్కెట్ సమీపంలో 9.4 ఎకరాల్లో 'జువారీ గంగోత్రి త్రిభుజ' పేరుతో ఈ ప్రీమియం హౌసింగ్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుంది. ఇందుకోసం రూ.1,500 కోట్లకు పైగా వెచ్చించనుంది. రాష్ట్ర సిమెంట్ రంగంలో ఉన్న జువారీ గ్రూప్‌నకు హైదరాబాద్‌లో ఇదే తొలి రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టులో భాగంగా 53 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తొమ్మిది టవర్లతో 1,730 అపార్ట్‌మెంట్లు నిర్మిస్తారు.

హైడ్రోజెన్ వాహనాల కోసం ఐదు పైలట్ ప్రాజెక్టులు

న్యూఢిల్లీ: నేషనల్ గ్రీన్ హైడ్రోజెన్ మిషన్ కింద ప్రయోగాత్మకంగా హైడ్రోజెన్ వాహనాలు నడిపేందుకు ఐదు ప్రయోగాత్మక ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ ఈ విషయం తెలియచేసింది. దేశవ్యాప్తంగా అమలు జరిగే ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు కింద 10 విభిన్న రూట్లలో హైడ్రోజెన్ ఇంధనంతో పని చేసే 37 బస్సులు, ట్రక్కులు నడుపుతామని తెలిపింది. టాటా మోటార్స్, రిలయన్స్, ఎన్‌టీపీసీ, ఏఎన్ఈఆర్‌టీ, అశోక్ లేలాండ్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీఎల్ కంపెనీలకు ఈ ప్రాజెక్టులు కేటాయించారు. ఎంపిక చేసిన ఈ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి రూ.208 కోట్ల ఆర్థిక సహాయం అందుతుంది.

● షార్ప్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ షార్ప్ బిజినెస్ సిస్టమ్స్ (ఇండియా) లిమిటెడ్.. మార్కెట్లోకి సరికొత్త ఎయిర్ కండీషనర్స్ (ఏసీ)ను విడుదల చేసింది. రేర్‌యు, సెరియో, ప్లాస్మా చిల్ సిరీస్‌తో వీటిని తీసుకువచ్చింది. 7 స్టేజ్ ఫిల్టరేషన్, కన్వర్టబల్, టర్బో మోడ్, సెల్ఫ్-క్లీనింగ్ టెక్నాలజీ, ఆటో రీస్టార్ట్ వంటి కొత్త ఫీచర్లతో వీటిని రూపొందించింది. ఏడేళ్ల సమగ్ర వారంటీతో కూడిన రేర్‌యూ ఏసీల ప్రారంభ ధర రూ.39,999గా ఉండగా సెరియో ప్రారంభ ధర రూ.32,499, ప్లాస్మా చిల్ ధర రూ.32,999గా ఉన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

4వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	440
వరంగల్	412	గోదావరి	440
చిత్తూరు	463	విశాఖపట్నం	455
		దజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	101
వరంగల్	100	గుంటూరు	101
కరీంనగర్	100	ఒంగోలు	101
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	94
కర్నూలు	100	నెల్లూరు	99
విశాఖపట్నం	100	అనంతపురం	99
గోదావరి	101		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,630 ▲	79,410 ▲	1,05,000 ▼
విజయవాడ	87,700 ▲	82,500 ▼	96,500 ▼
విశాఖపట్నం	85,190 ▲	78,090 ▲	95,750 ▲
రాజమండ్రి	86,670 ▲	79,450 ▲	96,500 ▼
ప్రొద్దుటూరు	87,450 ▲	80,980 ▲	96,500 ▼
ముంబై	85,320 ▲	78,153 ▲	94,398 ▲

నిఫ్టీ తొమ్మిదో రోజూ నష్టాల్లోనే..

సెన్సెక్స్ మరో 112 పాయింట్లు డౌన్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం ట్రేడింగ్‌లో ఆరంభ లాభాలను చేజార్చుకుని మళ్లీ నష్టాల బాట పట్టాయి. సెన్సెక్స్ ఒక దశలో 414 పాయింట్ల మేర క్షీణించి 72,784.54 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఐరోపా, ఆసియా మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో కాస్త తేరుకున్న సూచీ.. చివరికి 112.16 పాయింట్ల నష్టంతో 73,085.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 5.40 పాయింట్లు కోల్పోయి 22,119.30 వద్ద స్థిరపడింది. నిఫ్టీ నష్టపోవడం వరుసగా ఇది తొమ్మిదో రోజు. కాగా, సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 12 నష్టపోగా.. విగతా 18 రాణించాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2.38 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.72 శాతం పతనమయ్యాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం తగ్గగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ మాత్రం 0.25 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో ఎనర్జీ 1.11 శాతం నష్టపోగా.. ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకెక్స్, ఆయిల్ అండ్ గ్యాస్, సర్వీసెస్ సెక్టార్ సూచీలూ స్వల్పంగా తగ్గాయి. క్యాపిటల్ గూడ్స్, పవర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, కమోడిటీ, టెక్, ఫోకస్డ్ ఐటీ, యుటిలిటీ ఇండెక్స్‌లు మాత్రం రాణించాయి.

ఓలా ఎలక్ట్రిక్‌లో 1,000 ఉద్యోగాల కోత

సరికొత్త ఏడాది కనిష్ఠానికి షేరు

న్యూఢిల్లీ: విక్రయాలపరంగా దేశంలో అతిపెద్ద ఎలక్ట్రిక్ టూ వీలర్ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ దాదాపు 1,000 మంది ఉద్యోగులను తొలగించే పనిలో ఉంది. నష్టాలను తగ్గించుకునేందుకు వ్యాపార పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా పలు విభాగాల్లో ఉద్యోగాల కోతకు పూనుకున్నట్లు తెలిసింది. ఓలా ఎలక్ట్రిక్ గత ఏడాదిలోనూ 500 మందిని ఉద్యోగం నుంచి తీసివేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీ నష్టాలు రూ.564 కోట్లకు పెరిగాయి. కాగా, కంపెనీలో ఉద్యోగాల కోతల వార్తల నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ షేరు ఎన్ఎస్ఈలో 3.40 శాతం క్షీణించి రూ.54.90కి పడిపోయింది. ఒక దశలోనైతే షేరు 5.5 శాతం క్షీణించి రూ.53.71 వద్ద సరికొత్త ఏడాది కనిష్ఠాన్ని నమోదు చేసింది.



స్మిత్

ఆసీస్ గండం దాటేనా?

భారత్‌కు కంగారూల సవాల్

నేడు ఇరు జట్ల మధ్య సెమీస్

మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ఛాంపియన్స్ ట్రోఫీ



ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లో ఆసీస్‌పై భారత జట్టు చివరిసారిగా 2011 వన్డే వరల్డ్‌కప్ క్వార్టర్స్‌లో గెలిచింది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లీ, శ్రేయాస్, అక్షర్, రాహుల్, హార్దిక్, జడేజా, కుల్దీప్, షమి, వరుణ్.

ఆస్ట్రేలియా: హెడ్, ఇన్‌గ్లిస్, స్మిత్, లబుషేన్, కూపర్, క్యారీ, మ్యాక్స్‌వెల్, డ్వార్షిస్, ఎల్లిస్, జాన్సన్, జంపా.

పిచ్ భారత్-పాక్ మ్యాచ్ కోసం వాడిన పిచ్‌పైనే సెమీస్ జరుగబోతోంది. వికెట్ స్పిన్‌కు అనుకూలించనుంది. మంచు ప్రభావం కనిపించడం లేదు. దీంతో టాస్ నెగ్గిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

దుబాయ్ మాకూ కొత్తే..

'దుబాయ్ మా సొంత మైదానమేమీకాదు. ఇక్కడ గతంలో ఎక్కువ మ్యాచ్‌లను ఆడలేదు. దీంతో పాటు ఈ టోర్నీలో మేమాడిన మూడు మ్యాచ్‌ల్లోనూ పిచ్ విభిన్నంగా స్పందించింది. ఇక్కడ నాలుగైదు పిచ్‌లను వినియోగిస్తున్నారు. ఎలాంటి పరిస్థితులకైనా సిద్ధంగా ఉండేందుకు ప్రయత్నిస్తాం. ఐసీసీ టోర్నీలో ఆసీస్‌కు ఘనచరిత్ర ఉంది. ఈసారి మాత్రం మాదే పైచేయి ఉండేలా ఆడతాం. ఒత్తిడి ఇరు జట్లపైనా ఉంటుంది కాబట్టి పోరు ఆసక్తికరంగా మారనుంది'

- రోహిత్ శర్మ

సెమీస్ అంపైర్లు వీరే..

భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే తొలి సెమీస్‌కు ఐసీసీ ఆన్‌ఫీల్డ్ అంపైర్లను ప్రకటించింది. ఈ మ్యాచ్ కోసం కివీస్‌కు చెందిన గఫానే, ఇంగ్లండ్‌కు చెందిన రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ మైదానంలో అంపైర్లుగా ఉండనున్నారు. అలాగే థర్డ్ అంపైర్‌గా మైకేల్ గాఫ్, రెఫరీగా ఆండీ పైక్రాఫ్ట్ వ్యవహరిస్తారు.

దుబాయ్: స్వదేశంలో 2023 వన్డే వరల్డ్‌కప్.. వరుసగా పది విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్.. ఇక కప్ లాంఛనమే అని సంబరాలకు సిద్ధంగా ఉన్న అభిమానులు. కానీ కోట్లాది భారతీయులను అవాక్కయ్యేలా ఆస్ట్రేలియా గట్టి ఝలక్ ఇచ్చి విశ్వవిజేతగా నిలిచింది. ఆ తర్వాత ఈ ఫార్మాట్‌లో మళ్లీ ఇప్పుడు ఐసీసీ టోర్నీ సెమీస్ ముందు సై అంటోంది. అంతకుముందు 2015 వన్డే వరల్డ్‌కప్ సెమీస్, 2023 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ భారత్‌ను ఇంటిముఖం పట్టించింది. అందుకే ఐసీసీ నాకౌట్ పోరులో ఆసీస్ ఎదురుపడితే అమ్మో.. అనిపిస్తుంటుంది. తాజాగా చాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను దక్కించుకోవాలంటే ముందు ఆసీస్ గండాన్ని అధిగమించాల్సి ఉంది. మంగళవారం ఇరు జట్ల మధ్య తొలి సెమీస్ జరుగనుంది. ఇప్పటికే దుబాయ్‌లో హ్యాట్రిక్ విజయాలతో ఉన్న టీమిండియాను ఫేవరెట్‌గా భావిస్తున్నా.. ఐసీసీ టోర్నీల్లో ఎనలేని ఉత్సాహంతో ఆడే ఆసీస్‌ను తక్కువ అంచనా వేయలేం. జట్టులో స్టార్ ఆటగాళ్లు లేకపోవడంతో స్మిత్ సేన గ్రూప్ దశ దాటడం కూడా కష్టమేనని విశ్లేషకులు భావించారు. కానీ అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఆసీస్ చాంపియన్ ఆట తీరును ప్రదర్శిస్తోంది. దీంతో నేటి మ్యాచ్‌లో భారత బౌలింగ్‌కు ఆసీస్ బ్యాటింగ్‌కు మధ్య రసవత్తర పోరు జరుగనుంది.

స్పిన్నర్లే కీలకం

చాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టులో ఐదుగురు స్పిన్నర్లను ఎంపిక చేస్తే అంతా విమర్శించారు. కానీ ఇప్పుడు వారే ప్రధాన ఆయుధంగా మారడం విశేషం. భారత జట్టు తొలి రెండింట్లో ఛేదనలో నెగ్గింది. అయితే కివీస్‌తో మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగినా భారీ స్కోరు సాధించలేకపోయింది. అయితేనేం.. ఏకంగా నలుగురు స్పిన్నర్లు తడాఖా చూపారు. వీరు వేసిన 39 ఓవర్లలో 128 డాట్ బాల్స్ కావడంతో కివీస్ ఉక్కిరిబిక్కిరైంది. ప్రత్యర్థి తొమ్మిది వికెట్లను వీరే తీసి 250 పరుగుల లక్ష్యాన్ని కాపాడారు. అందుకే ఈసారి ఆసీస్‌ను దెబ్బతీసేందుకు కూడా స్పిన్ మంత్రాన్నే ప్రయోగించాలని భారత్ భావిస్తోంది. ముఖ్యంగా వరుణ్ చక్రవర్తి వైవిధ్యమైన బౌలింగ్‌తో కీలకంగా నిలిచాడు. అయితే సెమీస్‌లోనూ అతడిని కొనసాగిస్తారా? లేకుంటే షమికి తోడు మరో స్పెషలిస్ట్ పేసర్‌గా హర్షిత్, అర్ష్‌దీప్‌లలో ఒకరిని ఆడిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. ఇక బ్యాటింగ్‌లో గిల్, రోహిత్, విరాట్, శ్రేయాస్, అక్షర్, రాహుల్ రూపంలో టాపార్డర్, మిడిలార్డర్ అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. డెత్ ఓవర్లలో హార్దిక్ బ్యాట్ ఝుళిపిస్తున్నాడు.

బ్యాటింగ్‌పైనే భారం

ప్యాట్ కమిన్స్, హాజెల్‌వుడ్, స్టార్క్‌లాంటి అగ్రశ్రేణి బౌలర్లు లేకుండానే మెగా టోర్నీకి వచ్చిన ఆసీస్ బలహీనంగానే కనిపిస్తోంది. స్పిన్నర్ ఆడమ్ జంపా మాత్రమే స్టార్ బౌలర్‌గా ఉన్నాడు. అందుకే ఇంగ్లండ్ 351, అఫ్ఘాన్ 273 పరుగులు చేయగలిగాయి. అయితే ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్ మాత్రం ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్‌లో 352 పరుగుల ఛేదనను 47.3 ఓవర్లలోనే ముగించి అబ్బురపరిచింది. తాజా టోర్నీలో ఆసీస్ పూర్తి మ్యాచ్ ఆడింది ఈ ఒక్కసారే. మిగతా రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. దీంతో వీరికి పెద్దగా మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా పోయింది. ఇక భారత్‌కు హెడ్ నుంచి ఎప్పుడూ ప్రమాదమే. స్మిత్, ఇన్‌గ్లిస్, క్యారీ, మ్యాక్స్‌వెల్ రాణిస్తే భారీ స్కోరు ఖాయమే. అయితే మాథ్యూ షార్ట్ దూరం కావడంతో జంపాకు జతగా మరో స్పిన్నర్ లేకుండాపోయాడు. అతడి స్థానంలో కూపర్ కన్నోలిని తీసుకున్నారు. మ్యాక్స్‌వెల్, హెడ్ రూపంలో పార్ట్‌టైమ్ స్పిన్ అందుబాటులో ఉండనుంది. ప్రధాన పేసర్లయిన డ్వార్షిస్, ఎల్లిస్, జాన్సన్ భారత్‌పై రెండు వన్డేలను మాత్రమే ఆడారు.

స్పోర్ట్స్

మూనీ మెరుపులు



బెత్ మూనీ (59 బంతుల్లో 17 ఫోర్లతో 96 నాటౌట్)

డబ్ల్యూపీఎల్

● గుజరాత్ ఆల్‌రౌండ్ షో

● 81 పరుగులతో యూపీ చిత్తు

లఖ్‌నవూ: బెత్ మూనీ (59 బంతుల్లో 17 ఫోర్లతో 96 నాటౌట్) అర్ధ శతకంతోపాటు బౌలర్లు అదరగొట్టడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ప్లేఆఫ్స్ అవకాశాలను గుజరాత్ జెయింట్స్ సజీవంగా నిలబెట్టుకొంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో 81 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తు చేసిన గుజరాత్.. రెండో స్థానానికి ఎగబాకింది. తొలుత గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 186/5 స్కోరు చేసింది. సోఫీ ఎకెల్‌స్టోన్ రెండు వికెట్లు పడగొట్టింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్.. స్వల్ప స్కోరుకే ఓపెనర్ హేమలత (2) వికెట్ కోల్పోయింది. కానీ, మరో ఓపెనర్ బెత్ మూనీ, హర్లీన్ డియోల్ (45) రెండో వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యంతో భారీ స్కోరుకు బాటలు వేశారు. హాఫ్ సెంచరీ దిశగా సాగుతున్న హర్లీన్‌ను ఎకెల్‌స్టోన్ బౌల్డ్ చేసింది. కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ (11), దియేంద్ర డోటిన్ (17), లిచ్‌ఫీల్డ్ (8) విఫలమయ్యారు. అనంతరం ఛేదనలో యూపీ 17.1 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. షినెల్లీ హెన్రీ (28), గ్రేస్ హ్యారిస్ (25) టాప్ స్కోరర్లు. తనూజ కన్వర్, కష్వీ గౌతమ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 186/5 (బెత్ మూనీ 96 నాటౌట్, హర్లీన్ 45; ఎకెల్‌స్టోన్ 2/34);
యూపీ: 17.1 ఓవర్లలో 105 ఆలౌట్ (హెన్రీ 28, హ్యారిస్ 25, కష్వీ 3/11, తనూజ 3/17).



క్రీడలపై సీఎం చంద్రబాబు విజన్ భేష్ : ఎమ్మెస్కే

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): క్రీడారంగం ఉన్నతిపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకి ఉన్న శ్రద్ధ, దూరదృష్టిని బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ నూతన స్పోర్ట్స్ పాలసీని పరిశీలించిన ఆయన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రశంసించారు. సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెస్కే ప్రసాద్‌ను శాప్ ఛైర్మన్ ఎ. రవి నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్త స్పోర్ట్స్ పాలసీ ద్వారా రాష్ట్రంలో క్రీడారంగ ప్రగతికి తీసుకుంటున్న చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు. ఒలింపిక్స్‌లో మెడల్ సాధించిన వారికి ఇచ్చే నగదు ప్రోత్సాహకాలను భారీగా పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచడం వంటి నిర్ణయాలపై ఎమ్మెస్కే హర్షం వ్యక్తం చేశారు.

రహానెకు 'కోల్‌కతా' పగ్గాలు




న్యూఢిల్లీ: ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్‌గా టీమిండియా వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానె (36) నియమితుడయ్యాడు. గతేడాది కోల్‌కతాకు టైటిల్ అందించిన శ్రేయాస్ అయ్యర్‌ను మేనేజ్‌మెంట్ వదిలేసుకొంది. అనంతరం జరిగిన మెగా వేలంలో రహానె, వెంకటేష్ అయ్యర్‌లను కొనుగోలు చేసింది. కెప్టెన్ ఎవరన్న సస్పెన్స్‌కు తెరదించుతూ రహానెను కెప్టెన్‌గా, వెంకటేష్‌ను ఉప సారథిగా నియమించారు. ఈ నెల 22న ఐపీఎల్ ఆరంభం కానుంది. దేశవాళీ టోర్నీల్లో ముంబై జట్టుకు రహానె నాయకత్వం వహిస్తున్నాడు.

'లారెస్' అవార్డుకు పంత్ నామినేట్



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డుకు భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ నామినేట్ అయ్యాడు. 2025కు గాను 'కమ్ బ్యాక్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కేటగిరీలో పంత్‌ను ఎంపిక చేశారు. మాడ్రిడ్‌లో వచ్చే నెల 21న ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమం జరగనుంది. 2022, డిసెంబరు 30న జరిగిన కారు ప్రమాదంలో పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. శస్త్రచికిత్స అనంతరం ఎన్‌సీఏలో క్రమంగా కోలుకొన్న రిషభ్ గతేడాది ఐపీఎల్‌తో మళ్లీ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు.



పరదాల్లేవు.. భారీ బందోబస్తు లేదు..!

జగన్ జమానాలో అసెంబ్లీ సమావేశాలంటే.. మూడు వేల మంది పోలీసులతో భారీ భద్రత

కూటమి ప్రభుత్వంలో 525 మందితోనే బందోబస్తు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయంటే ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భయపడిపోయేవారు. అసెంబ్లీకి సుమారు 20 కిలోమీటర్ల పరిధి నుంచే ఆంక్షలు మొదలయ్యేవి. అప్పటి సీఎం జగన్ నివాసం వద్ద, అసెంబ్లీ పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేసేవారు. ఎటి ఇంటి ముందు పరదాలు, దారి పొడవునా షాపులు మూసివేయించడం వంటివి సర్వసాధారణంగా జరిగేవి. అయితే... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. పరదాలు లేవు. ప్రస్తుతం 525 మందితోనే భద్రత ఏర్పాట్లు చేశారు.

అన్ని స్కూళ్లలో ఐదేళ్లలో మౌలిక వసతులు

ప్రహరీ గోడలకు ఉపాధి నిధులు: లోకేశ్

- ప్రతి పాఠశాల, కాలేజీలో ఈగల్ టీంలు
- 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో అవగాహన



అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.3 వేల కోట్లు అవసరమని, వీటికి ఉపాధి హామీ పథకం నిధులు, 'మన బడి-మన భవిష్యత్' నిధులు వినియోగిస్తామని చెప్పారు. 16,347 పోస్టులతో త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఆయా అంశాలపై సోమవారం అసెంబ్లీలో పలువురు సభ్యుల ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. 'గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదు. గత 30 ఏళ్లలో టీడీపీ ప్రభుత్వాల హయాంలో 13 డీఎస్సీలు తెచ్చి.. 1,80,272 మంది టీచర్ పోస్టులు భర్తీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ మొదటి హయాంలో మూడు డీఎస్సీలు ప్రకటించి 16,701 పోస్టులు భర్తీ చేసింది' అని వివరించారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి కేజీబీవీల్లో వంద శాతం ప్రహరీల నిర్మాణం పూర్తవుతుందన్నారు. సీసీ టీవీలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం అమలుచేసిన నాడు- నేడు పథకంపై అనేక ఆరోపణలున్నాయని, దానిపై నివేదిక తెప్పిస్తామన్నారు. ప్రతి పాఠశాల, కాలేజీలో ఈగల్ టీంలు ఏర్పాటుచేసి 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జగన్ ప్రభుత్వం జీవో 117 తీసుకొచ్చి పేదలకు విద్యను దూరం చేసిందని విమర్శించారు. దాని చేతగానితనంతో ప్రభుత్వ పాఠశాలల్లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారని తెలిపారు. ప్రహరీ గోడలు లేకపోవడం వల్ల పాఠశాలల ఆవరణల్లో డ్రగ్స్ గంజాయి వినియోగం పెరుగుతోందని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు.

డ్రగ్స్ రవాణా చేస్తే ఆస్తులు జప్తు: అనిత



డ్రగ్స్ వినియోగించకపోయినప్పటికీ.. రవాణా చేసినా, ప్రేరేపించినా వారి ఆస్తులు జప్తు చేస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టంచేశారు. ఇప్పటికే గత నాలుగు నెలల్లో రెండు చోట్ల ఆస్తులు జప్తు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగంపై గల్లా మాధవి (గుంటూరు పశ్చిమ) లేవనెత్తిన ప్రశ్నకు ఆమె జవాబిచ్చారు. ప్రతి జిల్లాలో ఈగల్ బృందాలు ఏర్పాటు చేశామని, కాలేజీలు, పాఠశాలల్లో కూడా ఈ టీంలు ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో గంజాయి సాగు 11 వేల ఎకరాల్లో ఉండగా దానిని వంద ఎకరాలకు తీసుకొచ్చామన్నారు. అది కూడా ఎక్కడ సాగవుతుందో.. 375 గ్రామాల్లో 20 హాట్‌స్పాట్లు గుర్తించామన్నారు. గతంలో 359 కుటుంబాలు గంజాయి సాగుకు సుదీర్ఘకాలం నుంచి అలవాటుపడి జీవిస్తుండగా వారికి ప్రత్యామ్నాయ మొక్కలు పంపిణీ చేసి జీవనోపాధి మార్చామని తెలిపారు. ఇటీవలి కాలంలో 40,088 కిలోల గంజాయిని పట్టుకున్నామన్నారు. అయితే మన రాష్ట్రంలో సాగు చేసిన దాని కంటే ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి వస్తోందని చెప్పారు. పైగా గంజాయి పొడిని ఇటీవల ద్రవ రూపంలోకి మార్చి వినియోగిస్తున్నారన్నారు. డ్రగ్స్ కొరియర్ల ఆస్తులు జప్తుచేయాలని, అవసరమైతే యూపీ తరహాలో వారి ఇళ్ల ధ్వంసం చేసే అంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు (గాజువాక) కోరారు. వినియోగం కంటే కొరియర్ చేయడం వల్ల ఎక్కువ సంపాదించడం అలవాటుగా మార్చుకున్నారని, అనేక చోట్ల చిల్లర కొట్లలోనూ గంజాయి దొరుకుతోందని.. ప్రతి నియోజకవర్గంలో డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల వద్ద ఉన్న షాపుల్లోనూ గంజాయి అమ్ముతున్నారని, ఆ షాపుల యజమానులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి (కడప) కోరారు. మెడికల్ షాపుల్లో పెయిన్ కిల్లర్లు అనధికారికంగా అమ్ముతున్నారని, వాటిని కొనుగోలు చేసి ద్రవరూపంలోకి మార్చి డ్రగ్స్‌గా తీసుకుంటున్నారని చెప్పారు. పాఠశాలలు, కాలేజీలు, కేటాయించని టిడ్కో ఇళ్లు గంజాయి వినియోగ కేంద్రాలుగా మారాయని తెనాలి శ్రావణ్‌కుమార్ (తాడికొండ) తెలిపారు.

రైతులకు 69,975 విద్యుత్ కనెక్షన్లు పెండింగ్: మంత్రి గొట్టిపాటి



రైతులకు ఇవ్వాల్సిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 69,975 పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో వాటిని మంజూరుచేస్తామని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈ అంశంపై ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ(రాజానగరం), ముక్కు ఉగ్రనరసింహారెడ్డి (కనిగిరి) లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన జవాబు చెప్పారు. వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ ఇవ్వాలని బలరామకృష్ణ కోరగా.. కనిగిరిలో పెద్దఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని, రైతులకు కనెక్షన్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారులు.. ఆక్రమణలకు మాత్రం వెంటనే ఇస్తున్నారని ఉగ్రనరసింహారెడ్డి ఆరోపించారు. మంత్రి స్పందిస్తూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 20,700 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు.

అనుమతి రాగానే మెలియాపుట్టిలో ఐటీడీఏ: మంత్రి సంధ్యారాణి

శ్రీకాకుళం జిల్లాలోని మెలియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదన ఆర్థిక శాఖ వద్ద పరిశీలనలో ఉందని, అనుమతి రాగానే ఏర్పాటవుతుందని గిరిజన సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. దీనిపై ఎమ్మెల్యేలు గౌతు శిరీష (పలాస), కూన రవికుమార్ (ఆమదాలవలస), గొండు శంకరరావు (శ్రీకాకుళం), బగ్గు రమణమూర్తి (నరసన్నపేట) అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్తంగా చేసిన జిల్లాల పునర్విభజన కారణంగా గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని.. రాష్ట్రమంతా ఒక్కో లోక్‌సభ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా చేసి.. అరకు స్థానాన్ని మాత్రం రెండు జిల్లాలు చేశారన్నారు.

జీవో 3పై సుప్రీంకోర్టులో పిటిషన్

గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు ఉద్యోగాలు కల్పించే జీవో 3 రద్దుపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) వేస్తామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు (పోలవరం) అడిగిన ప్రశ్నకు పై విధంగా స్పందించారు.

గోదావరి పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు: నిమ్మల

2027లో రానున్న గోదావరి పుష్కరాలకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కాగా పనులు శాశ్వత ప్రాతిపదికన చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (రాజమండ్రి అర్బన్) కోరారు. పుష్కర ఘాట్ల వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేయాలని బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం) కోరారు.

ఐదేళ్లలో గేట్లకు గ్రీజయినా పెట్టలేదు

వైసీపీ ప్రభుత్వం సాగునీటి, మురుగునీటి కాలువల నిర్వహణను అధ్వానం చేసిందని మంత్రి నిమ్మల అన్నారు. లాకుల్లోని గేట్లకు ఐదేళ్లలో కనీసం గ్రీజు కూడా పెట్టలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పూడిక, తామర కాడ తొలగించాల్సిన పనులు 4,971 ఉన్నాయని, గోదావరి డెల్టాలోనే ఇందుకోసం రూ.129 కోట్లు అవసరమని చెప్పారు. కొందరు కాంట్రాక్టర్లు టెండర్లలో కావాలనే 40 నుంచి 50 శాతం తక్కువకు కోట్ చేశారని, ఇది పనులు చేయకుండా ఉండే ఎత్తుగడలా కనిపిస్తోందన్నారు. కాలువల నిర్వహణపై సభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (అనపర్తి), అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం) అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

రాష్ట్ర తలసరి ఆదాయం 2,68,653



- జాతీయసగటు కంటే 68 వేలు అధికం
- కూటమి ప్రభుత్వంలో పెరిగిన జీవన ప్రమాణాలు
- అదుపులోకి నిత్యావసరాల ధరలు
- తేల్చిన సామాజిక ఆర్థిక సర్వే
- అతి పేద జిల్లా కర్నూలు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక సర్వేను సోమవారం విడుదల చేసింది. ఇందులో వృద్ధిరేటు, జీఎస్‌డీపీ అంచనాలు, రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుదల గురించి వివరించారు. 2024-25 ముందస్తు అంచనాల ప్రకారం 12.94% వృద్ధిరేటుతో రూ.16.06 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నమోదవుతుందన్నారు. 2024-25లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2,68,653కు చేరుతుందని అంచనా వేశారు. జాతీయసగటు రూ.2,00,162 కంటే ఎక్కువ ఇది. దీని ఆధారంగా రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని తేల్చారు. ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలను సర్వే ప్రస్తావించింది. "2024-25లో ఉల్లి ధరలు 40.24 శాతం పెరిగాయి. కానీ, ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్కెట్లో ధరలను నియంత్రించింది. ఇందుకోసం రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడం, కోల్డ్‌స్టోరేజ్ కేంద్రాల నుంచి సేకరించింది" అని పేర్కొంది. ఈ నెల 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాలను ఈ సర్వేలో అందించారు.

సర్వేలో ముఖ్యమైన అంశాలు

- వ్యవసాయం రంగంలో 15.86 శాతం వృద్ధిరేటుతో రూ.5.19 లక్షల కోట్ల జీవీఏ, పారిశ్రామిక రంగంలో 6.71 శాతం వృద్ధిరేటుతో రూ.3.41 లక్షల కోట్ల జీవీఏ, సేవా రంగంలో 11.7 శాతం వృద్ధిరేటుతో రూ.6.11 లక్షల కోట్ల జీవీఏ నమోదవుతుందని అంచనా.
- హార్టికల్చర్, పశుసంవర్ధకం, మత్స్యరంగాల్లో వృద్ధి గణనీయంగా ఉంటుంది. పారిశ్రామిక రంగంలో ఉత్పాదక విభాగంలో 6.57% వృద్ధి, నిర్మాణ రంగంలో 10.47%, సేవా రంగంలో కమ్యూనికేషన్స్ విభాగంలో 15.28%, బ్యాంకింగ్, బీమా రంగాల్లో 14.6% వృద్ధిని అంచనా వేశారు.
- 2024-25లో తలసరి ఆదాయం రూ.2,68,653కు చేరుతుందని అంచనా.
- 2024-25లో సొంత పన్నుల ఆదాయం రూ.94,967 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.7018 కోట్లు, కేంద్ర నుంచి నిధుల బదిలీ ద్వారా రూ.89,157 కోట్లు వస్తున్నట్లు చెప్పారు.
- 2023-24లో వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, తిరిగి చెల్లించిన అప్పుల అసలు మినహాయిస్తే రాష్ట్రం మొత్తం ఖర్చు రూ.2,36,512 కోట్లు. 2024-25లో ఈ ఖర్చు రూ.2,49,418 కోట్లకు చేరుతుందని అంచనా. 2023-24లో రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పు రూ.4,91,734 కోట్లు కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాల ప్రకారం రూ.5,64,488 కోట్లకు చేరుతుంది.
- 2023-24లో రూ.38,683 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. బడ్జెట్ లోటు రూ.62,720 కోట్లు ఉంది. 2024-25లో రెవెన్యూ లోటు రూ.48,311 కోట్లు, బడ్జెట్ లోటు రూ.73,362 కోట్లకు పెరుగుతోంది.
- పారిశ్రామిక రంగంలోని ఉద్యోగులకు, వ్యవసాయ కూలీల వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) పెరుగుతూ ఉంది. దీని అర్థం జీవన వ్యయం పెరగడం. పారిశ్రామిక ఉద్యోగుల సీపీఐ 4.89 శాతం పెరిగింది.
- వ్యవసాయ కూలీలకు కూలీలు పెరిగాయి. వ్యవసాయ కూలీల్లో మగవారికి సగటున వారి రోజువారీ భత్యం 5.65 శాతం పెరిగి రూ.561కి చేరుకుంది. మహిళా కూలీల వేతనం 2.58 శాతం పెరిగి రూ.398కి చేరుకుంది.
- వడ్రంగి, కమ్మరి వృత్తుల వారి భత్యాలు పెరిగాయి. వడ్రంగుల ఆదాయం 7.74 శాతం పెరిగి రూ.710కి చేరుకుంది. చెప్పులు కుట్టే వారి ఆర్జనలో స్వల్ప క్షీణత ఉంది.
- జనసాంద్రత ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికంగా ఉంది. 2011లో ఒక చదరపు కిలోమీటర్‌కు ఈ జిల్లాలో 304 మంది నివసించారు. ప్రస్తుతం కృష్ణా జిల్లాలో జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 518 మంది నివసిస్తున్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నట్టు సర్వే గుర్తించింది. చాలీచాలని రుణ సౌకర్యం వల్ల వ్యవసాయ రంగం సవాళ్లను చవిచూస్తున్నదని తేల్చింది. కూటమి ప్రభుత్వం రానున్న ఐదేళ్లలో 30% వృద్ధి సాధించే లక్ష్యంతో ముందడుగు వేస్తోందని తెలిపింది.


ఎంపీఐ స్కోర్‌లో 9వ స్థానం

రాష్ట్రంలోనే అత్యధిక పేదరికం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, ప్రకాశం, అనంతపురం జిల్లాలున్నాయి. పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాలు తక్కువ పేదరికంలో ఉన్నాయి. సామాజిక ఆర్థిక సర్వేలో హెడ్‌కౌంట్ నిష్పత్తి, మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్(ఎంపీఐ) స్కోర్ వివరాలను తెలిపారు. పౌష్టికాహారం, పుట్టిన పిల్లల జనన, మరణాలు, గర్భిణుల ఆరోగ్యం పరిగణనలోకి తీసుకుని ఎంపీఐని లెక్కించారు. తక్కువ ఎంపీఐ స్కోరు కలిగిన రాష్ట్రాల్లో ఏపీ 9వ స్థానంలో ఉంది.

పింఛన్లకు 2,717 కోట్లు ఖర్చు

రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద కూటమి సర్కారు నెలకు రూ.2,717 కోట్లు ఖర్చు చేస్తోందని సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడించారు. బీసీల్లో అత్యధికంగా నెలనెలా 28.60 లక్షల మంది పింఛన్లు పొందుతున్నారు. ఆ తర్వాత ఎస్సీలు సుమారు 11.45 లక్షల మంది, కాపులు 6.91 లక్షలు, ఎస్టీలు 3.77 లక్షలు, ముస్లింలు 3.18 లక్షలు, రెడ్లలో 2.92 లక్షలు, కమ్మలో 2.63 లక్షలు, ఈబీసీలు 65,638, బ్రాహ్మణులు 47,707, క్షత్రియులు 41,201, వైశ్యులు 84,345, క్రైస్తవులు 11,458 మంది పింఛన్లు పొందుతున్నారు.

చంద్రబాబుతో పవన్ భేటీ




అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్యాహ్నం 1.30 గంటలకు అసెంబ్లీ హాలు నుంచి నిష్క్రమించారు. ఇద్దరూ కలిసి సీఎం చాంబరుకు వెళ్లారు. సుమారు గంటపాటు వివిధ అంశాలపై చర్చించుకున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల ఎన్నికలపై మాట్లాడుకున్నారు. పవన్ సోదరుడు నాగబాబుకు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఖరారవగా.. మిగిలిన 4 స్థానాలకు అభ్యర్థుల ఎంపికపైనా ఉభయులూ చర్చించినట్లు సమాచారం. కాగా.. రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయింపులు బాగున్నాయని, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను బ్యాలెన్స్ చేస్తూ కేటాయించారని పవన్ ఈ సందర్భంగా పేర్కొన్నట్లు తెలిసింది. మే నెల నుంచి ప్రారంభించే తల్లికి వందనం, అన్నదాత పథకాలపైన చర్చించినట్లు సమాచారం.

మొదటి వరుసలోనే జగన్‌కు సీటు

- సీనియారిటీ ఆధారంగా స్థానాల కేటాయింపు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా దక్కకపోయినా అసెంబ్లీలో మాత్రం తొలివరుసలోనే సీటు దక్కింది. సభ్యులకు సోమవారం సీట్లు కేటాయించారు. సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని ఈ కేటాయింపు జరిగింది. నిబంధనల ప్రకారం.. స్పీకర్‌కు ఎడమ వైపు ఉన్న బ్లాక్‌ను వైసీపీకి ఇచ్చారు. మాజీ సీఎం, వైసీపీ శాసనసభాపక్ష నేతగా ఉన్న జగన్‌కు అందులో తొలి వరుసలో సీటు కేటాయించారు. ఆ పార్టీ సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కూడా తొలి వరుసలోనే స్థానం లభించింది. ఆ తర్వాతి వరుసలను వైసీపీ సభ్యుల సీనియారిటీ ఆధారంగా కేటాయించారు. అధికార కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ సభ్యులు.. ప్రస్తుత హోదా, సీనియారిటీ ఆధారంగా స్థానాలు పొందారు. ముందు వరుసలో సీఎం చంద్రబాబుకు ఒకటో నంబరు సీటు కేటాయించగా.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రులకు మొదటి వరుసలోనే కేటాయించారు. ఆ తర్వాతి వరుసలో చీఫ్ విప్, విప్‌లకు.. కేటాయించారు. సీట్ల కేటాయింపుపై సభావ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌కు, ఎమ్మెల్యేలకు నడుమ లాబీల్లో సరదా చర్చ సాగింది. జగన్‌కు సీటు ఎక్కడ కేటాయించారని పలువురు టీడీపీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. సీనియారిటీ ఆధారంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సీఎంకు కనిపించే విధంగా సీటు కేటాయించామని, ఆయన తప్పించుకోలేరని పయ్యావుల చమత్కరించారు.

'శ్మశానం' అని సభ ఎలా పెట్టారు?

- అమరావతిపై బొత్సకు అచ్చెన్న సూటి ప్రశ్న
- శ్మశానం అన్నాను.. ఆ సందర్భం వేరు: బొత్స
- మీరు కాటికాపరా?: పంచుమర్తి అనురాధ




అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల మంటలు రేగాయి. మంత్రి అచ్చెన్నాయుడు, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య మాటల తూటాలు పేలాయి. తొలుత టీడీపీ శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.. రాజధాని అమరావతిని బొత్స సత్యనారాయణ గతంలో శ్మశానంతో పోల్చారని అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఇదే విషయాన్ని సూటిగా ప్రశ్నించారు. దీనిపై బొత్స వివరణ ఇస్తూ.. అప్పటి సందర్భం వేరని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చాక మూడు రాజధానులను తమ విధాన నిర్ణయంగా తీసుకున్నట్టు చెప్పారు. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి లేకపోవడం వల్ల వల్లకాడులా మారిందని, అక్కడికి వెళ్లి మీరు ఏం చేయాలని తాను మంత్రిగా మాట్లాడింది వాస్తవమన్నారు. రాగద్వేషాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు వ్యవహరించాలని, అధికార పార్టీకే పని చేయాలని సాక్షాత్తు సీఎం చంద్రబాబు మాట్లాడడం మాట్లాడడం సరైందికాదన్నారు. రుషికొండలో అవినీతి జరిగిందంటున్నారని, అలాంటప్పుడు రుషికొండలో భవనాలు కట్టిన కాంట్రాక్టర్‌కు రూ.80 కోట్లు ఎందుకు చెల్లించారో చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. రుషికొండలో అవినీతి అక్రమాలు జరిగితే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. "ఎమ్మెల్యే అయ్యావ్. మంత్రివి అయ్యావ్. ఇంకా కావడానికి ఏం మిగల్లేదు" అని మంత్రి అచ్చెన్నాయుడును ఉద్దేశించి అన్నారు.

మోసం చేశారు: అచ్చెన్న

రాజధాని అమరావతిలో భవనాలను తాము ఎప్పుడూ తాత్కాలికమని చెప్పలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శాశ్వత భవనాలు నిర్మించే వరకు వీటిని వాడుకుంటామని తెలిపినట్టు చెప్పారు. "రాజధానిని శ్మశానం అన్న పెద్దమనిషిని.. ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం" అన్నారు. శ్మశానం అని ఇదే భవనంలో సభలు సమావేశాలు నిర్వహించారన్నారు. అమరావతికి మద్దతు తెలిపి అధికారంలోకి వచ్చాక రాజధానికి మోసం చేశారని మంత్రి మండిపడ్డారు. అమరావతిలో చదరపు అడుగుకు రూ.10 వేలు చెల్లించామంటూ ఆరోపణలు చేస్తున్నారని, విశాఖలో వైసీపీ పాలనలో రుషికొండలో భవనాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.26 వేలు ఎలా ఖర్చు చేశారని నిలదీశారు. రాజధాని అమరావతి ఒక సామాజికవర్గం కోసం కట్టారంటూ వైసీపీ దుష్ప్రచారం చేసిందన్నారు. కాగా, రాజధానిని శ్మశానం అన్నారు.. మరి ఇక్కడ ఉన్న ప్రజలు ఎవరు? అని పంచుమర్తి అనురాధ ప్రశ్నించారు. "అమరావతి శ్మశానం అయితే మీరు కాటికాపరా?" అని బొత్స సత్యనారాయణను ప్రశ్నించారు.

ఆరోజుకు మూడు రాజధానులు

- ఇప్పుడేంటో పార్టీలో చర్చించి చెపుతాం: బొత్స



అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'మూడు రాజధానులపై నేటి మా వైఖరి ఏమిటో పార్టీలో చర్చించి చెపుతాం' అని శాసన మండలిలో వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో వైసీపీ ఎమ్మెల్సీలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ... 'ఆ రోజుకు మూడు రాజధానులు మా విధానం. ఇప్పుడు మీరు అడుగుతున్నారు కాబట్టి ఈ సమస్య ముందుకు వస్తే మళ్లీ చర్చించుకొని చెపుతాం. అమరావతి నిర్మాణంపై అధికార పక్షం కప్పగంతులేస్తోంది. బడ్జెట్‌పై చర్చను డైవర్ట్ చేయడానికి అధికార పార్టీ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. సచివాలయ భవనాలపై మంత్రులు స్పష్టత ఇవ్వలేదు. తాత్కాలిక భవనాలని ఎప్పుడూ చెప్పలేదని అంటున్నారు. అలాంటప్పుడు కొత్త నిర్మాణాలకు టెండర్లు పిలవడం ఎందుకు? రుషికొండ భవన నిర్మాణాలపై మేం విచారణ కోరుతుంటే ప్రభుత్వం ఎందుకు జంకుతోంది? రాజధాని నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం రూ.6,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. మిగతా ఖర్చుకు ప్రభుత్వానికి స్తోమత లేకే వైసీపీ అమరావతిని నిర్మించలేదని చెప్పారు. రాజధానికి నిధులివ్వద్దని ప్రపంచ బ్యాంకుకు లేఖ రాయాల్సిన అవసరం మాకు లేదు. పోసాని కృష్ణ మురళి ఏదో మాట్లాడినట్లు పత్రికల్లో వస్తే నేను స్పందించాల్సిన అవసరం లేదు. ఆయన వ్యాఖ్యలకు వీడియో లేదా పోలీసుల నిర్ధారణ ఉంటే స్పందిస్తాం' అని బొత్స అన్నారు.

తెలుగులో మాట్లాడమ్మా!

- పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డికి డిప్యూటీ స్పీకర్ సూచన

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సభలో మాట్లాడేటప్పుడు తెలుగులోనే మాట్లాడాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి ఉప సభాపతి రఘురామకృష్ణరాజు సూచించారు. సోమవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న మిగతా ఎమ్మెల్యేలందరూ తెలుగులోనే మాట్లాడగా... పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాత్రం ఆసాంతం ఇంగ్లిష్‌లోనే మాట్లాడారు. ఆమె మాట్లాడటం ముగించిన తర్వాత సభాపతి స్థానంలో ఉన్న రఘురామరాజు స్పందిస్తూ... 'తెలుగులో మాట్లాడితే చక్కగా ఉంటుందని కొంతమంది సభ్యులు సూచించారమ్మా! మీరేం చెప్పారో మీ నియోజకవర్గ ప్రజలకు కూడా స్పష్టంగా అర్థం కావాలంటే తెలుగులో మాట్లాడటమే మంచిది.' అని సూచించారు.

అధ్యక్షా..! జగన్ నా పక్కన కూర్చుంటే సంతోషించేవాడిని

- కొన్ని కోర్కెలు తీరవు ఈశ్వర్... సభలో బీజేపీ ఎమ్మెల్యేతో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి) : 'వైసీపీ అధ్యక్షుడు (జగన్) వచ్చి నా పక్కన కూర్చుంటే చాలా సంతోషించేవాడిని అధ్యక్షా!' అని ఎచ్చెర్ల బీజేపీ ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు అన్నారు. దానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందిస్తూ... 'కొన్ని కోరికలు తీరవ్' అంటూ నవ్వుతూ బదులిచ్చారు. సోమవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా వారిద్దరి మధ్య ఈ సంభాషణ జరిగింది. బడ్జెట్‌పై మాట్లాడడానికి ఎమ్మెల్యే ఈశ్వరరావుకు సభాపతి స్థానంలో ఉన్న రఘురామకృష్ణరాజు అవకాశం ఇస్తూ... త్వరగా ముగించాలని సూచించారు. దీనిపై ఎమ్మెల్యే ఈశ్వరరావు స్పందిస్తూ... 'నా పక్కన 11 మంది (వైసీపీ ఎమ్మెల్యేలు) కూర్చోవాలి అధ్యక్షా..! కానీ వాళ్లు రాలేదు. వాళ్ల సమయమైనా నాకివ్వండి. సభలో సభ్యులకు సీట్లు కేటాయించారు. వైసీపీ అధ్యక్షుని(జగన్)కి నా పక్క సీటే వచ్చింది. వాళ్లు మమ్మల్ని చావు వరకూ తీసుకెళ్లారు. ఈరోజు వచ్చి నా పక్కన కూర్చుంటారేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాను అధ్యక్షా..!' అని అన్నారు.

బడ్జెట్‌లో సమన్యాయం లేదు: పీడీఎఫ్

పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ వెంకటేశ్వరరావు, బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ, 'కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో సమన్యాయం లేదు. ఆదాయం, కేటాయింపులు, ఖర్చుల మధ్య వ్యత్యాసం తీవ్రంగా ఉంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లైనా ప్రజల పరిస్థితి మారలేదు.' అని విమర్శించారు.

వైసీపీ అరాచకాలతో ఆర్థిక విధ్వంసం



శాసన సభలో పలువురు ఎమ్మెల్యేల ధ్వజం

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వ అరాచక, విధ్వంస పాలనతో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ నిర్వీర్యమైపోయాయని శాసనసభలో పలువురు ఎమ్మెల్యేలు విమర్శించారు. దోచుకోవడం.. దాచుకోవడం అనే విధానాన్ని రాజకీయాల్లో ప్రవేశ పెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందని నిప్పులు చెరిగారు. సోమవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ పాలనపై విరుచుకుపడ్డారు. ఆర్థికంగా కుదేలైపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు.

అప్పట్లో అసెంబ్లీ కీర్తి మసకబారింది: బుద్దప్రసాద్

జగన్ పాలనలో శాసనసభ కీర్తిప్రతిష్టలు మసకబారాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. బూతులు మాట్లాడి సభను భ్రష్టు పట్టించారని చెప్పారు. ఆనాటి సభలో పరిస్థితులను చూసి చలించిపోయిన చంద్రబాబు "ఈ కౌరవ సభలో ఉండలేను.. మళ్లీ గౌరవ సభలోనే సగౌరవంగా అడుగు పెడతాను" అని ప్రతిజ్ఞ చేసి సభ నుంచి వెళ్లిపోయారని గతాన్ని గుర్తు చేశారు. చంద్రబాబును రాష్ట్ర ప్రజలు ఆదరించి.. ఎన్నికల్లో గొప్ప తీర్పు చెప్పారని మండలి అన్నారు. ఇప్పుడు శాసనసభలో ప్రతిపక్షమే లేకుండా పోవడం బాధాకరమేనన్నారు. సభలో తమకు ప్రతిపక్ష హోదా కల్పించాలని అడుగుతున్న జగన్ శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున 11 మంది ఎమ్మెల్యేలతో వచ్చి.. గవర్నర్ ప్రసంగిస్తున్నప్పుడు 11 నిమిషాలపాటు ఎలాంటి అరాచకం సృష్టించారో రాష్ట్ర ప్రజలందరూ చూశారని గుర్తు చేశారు. వైసీపీ నేతలకు మొండితనం, మూర్ఖత్వం ఇంకా వదలకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. గత వైసీపీ ప్రభుత్వ నియంతృత్వ పాలనలో భాషా ప్రయుక్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాధ్యమాన్నే తొలగించి మాతృభాషను అవమాన పరిచారని మండిపడ్డారు.

కన్నతల్లికే నచ్చని కొడుకు: యార్లగడ్డ

జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ఎన్నికలకు ఆరు నెలల ముందే తాను చెప్పానని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కన్నతల్లికే నచ్చని కొడుకు రాష్ట్ర ప్రజలకు ఎలా నచ్చుతాడని ఆయన ప్రశ్నించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధులను దారి మళ్లించిందన్నారు. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి విమర్శించా రు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకుండా జగన్ ప్రభుత్వం అభివృద్ధికి తూట్లు పొడిచిందని విమర్శించారు. కాగా.. శాసనసభ సమావేశాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు సమస్యలను ఏకరువు పెట్టారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు.

మదనపల్లె భూ మాఫియాపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చెయ్యాలి

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మదనపల్లెలో భూ మాఫియా వైసీపీ ప్రభుత్వంలో రెచ్చిపోయిందని, ఇప్పటికీ కొనసాగుతున్న అక్రమాల కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి అదుపు చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు రాజధానులు బెంగళూరు, చెన్నై 200 కి.మీ. నుంచి 220 కి.మీ.లోపు ఉండటంతో స్థిరాస్తి ధరలు పెరిగి భూ అక్రమాలు ఎక్కువ అవుతున్నాయని అన్నారు.

విజయవాడలో నీటి విమానాశ్రయం


ప్రకాశం బ్యారేజీ వద్ద ఏర్పాటు చేయనున్న సీ ప్లేన్ వాటర్ ఏరోడ్రోమ్ నమూనా..

- సీప్లేన్ ప్రాజెక్టులో ప్రకాశం బ్యారేజీ వద్ద ఏర్పాటు
- 20 కోట్ల వ్యయంతో ఏఏఐ అంచనాలు
- హైదరాబాద్-ప్రకాశం బ్యారేజీ మార్గంలో బిడ్ల స్వీకరణ!

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మక భావిస్తున్న సీ ప్లేన్ ప్రాజెక్టులో భాగంగా విజయవాడలో నీటి విమానాశ్రయం (వాటర్ ఏరోడ్రోమ్) ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ప్రకాశం బ్యారే జీ వద్ద రూ.20 కోట్లతో వాటర్ ఏరో డ్రోమ్ ఏర్పాటుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అంచనాలు రూపొందించింది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆర్‌సీఎస్ ఉడాన్ 3.1 పథకంలో భాగంగా దీన్ని నిర్మించనున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద దీన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇటీవలే ఏఏఐ అధికారులు వచ్చి పరిశీలన చేశారు. హైదరాబాద్ - ప్రకాశం బ్యారేజీ - హైదరాబాద్ మార్గంలో సీ ప్లేన్లను నడి పేందుకు కొన్ని బిడ్లు కూడా వచ్చినట్టు తెలిసింది. కేంద్ర పౌర విమానయాన శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు చెందిన అధికారులు ఇటీవలే ప్రకాశం బ్యారేజీని సందర్శించారు. దీని ఏర్పాటుకయ్యే రూ.20 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించనున్న నేపథ్యంలో దీంతో పాటు అదనంగా అయ్యే వ్యయాన్ని తిరిగి చెల్లించాలని, ఉడాన్ పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు వరకు పొడి గించాలని అధికారులు కేంద్ర బృందాన్ని కోరారు.

6 లేన్లుగా హైదరాబాద్-విజయవాడ హైవే



- ఖరారైన డీపీఆర్ కన్సల్టెంట్ సంస్థ
- దండు మల్కాపూర్ నుంచి ఏపీలోని గొల్లపూడి వరకు విస్తరణ

హైదరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) ఆరు లేన్ల విస్తరణ ప్రక్రియలో కీలక అడుగు పడింది. ఆ మార్గంలో ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్లను ఆరు లేన్లుగా విస్తరిం చేందుకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివే దిక (డీపీఆర్) తయారీకి కన్సల్టెంట్ సంస్థ ఖరారైంది. ఎన్‌హెచ్-65ను ఆరు లేన్లుగా విస్త రించే అంశంపై అధ్యయనం చేసి సమగ్ర నివే దిక ఇచ్చేందుకు కేంద్ర రవాణా, రహదారుల శాఖ గతేడాది టెండర్లను ఆహ్వానించింది. టెండర్ల ప్రక్రియలో సాంకేతిక బిడ్‌లను 2025 జనవరి 20న తెరవగా, అందులో అర్హత సాధించిన ఫైనల్ టెండర్లను జనవరి 30న తెరిచారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన ఓ కంపెనీ ఈ పనిని దక్కించుకుంది. ఈ సంస్థతో ఈ నెలాఖరు వరకు కేంద్రం ఒప్పందం కుదుర్చుకోనుంది. రహదారి అధ్యయనం, రోడ్డు భద్రత అంశాలు కలిపి డీపీఆర్ తయారీకి రూ.9.86 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ ఒప్పందం జరిగిన తరువాత ఆరు నెలల్లో సమగ్ర నివేదికను సదరు సంస్థ కేంద్రానికి అందించాల్సి ఉంటుంది. ఒప్పందంలో ఇదే విషయాన్ని పొందుపరచనున్నట్టు అధికార వర్గాలు తెలి పాయి. ఎన్‌హెచ్-65 రోడ్డును హైదరాబాద్ అవతల.. అంటే దండు మల్కాపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని గొల్లపూడి వరకు దాదాపు 265 కిలోమీటర్ల మేర ఆరు లేన్లుగా విస్తరించ నున్నారు.

ఆకేపాటి అధీనంలోని ప్రభుత్వ భూములపై..
4 వారాలు యథాతథ స్థితి

- రెవెన్యూ అధికారులు, పిటిషనర్లకు హైకోర్టు ఆదేశం

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం మందపల్లె గ్రామం పరిధి లోని వివిధ సర్వే నంబర్లలో వైసీపీ రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల అధీనంలో ఉన్న ప్రభుత్వ భూముల విషయంలో నాలుగు వారాలపాటు యథాతథ స్థితి పాటించాలని హైకోర్టు రెవెన్యూ శాఖతో పాటు పిటిషనర్లకు కూడా స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రెవెన్యూ ఉన్నతాధికారులను ఆదేశించింది. విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం ఉత్తర్వులిచ్చారు. మందపల్లె పరిధిలో వివి ధ సర్వే నంబర్లలో ఉన్న మొత్తం 19.5 ఎకరాలకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో తమ పేర్లను తొలగించి వాటిని స్వాధీనం చేసుకోవాలని, ఆ భూములకు సంబంధించి సేల్ డీడ్‌లను రద్దు చేయాలని రాజంపేట తహశీల్దార్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ ఆకేపాటి, ఆయన భార్య ఆకేపాటి జ్యోతి, సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీ మణి ఆకేపాటి సుజన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున న్యాయవాది దిలీప్ వాదనలు వినిపించారు.

'వైపీఎస్' జల్సాలకు 'ఫైర్' సొమ్ము!!



(మొదటి పేజీ తరువాయి)

విమానాలు, బస చేసే హోటళ్లు.. ఏవీ ఆయన చెప్పే నీతులకు దగ్గరగా ఉండవు. జగన్ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించి అఖిల భారత సర్వీసు నిబంధనలు ఉల్లంఘించి సస్పెండైన సీఐడీ, ఫైర్ విభాగాల మాజీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ లీలలు తవ్వేకొద్దీ బయటకు వస్తున్నాయి. తన వ్యక్తిగత విదేశీ ప్రయాణాలకు అగ్నిమాపక శాఖలోని సంక్షేమ నిధి నుంచి ఖర్చు చేశారని విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్రంలోని యూనిఫామ్ సర్వీసులు సంక్షేమ నిధుల కోసం పలు ప్రాంతాల్లో పెట్రోలు బంకులు ఏర్పాటు చేసుకున్నాయి. పోలీసు, జైళ్ల శాఖ తరహాలో అగ్నిమాపక శాఖ కూడా చీపురుపల్లి, కైకలూరు, మచిలీపట్నం, గుడివాడ, మార్కాపురం, నంద్యాల, పుత్తూరుల్లో బంకులు పెట్టింది. మొత్తం ఏడు బంకుల్లో విక్రయించే డీజీలు, పెట్రోలుపై ఆయా ఆయిల్ కంపెనీల నుంచి ప్రతి నెలా రూ.45 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ కమీషన్ వస్తుంది. బంకుల్లో పనిచేసే సిబ్బంది జీతాలు, ఇతరత్రా ఖర్చులు పోనూ మిగిలిన సొమ్ము అగ్నిమాపకశాఖ సంక్షేమ ఖాతాలో జమవుతుంది. ఈ డబ్బును ఫైర్ స్టేషన్లలో కనీస వసతులకు, సిబ్బంది సంక్షేమానికి ఖర్చు చేయాలని బైలా చెబుతోంది. అందుకు విరుద్ధంగా సునీల్ కుమార్ విదేశీ యానానికి విమాన టికెట్లను ఆ సొమ్ముతోనే కొనుగోలు చేసినట్లు సమాచారం. సీఐడీ ఏడీజీ నుంచి 2022 జనవరిలో డీజీ పదోన్నతి పొందిన సునీల్‌ను కొన్ని రోజులు పక్కన బెట్టిన జగన్ ప్రభుత్వం.. 2023 మార్చిలో అగ్నిమాపకశాఖ డీజీగా నియమించింది. అప్పటి నుంచి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడే వరకూ కొనసాగిన ఈయన.. విదేశాలకు వెళ్లేందుకు అగ్నిమాపక శాఖ పెట్రోలు బంకుల నుంచి వచ్చిన కమీషన్‌తో టికెట్లు కొన్నారు. అంతటితో ఆగకుండా విదేశాల్లో కొనుగోలు చేసిన సెంటు సీసాలు, ఖరీదైన సూట్‌కేసు సైతం ఇవే డబ్బుతో కొనుగోలు చేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఆయన నడిపిస్తోన్న స్వచ్ఛంద సంస్థ సమావేశాలకు సైతం ఇవే నిధులు ఖర్చు చేశారని, సభల్లో పాల్గొనే వారి భోజనాలు, ఇతరత్రా ఖర్చులకు రూ.60 లక్షల వరకూ వ్యయం చేశారని సమాచారం. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 జూన్ 21న ఆయన్ను బదిలీచేసింది. ఎక్కడా పోస్టింగు ఇవ్వలేదు. అగ్నిమాపక శాఖలో ఉన్న 15 నెలల కాలంలో రూ.10 లక్షల వరకూ ఆయన టీఏ బిల్లులు పెట్టి డ్రా చేసుకున్నట్లు సమాచారం. వాస్తవాలు ఇలా ఉండగా.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపునకు ఆయుధంగా సునీల్‌ను ఉపయోగించుకున్న జగన్‌కు చెందిన రోత పత్రిక మాత్రం.. దళిత అధికారిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు అంటూ రాయడం గమనార్హం. సునీల్‌కుమార్ డీజీగా ఉన్నప్పుడు అగ్నిమాపక కార్యాలయంపైన ఆయన స్వచ్ఛంద సంస్థ సమావేశాలు తరచూ జరిగేవి. వాటి సీసీ ఫుటేజీ తీస్తే గుట్టుమట్లు బయటపడే అవకాశం ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రిమాండ్‌లో మరో రిమాండ్



- టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులోనూ వంశీకి 17 వరకు రిమాండ్ విధించిన సీఐడీ కోర్టు
- కిడ్నాప్ కేసులో ఇప్పటికే జైలులో మాజీ ఎమ్మెల్యే

విజయవాడ, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో రిమాండ్‌లో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి మరో రిమాండ్ పడింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఆయనకు ఈ నెల 17వ తేదీ వరకు విజయవాడలోని సీఐడీ కోర్టు రిమాండ్ విధించింది. టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వంశీ 71వ నిందితుడు. దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను గన్నవరం పోలీసులు నమోదు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం ఈ కేసును సీఐడీకి బదిలీ చేసింది. ఈ కేసులో ఉన్న నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ సమయంలో టీడీపీ కార్యాలయం దళితులకు చెందిన ఆస్తి కాదని, కడియాల సీతా రామయ్య అనే వ్యక్తికి చెందినదని, ఆయన దళితుడు కాదని న్యాయవాదులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు ముందు వాదించారు. దానికి సంబంధించిన ఆధారాలను చూపించారు. న్యాయాధికారి హిమబిందు ఈ కేసులో ఉన్న అట్రాసిటీ సెక్షన్లను తొలగించి, నిందితులకు బెయిల్ తిరస్కరించారు. అనంతరం కేసును సీఐడీ కోర్టుకు బదిలీ చేశారు. తర్వాత ఈ కేసులో ఫిర్యాదుదారుడిగా ఉన్న సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి, బెదిరించిన కేసులో వంశీని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడిలో వంశీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించడంతో సీఐడీ పోలీసులు పీటీ వారంట్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన సీఐడీ కోర్టు న్యాయాధికారి తిరుమలరావు వంశీని వర్చువల్‌గా హాజరుపరచాలని జైలు అధికారులను ఆదేశించారు. వంశీకి ఈనెల 17 వరకు రిమాండ్ విధించారు. సత్యవర్ధన్‌ను బెదిరించి, కిడ్నాప్ చేసిన కేసులో మరో ఇద్దరు నిందితులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ కోర్టు రెండు రోజుల పోలీసు కస్టడీకి ఇచ్చింది.

'బ్యారక్ మార్పు' కాపీలు అందజేయండి

విజయవాడలోని జిల్లా కారాగారంలో ఉన్న వంశీ దాఖలు చేసిన బ్యారక్ మార్పు పిటిషన్ కాపీలను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అందజేయాలని న్యాయాధికారి హిమబిందు కోర్టు సిబ్బందిని ఆదేశించారు.

వంశీపై మరో కేసు

వంశీ, అతని అనుచరులపై మరో కేసు గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిక్కవరం బ్రహ్మయ్యలింగం చెరువు అభివృద్ధి ముసుగులో వేలాది లారీల మట్టిని అక్రమంగా తరలించారని రేవూరి శివరామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇద్దరు ఐపీఎస్‌లపై ఏసీబీ కేసులు

- సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌పై నమోదు
- స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించిన ఐపీఎస్ పల్లె జాషువాపైనా నమోదుకు ఆదేశం
- గవర్నర్ అనుమతి లభించగానే ఇదే కేసులో మాజీ మంత్రి విడదల రజనీపైనా!

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా అవినీతి, అరాచకాలకు పాల్పడిన వైపీఎస్ అధికారులకు కూటమి ప్రభుత్వం వరుస షాకులు ఇస్తోంది. అగ్రిగోల్డ్ డిపాజిటర్ల పేరిట అక్రమాలకు పాల్పడిన సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై ఏసీబీ కేసు నమోదు చేశారు. అలాగే స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించిన ఘటనలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో విజిలెన్స్ ఎస్పీగా పనిచేసిన పల్లె జాషువాపై ఏసీబీ కేసు నమోదుకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ కేసులో మాజీ మంత్రి విడదల రజనీపైనా చర్యలు తీసుకునేందుకు గవర్నర్ అనుమతి కోరింది. అనుమతి రాగానే ఆమెపైనా కేసు పెట్టే వీలుంది. అగ్రిగోల్డ్ లబ్ధిదారుల పేరుతో బాపట్ల జిల్లా రామకూరులో 96 మంది నకిలీ డిపాజిటర్ల ఖాతాల్లోకి లక్షలాది రూపాయలు డిపాజిట్ చేయించిన పీవీ సునీల్ కుమార్... తర్వాత బెదిరించి విత్ డ్రా చేయించినట్టు డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు గత నెలలో ఏసీబీకి ఫిర్యాదు చేశారు. పరిశీలించిన ఏసీబీ ఉన్నతాధికారులు అవినీతి నిరోధక చట్టం 17(ఏ) కింద అనుమతి కోరుతూ ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి అనుమతి లభించడంతో పీవీ సునీల్ కుమార్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. కాగా, మాజీ మంత్రి విడదల రజనీపైనా ఏసీబీ కేసు నమోదుకు రంగం సిద్ధమైంది. గత ప్రభుత్వంలో చిలకలూరిపేటకు చెందిన లక్ష్మీ బాలాజీ స్టోన్ క్రషర్ యజమాని చలపతిని బెదిరించి రెండు కోట్ల రూపాయలు వసూలు చేశారు. రజనీ మొదట తన వ్యక్తిగత సహాయకుడు రామకృష్ణ ద్వారా చలపతికి ఫోన్ చేయించి ఐదు కోట్ల రూపాయలు డిమాండ్ చేయించారు. చలపతి స్పందించక పోవడంతో విజిలెన్స్ ఎస్పీ జాషువాను రంగంలోకి దించారు. జాషువా తీవ్రంగా బెదిరించడంతో రజనీకి 2కోట్లు అందజేసినట్లు బాధితుడు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత సెప్టెంబరులో హోం శాఖ మంత్రి అనితకు ఇచ్చిన ఫిర్యాదులో ఈ మేరకు పేర్కొన్నారు.


గుంటూరు జిల్లా జైలుకు పోసానిని తీసుకువస్తున్న నరసరావుపేట పోలీసులు

పోసానిపై వరుసగా పీటీ వారెంట్లు

(మొదటి పేజీ తరువాయి)

తరలించారు. నరసరావుపేట టూటౌన్ పరిధిలో నమోదైన కేసులో ఆయనను నరసరావుపేట మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రాత్రి 7.15 సమయంలో హాజరు పరిచారు. ఈ సందర్భంగా జరిగిన విచారణలో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ లక్ష్మీ రామ్ నాయక్, పోసాని తరఫున న్యాయవాది రోళ్ల మాధవి వాదనలను వినిపించారు. నిందితుడిపై మోపిన నేరాలకు ఏడు సంవత్సరాలు లోపే జైలు శిక్ష ఉందని రోళ్ల మాధవి వాదించారు. 41 ఏ నోటీసులు జారీ చేయలేదన్నారు. పీటీ వారెంట్‌పై ప్రవేశపెట్టే సమయంలో ఆ నోటీసు ఎలా ఇస్తారని న్యాయాధికారి ప్రశ్నించారు. నిందితునికి 60 ఏళ్లు దాటాయని, అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని, వాటిని పరిగణనలోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేయవలసిందిగా న్యాయవాది మాధవి అభ్యర్థించారు. పోలీసులు తరఫున ఏపీపీ లక్ష్మీ రామ్ నాయక్ వాదనలు వినిపిస్తూ.. పోసానిపై రాష్ట్రవ్యాప్తంగా 15 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వారం రోజుల పోలీస్ కస్టడీకి ఇవ్వాల్సిందిగా పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా తాను రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నానని, గొంతుకు ఆపరేషన్ చేయించుకున్నానని పోసాని చెప్పారు. అయితే వాటికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఏమీ లేకపోవడంతో తక్షణ ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని న్యాయాధికారి ప్రశ్నించారు. అటువంటిదేమీ లేదని పోసాని బదులులిచ్చారు. దీంతో పోసానికి ఈ నెల 13 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి రెడ్డి ఆశీర్వాదం పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాల మేరకు పోసానిని రాత్రి గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. కాగా, పోసానిని తరలించేందుకు నరసరావుపేట సీఐ హైమారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందం సోమవారం ఉదయం రాజంపేట సబ్‌జైలుకు చేరుకున్న సమయంలో ఆయన మళ్లీ డ్రామాలు మొదలుపెట్టారు. తనకు గుండె నొప్పి వస్తోందని చెప్పడంతో వెంటనే రాజంపేటలో డాక్టర్ వికాస్ ఆధ్వర్యంలో పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయనకు గుండెకు సంబంధించిన ఎటువంటి సమస్యలు లేవని గుర్తించిన తర్వాత ప్రత్యేక వాహనంలో నరసరావుపేటకు తరలించారు. నరసరావుపేటలో టీడీపీ ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ కుమార్ 2024 నవంబరు 14న రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐసీపీ 153ఏ, 504, 67ఐటీఏ-2000-2008 కింద పోసానిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో న్యాయాధికారి ఎదుట పోసానిని హాజరు పరిచారు. సినీ నటుడు, వైసీపీ నాయకుడు పోసాని చుట్టూ వారెంట్ల ఉచ్చు బిగుస్తోంది. పోసానిని అదుపులోకి తీసుకోవడానికి పలు జిల్లాల పోలీసులు క్యూ కడుతున్నారు. అనంతపురం రూరల్ పోలీసులు కూడా సోమవారం పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఆయన్ని అదుపులోకి తీసుకునేందుకు అల్లూరి జిల్లా పోలీసులు కూడా పీటీ వారెంట్ కోసం కోర్టు అనుమతి కోరారు.

పోలీస్ స్టేషన్ల చుట్టూ పోసాని

పోసాని చుట్టూ వారెంట్ల ఉచ్చు బిగుస్తోంది. ఇటీవలే అన్నమయ్య జిల్లా ఓబులవారి పల్లె పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి రాజంపేట కోర్టులో ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. రాష్ట్ర వ్యాప్తంగా పద్నాలుగు పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో రాజమహేంద్రవరంలో ఒక్కటి మాత్రమే క్లోజ్ అయింది. మరో పదమూడు కేసులకు గానూ బాపట్ల టౌన్, ఆదోని త్రీ టౌన్, నర్సీపట్నం టౌన్ పోలీసు స్టేషన్లలోని మూడు విచారణ దశలో ఉండగా మరో పది దర్యాప్తు దశలో ఉన్నాయి. ఒక కేసులో బెయిల్ పిటిషన్ వేయగానే మరో స్టేషన్ నుంచి పీటీ వారెంట్‌తో పోలీసులు సిద్ధం అవుతున్నారు.

కూటమికే జేజేలు!

(మొదటి పేజీ తరువాయి)

సాగుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల స్థానంలో టీడీపీ అభ్యర్థి పేరా బత్తుల రాజశేఖర్ కూడా రౌండ్లలో ఆధిక్యం ప్రదర్శించారు. మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన, బలమైన అభ్యర్థిగా మరోమారు 'కృష్ణా-గుంటూరు' బరిలోకి దిగిన కేఎస్ లక్ష్మణరావుకు ఘోర పరాజయం ఎదురవుతోంది. జగన్‌తో అంటకాగడం, వైసీపీ పరోక్ష మద్దతే ఆయన కొంపముంచిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో 'కూటమి' మద్దతు ప్రకటించిన ఇద్దరు అభ్యర్థుల్లో పీఆర్టీయూ అభ్యర్థి శ్రీనివాసులు నాయుడు విజయం సాధించారు. ఏపీటీఎఫ్ నేత రఘువర్మ రెండోస్థానంలో నిలవగా... వైసీపీ పరోక్ష మద్దతు ప్రకటించిన యూటీఎఫ్ అభ్యర్థి విజయగౌరి మూడో స్థానానికి పరిమితమయ్యారు. కానీ... శ్రీనివాసులు నాయుడు గెలుపును కూటమి ఓటమిగా చెప్పుకొంటూ వైసీపీ వింత ప్రచారం మొదలుపెట్టింది.

నాడూ నేడూ వైసీపీకి షాకులే...

వైసీపీ హయాంలో జరిగిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో టీడీపీ విజయ ఢంకా మోగించింది. చివరికి రాయలసీమ పట్టభద్రుల స్థానాన్ని కూడా భారీ మెజారిటీతో తన ఖాతాలో వేసుకుంది. అప్పట్లో టీడీపీ అభ్యర్థులను పోటీలో నిలవకుండా అధికార వైసీపీ తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెచ్చింది. బెదిరింపులకు దిగింది. అన్నింటినీ అధిగవించి టీడీపీ అభ్యర్థులు మూడు పట్టభద్రుల స్థానాల్లో విజయకేతనం ఎగురవేశారు. 'మా ఓటర్లు వేరే ఉన్నారు' అంటూ ఈ ఓటమికి వైసీపీ 'కవరింగ్' ఇచ్చింది. ఇప్పుడు... రెండు చోట్ల అసలు అభ్యర్థులనే నిలపలేక పోయింది. కానీ.. పీడీఎఫ్ అభ్యర్థులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పలికింది. ఇది వారి గెలుపునకు దోహదపడకపోగా, ఓటమికి కారణమైంది. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన కేఎస్ లక్ష్మణరావు విద్యావంతుడు. రెండుసార్లు ఉపాధ్యాయ కోటా నుంచి, మూడోసారి గ్రాడ్యుయేట్స్ కోటా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ వర్గాల్లో మంచిపట్టు, నిజాయితీపరుడిగా పేరుండటంతో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు గట్టి పోటీ ఇస్తారని అంతా భావించారు. పార్టీ తరఫున అభ్యర్థిని నిలపలేని వైసీపీ... లక్ష్మణరావుకు ఒకింత బహిరంగంగానే మద్దతు పలికింది. ఐదేళ్లూ ఆయన వైసీపీ ముఖ్య నేతలతో సన్నిహితంగా మెలిగారు. రాజధాని అమరావతి విధ్వంసంపై స్పందించలేదు. జగన్ వైఖరిని ఖండించలేదు. ఇక... కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు వ్యతిరేకంగా జగన్ పత్రికలో వరుస కథనాలు ప్రచురించింది. కృష్ణా, గుంటూరు వైసీపీ ముఖ్యనేతలు రాజాను ఓడించేందుకు గట్టిగా ప్రయత్నించారు. కొన్ని బూత్‌లలో వైసీపీ నేతలే పీడీఎఫ్ ఏజెంట్లుగా కూర్చున్నారు. ఈ పరిణామాలన్నీ లక్ష్మణరావుపై 'వైసీపీ' ముద్రను వేశాయి. కృష్ణా-గుంటూరు జిల్లాల విద్యావంతులను ఆయనకు దూరం చేశాయి.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి

పట్టభద్ర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికను టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ముఖ్యంగా మంత్రి లోకేశ్ ఎప్పటికప్పుడు ఆయా నియోజక వర్గాల్లోని ఎమ్మెల్యేలతో, ముఖ్య నేతలతో సమీక్షించారు. 'కూటమి' నేతలూ మూకుమ్మడిగా కదిలారు. విశేషమేమిటంటే... ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేలే ఉన్నారు.

వైసీపీ వింత.. వితండ వాదం!

రెండు పట్టభద్ర నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టలేని వైసీపీ.. ఉత్తరాంధ్ర టీచర్స్ స్థానంలో పీఆర్టీయూ అభ్యర్థి గెలుపును కూటమి ఓటమిగా చెప్పుకొనేందుకు నానా తంటాలు పడుతోంది. 'ఉపాధ్యాయులు, యువత కూటమికి వ్యతిరేకంగా ఓటు వేశారు' అంటూ వింత ప్రచారం మొదలుపెట్టింది. నిజానికి... తెలుగుదేశం పార్టీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం ఈ ఎన్నికల బరిలో నిలవలేదు. అయితే... ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి శ్రీనివాసులు నాయుడు, ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మలో ఎవరినైనా గెలిపించాలంటూ ఇద్దరికీ మద్దతు ప్రకటించింది. వీరిద్దరూ గతంలో వైసీపీ అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీకి మద్దతు పలికిన వారే. రఘువర్మ సిట్టింగ్ ఎమ్మెల్సీ కావడంతో మొదటి ప్రాధాన్య ఓటును ఆయనకు, రెండో ప్రాధాన్య ఓటును శ్రీనివాసులు నాయుడికి వేయాలని పార్టీ మద్దతుదారులకు సూచించింది. అదే సమయంలో... యూటీఎఫ్ అభ్యర్థిగా ఉన్న విజయగౌరికి వైసీపీ మద్దతు పలికింది. చివరికి... ఆమె మూడో స్థానంలో నిలిచారు. టీడీపీ మద్దతు ప్రకటించిన ఇద్దరు అభ్యర్థుల్లో ఒకరైన శ్రీనివాసులు నాయుడు గెలుపొందారు. కానీ... వైసీపీ దీనిని కూడా వక్రీకరించి 'టీడీపీకి ఎదురుదెబ్బ' అని తప్పుడు ప్రచారం మొదలుపెట్టింది. 'ఈ ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా జరిగినవేం కానప్పటికీ... ఉత్తరాంధ్రలో కూటమికి వ్యతిరేకంగా ఓటు వేశారు' అని బొత్స పేర్కొనడం గమనార్హం!

వైసీపీకి అబద్ధాలు అలవాటే: అచ్చెన్న

ఉత్తరాంధ్ర టీచర్ ఎన్నికల ఫలితాలపై వైసీపీ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ రఘువర్మ, శ్రీనివాసులనాయుడు ఇద్దరికీ మద్దతు పలికిందని గుర్తు చేశారు. కానీ...యూటీఎఫ్ ముసుగులో వైసీపీ పోటీ పెట్టిందని, ఆ అభ్యర్థి మూడో స్థానానికి పరిమితమయ్యారని తెలిపారు. కాగా, ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఆటలు సాగకపోవడంతో వైసీపీ ఫేక్ ప్రచారానికి తెరతీసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఫేక్ ప్రచారాలతో వాస్తవాలను దాచలేరన్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

గోదావరి పట్టభద్రుల స్థానంలో పేరాబత్తులకు 10 వేల ఆధిక్యం

ఏలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ముందంజలో ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి తొలి రౌండ్ పూర్తయ్యేసరికి ఆయన తన సమీప పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులుపై 10,705 ఓట్ల ఆధిక్యంతో కొనసాగుతున్నారు. పేరాబత్తులకు 16,520 ఓట్లు రాగా.. రాఘవులు 5,815 ఓట్లు, ఇతర అభ్యర్థులు 2,416 ఓట్లు పొందారు. మంగళవారం సాయంత్రం వరకు లెక్కింపు కొనసాగే అవకాశం ఉంది. ఇక్కడ ఓట్ల లెక్కింపులో అసాధారణ జాప్యం చోటు చేసుకుంది. ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రి య ఉదయం 8 గంటలకే ఆరంభమైం ది. 28టేబుల్స్‌పై 17 రౌండ్లుగా బ్యాలెట్ పత్రాలను బండిల్స్‌గా కట్టాలని నిర్ణయించి ఆ మేరకు ముందుకు సాగారు.


ఏలూరులో ఓట్ల లెక్కింపును పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కృష్ణా-గుంటూరు పట్టభద్ర స్థానంలో ఆలపాటి హవా


- తొలి ప్రాధాన్య ఓట్లలో భారీ ఆధిక్యం
- లెక్కింపు ముగిసేసరికి లక్ష దాటే చాన్స్?


కౌంటింగ్ కేంద్రానికి వస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా

గుంటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమికే గ్రాడ్యుయేట్లు జై కొట్టారు. కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజారిటీ దిశగా దూసుకెళ్తున్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ జిల్లాల్లో కూటమి క్లీన్‌స్వీప్ చేసేసింది. దాదాపుగా అదే వాతావరణం ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కనిపిస్తోంది. గత నెల 27వ తేదీన జరిగిన పోలింగ్‌లో 2,41,493 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 371 అందాయి. సోమవారం గుంటూరు ఏసీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ హాలులో ఓట్ల లెక్కింపునకు 28 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌పై వెయ్యి ఓట్ల చొప్పున ఒక్కో రౌండ్‌లో 28 వేల ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఐదు రౌండ్లు ముగిసేటప్పటికి సమీప ప్రత్యర్థి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుపై ఆయన ఐదో రౌండ్‌కు 47,872 ఓట్ల ఆధిక్యం సంపాదించారు. అన్ని రౌండ్లు పూర్తయ్యేసరికి మెజారిటీ లక్ష దాటవచ్చని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. తొలి రెండు రౌండ్లలో ఆలపాటికి 34,721 ఓట్లు రాగా.. లక్ష్మణరావుకు 13,956 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఐదోరౌండ్‌లో ఆలపాటికి 16,916, లక్ష్మణరావుకు 7,535 ఓట్లు వచ్చాయి. కౌంటింగ్ మంగళవారం ఉదయానికి పూర్తవుతుందని అంటున్నారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా గాదె విజయం

- రెండో ప్రాధాన్య ఓట్లతో రఘువర్మపై గెలుపు
- శ్రీనివాసులునాయుడు ఎన్నికవడం మూడోసారి



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించారు. ఆయన రెండో ప్రాధాన్య ఓట్లతో గెలుపొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. గత నెల 27న జరిగిన పోలింగ్‌లో 20,794 ఓట్లు పోలవ్వగా.. అందులో 659 చెల్లనవిగా గుర్తించారు. మిగిలిన 20,135 ఓట్లలో 50 శాతం కంటే ఒక ఓటు అదనంగా సాధించిన వారిని విజేతగా ప్రకటించాల్సి ఉంటుంది. అంటే 10,068 ఓట్లు రావాలి. అయితే తొలి ప్రాధాన్య ఓట్లలో శ్రీనివాసులునాయుడికి 7,210, ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు 6,845, యూటీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి 5,804 ఓట్లు లభించాయి. పోటీలో ఉన్న మిగిలిన ఏడుగురు అభ్యర్థులకు వంద కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. విజయానికి అవసరమైన 10,068 ఓట్లు ఎవరికీ లభించకపోవడంతో అధికారులు రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపును చేపట్టారు. ఈ క్రమంలో తొలుత ఏడుగురు అభ్యర్థులను ఎలిమినేట్ చేశారు. అప్పటికీ మ్యాజిక్ ఫిగర్‌కు ఎవరూ చేరుకోకపోవడంతో మూడో స్థానంలో నిలిచిన విజయగౌరికి వచ్చిన ఓట్ల నుంచి రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించగా.. శ్రీనివాసులునాయుడికి 9,237 ఓట్లు, వర్మకు 8,527 ఓట్లు లభించాయి. ఇంకా శ్రీనివాసులునాయుడి ఎన్నికకు 831 ఓట్లు అవసరమయ్యాయి. దీంతో రెండో స్థానంలో నిలిచిన రఘువర్మకు లభించిన ఓట్ల నుంచి రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. దీంతో మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన 10,068 ఓట్లు రావడంతో శ్రీనివాసులునాయుడిని విజేతగా ప్రకటించారు. ఆయన 2007, 13లో కూడా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.